ఫిబ్రవరి
2015

106

సంపుటి : 9 సంచిక : 10

వెల రు. 10/-

ఈ సంచికలో........

సైద్ధాంతిక రంగంలో పోరాటం
స్వస్తిక్ సైనికులు
కమ్యూనిస్టు పార్టీలో నాయకత్వ ఎన్నిక
నయా-ఉదారవాదం : ప్రజాస్వామ్యం
మూఢనమ్మకాల నిరోధక చట్టం-తెలుగు ప్రజల ముందున్న సవాళ్లు
గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో దళితులు
చారిత్రక భౌతికవాదం : పరాయీకరణ సమస్య
నిరాశాజనక వాతావరణం తొలగిపోయే పరిస్థితులు వస్తున్నాయి
ప్రజావైద్యుడు పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి

శత జయంతి నివాళి

# ప్రజావైద్యుడు పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి

యు. రామకృష్ణ

ఆయనకేనాడూ బ్యాంకు ఖాతా లేదు. బీమా పాలసీ అంతకన్నా లేదు. ప్రజల కోసం బతికితే వారే మన అవసరాలు తీర్చుతారనే సిద్ధాంతం ఆయనది. తాను చనిపోయేనాటికి ఆయన ఒక్క రూపాయి  మిగుల్చుకోలేదు. కొన్ని వేలమందికి ఉచిత వైద్య సేవలందించాడు. లేక్కలేనంతమంది ఆయన నుంచి ఆర్థిక సాయం పొందారు. వారసత్వంగా వచ్చిన ఆస్తిని తాను ప్రాణప్రదంగా భావించే పార్టీకి ఖర్చు పెట్టేశాడు. ఎందరో నిరుపేదలు పోలీసు స్టేషనుకెళ్లి పొందలేని న్యాయాన్ని ఆ డాక్టరు సాయంతో సాధించుకున్నారు. ఎంతోమంది కార్మికులు ఆయన నాయకత్వం కింద తమ హక్కులను సాధించుకున్నారు. విద్యార్థి ఉద్యమ నాయకుడిగా కొన్ని వేలమంది విద్యార్థులను సంఘటితపరిచాడు. ఎందరో వైద్యులు ఆయన వద్ద శిక్షణ పొందారు. సుమారు మూడు వేల మంది జట్లుజట్లుగా ఆయనవద్ద అతిథులుగా ఉంటూ ప్రాథమిక వైద్యంలో శిక్షణ పొందారు. ఆయన అంతిమయాత్రలో రెండు లక్షల మంది పాల్గొన్నారంటే  దేశ చరిత్రలో ఏ డాక్టరుకూ లేనంత మంది ఆయనకు అభిమానులుగా ఉన్నారని అర్థమవుతుంది. ఆయన ప్రఖ్యాత వ్యక్తికాకపోవచ్చు. దేశ నాయకుడూ కాకపోవచ్చు. పచ్చి వ్యాపార మయమైన వైద్య వృత్తిని భూమ్మీదకు దించగల సంస్కారం అందించిన వైద్యుడాయన. ఆయనే డాక్టరు పుచ్చలపల్లి వెంకట రామచంద్రారెడ్డి. ప్రజలు ఆప్యాయంగా పిలుచుకునే రామ్..

రామ్ నెల్లూరు జిల్లా పూర్వపు కోవూరు తాలూకా అలగానిపాడు గ్రామంలో 1915 జనవరి 21న జన్మించాడు. తల్లిదండ్రులు పుచ్చలపల్లి శేషమ్మ, వెంకటరామిరెడ్డి. వీరికి ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. భారతదేశ పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు కీర్తిశేషులు సుందరయ్య వారి రెండో కొడుకు. అందరికన్నా చిన్నవాడు రామ్. ఆనాడే 50 ఎకరాలున్న భూస్వామ్య కుటుంబం వారిది. నాటి మద్రాసు రాష్ట్రంలోని తిరువళ్లూరు జిల్లా



మున్సిఫ్‌గా పనిచేస్తున్న బావ (పెద్దక్క భర్త) వీరాస్వామిరెడ్డి ఇంట ఉంటూ రామ్ మూడేళ్ల పాటు ప్రాథమిక విద్యనభ్యసించాడు. 1924లో వారి బావ తిరువళ్లూరు నుంచి ఏలూరు సబార్డినేటు జడ్జిగా బదిలీ అయ్యారు. రామ్, సుందరయ్య కూడా వారితోపాటు ఏలూరు వచ్చారు. రామ్ ఏలూరు పురపాలక ఉన్నత పాఠశాల్లో నాలుగో తరగతిలో చేరగా, సుందరయ్య ఆరో తరగతిలో ప్రవేశించాడు. తర్వాత వారి బావను రాజమండ్రికి బదిలీ చేశారు. రామ్, సుందరయ్య అక్కడి శిక్షణా పాఠశాల్లో చేరారు. రెండేళ్లపాటు చదువుకున్నారు. ఏదో సందర్భంలో రామ్ మీద వారి బావ చేయిచేసుకున్నారు. అందుకు రామ్‌కూ, సుందరయ్యకూ కోపం వచ్చింది. 'ఇక మీ ఇంట్లో ఉండం. మద్రాసు వెల్లి చదువుకుంటాం' అని చెప్పి ఇంటికొచ్చేశారు. అక్కా, బావ ఎంత బతిమాలినా వారు వినలేదు.

వారిద్దరూ మద్రాసు వెళ్లి 'ట్రిప్లికేన్ హిందూ హైస్కూలు'లో చేరారు. స్కూలుకు దగ్గరలోనే చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నారు. రామ్ హైస్కూల్లో ఉండగానే జాతీయోద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడు. రోజూ గాంధీ టోపీ ధరించి స్కూలుకు వెళ్లేవాడు. నిజాయితీగా బతకాలంటే మన అవసరాలు చాలా తక్కువగా ఉండాలి. ఖరీదైన అవసరాలకూ, ఆడంబరాలకూ అలవాటుపడేకొద్దీ తెలియకుండానే క్రమేణా నీతీ,నిజాయితీనీ కోల్పోతామన్నది రామ్ నమ్మకం. వారి బావ బెంగుళూరు బదిలీ అయ్యారు. రామ్, సుందరయ్యలను బెంగుళూరు వచ్చి తమతో ఉండి చదువుకోవాలని బావ పట్టుబట్టాడు. వాళ్లూ అంగీకరించారు. ఆ సంవత్సరంలోనే జాతీయోద్యమంలో సుందరయ్య జైలుకు వెళ్లాడు. రామ్ చిన్నప్పట్నించీ చాలా పట్టుదల మనిషి. రామ్ మూడో అక్క పెళ్లి భోజనాలకు మాంసంతో పలావు చేయాలని పెద్దలు నిర్ణయించారు. మాంసం వండొద్దని సుందరయ్య, రామ్ పట్టుబట్టారు. అప్పటికి వీరు స్కూల్లో చదువుతున్న పిల్లలని వారి మాటలను ఎవరూ పట్టించుకోలేదు. మాంసంతో పలావు వండి పెద్దరాశి పోశారు. తమ మాట వినకుండా మాంసం వండినందుకు కోపంతో రామ్ రెండు గంపల ఇసుక తీసుకొచ్చి పలావులో కలిపేశాడు. ఏం చేయలేక పెద్దలు దాన్ని పారబోశారు. చిన్నప్పట్నించీ రామ్‌కు మొండి పట్టుదలతోపాటు అన్న సుందరయ్యంటే విపరీతమైన భక్తీ, గౌరవమూ ఉండేవి. ఇంటర్మీడియట్ పూర్తికాగానే రామ్‌కు ఇంజనీరింగులోనూ, మెడిసిన్‌లోనూ సీటొచ్చింది. సమాజానికి సేవ చేయాలంటే ఇంజనీరింగు కంటే మెడిసిను చదవడమే మంచిదనీ, ప్రజలకు ప్రత్యక్షంగా సేవచేసే అవకాశం లభిస్తుందనీ సుందరయ్య సలహా ఇచ్చారు. రామ్ మద్రాసులో ఉండగా ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్)ను స్థాపించడంలో ప్రముఖపాత్ర వహించాడు. రామ్ 1933-38 మధ్య మద్రాసులో మెడిసిన్ పూర్తిచేశాడు. తన సహాధ్యాయి సుగుణను వివాహం చేసుకున్నాడు.

రామ్ 1940లో నెల్లూరు బార్కాస్‌లో ప్రజావైద్యశాలను ప్రారంభించాడు. రామ్ మెడిసిన్ చదివేటప్పుడే ఆస్తి పంపకాలు జరిగిపోయాయి. సుందరయ్య తన వాటాగా వచ్చిన ఆస్తిని పెద్దన్న రమణారెడ్డికి అమ్మేసి, డబ్బును కమ్యూనిస్టు పార్టీకి ఖర్చు పెట్టాడు. సుందరయ్య ఏం చెప్పినా రామ్ అంగీకరించేవాడు. ఆ ధైర్యంతోనే రామ్ పేరిట వచ్చిన ఆస్తినీ అమ్మేసి పార్టీ కోసం ఖర్చు పెట్టాడు. రామ్ ఆసుపత్రి పెట్టేనాటికి ఆయన పేరుతో ఒక్క పైసా ఆస్తి లేదు. అసుపత్రి స్థాపన కోసం పెద్దన్న ఐదు వేల రూపాయలిచ్చాడు. రామ్ ప్రారంభించిన ఆసుపత్రిలో తానూ, భార్య సుగుణా, మిత్రుడు

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...

**1. ప్రజావైద్యుడు పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి**
– యు. రామకృష్ణ 2

**2. సైద్ధాంతిక రంగంలో పోరాటం**
– సీతారామ్ ఏచూరి 4

**3. స్వస్తిక్ సైనికులు**
– ఎ.జి. నూరాని 9

**4. కమ్యూనిస్టు పార్టీలో నాయకత్వ ఎన్నిక**
– ఎస్. వీరయ్య 14

**5. నయా-ఉదారవాదం : ప్రజాస్వామ్యం**
– ప్రభాత్ పట్నాయక్ 16

**6. మూఢనమ్మకాల నిరోధక చట్టం - తెలుగు ప్రజల ముందున్న సవాళ్లు**
– పెన్మత్స సుబ్బరాజు 22

**7. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో దళితులు**
– కొండూరి వీరయ్య 27

**8. చారిత్రక భౌతికవాదం: పరాయీకరణ సమస్య**
– టి.ఆర్. క్విగ్‌లీ 30

**9. నిరాశాజనక వాతావరణం తొలగిపోయే పరిస్థితులు వస్తున్నాయి**
– బివి రాఘవులు 27

**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్:** ఎడిటోరియల్ **0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail: svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org

# పరతంత్రం

ఏ విదేశీ నాయకుడు మన దేశ సందర్శనకు వచ్చినా గౌరవపూర్వకంగా ఆహ్వానం పలికి, ఆతిథ్యమివ్వడం సంప్రదాయం. అమెరికా అధ్యక్షులు బరాక్ ఒబామాగారు మన దేశానికి అతిథిగా వచ్చినప్పుడు ఆయనకు కూడా అటువంటి ఆహ్వానమే ఇవ్వాలి. కాకపోతే అగ్రరాజ్యాధినేత కనుక మర్యాదలు మరికొంచెం పకడ్బందీగా చేశారనుకుంటే అర్థం ఉంది. కానీ ఒబామా పర్యటన సందర్భంగా మన పాలకులు, మన కార్పొరేట్ బేహారులు దేశ ప్రజల ప్రయోజనాలను కూడా పక్కన బెట్టి సామ్రాజ్యవాద దేశాధినేతకు చేసిన సాష్టాంగ ప్రమాణాలు జుగుప్సాకరంగా ఉన్నాయి.

రిపబ్లిక్ డే అంటే మన దేశం ఒక స్వంత రాజ్యాంగంతో, స్వయం పాలనను ఏర్పాటు చేసుకున్న రోజు. కానీ అదే రోజున ఒబామాను పిలిపించి, అమెరికా ఇష్టప్రకారం అణుఒప్పందంలో మార్పులు చేసి, మన రక్షణ రంగంలో కీలక అంశాలు వారి చేతిలోపెట్టి, అది చెప్పినట్లు మన ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన మార్పులు చేసి, అన్నిటికన్నా ముఖ్యంగా అమెరికా యుద్ధ వ్యూహంలో మన దేశాన్ని జూనియర్ భాగస్వామిగా చేయడం అంటే మనం సాధించుకున్న గణతంత్ర పరిపాలను వమ్ముచేయడమే. అందువల్ల ఒబామా భారత్ సందర్శన, ఈ సందర్భంగా అమెరికాతో మన దేశం కుదుర్చుకున్న ఒప్పందాలు.. ఇవన్నీ కూడా మన దేశానికి సంబంధించి ముఖ్యమైన తిరోగమన చర్యలు.

మన దేశానికి ఏ మార్గం ప్రయోజనకరం? 1. ఇరుగు పొరుగు దేశాలతో సఖ్యతగా ఉండి, వర్తక వాణిజ్య సంబంధాలు పెంపొందించుకోవడం. దానివల్ల సరిహద్దుల్లో శాంతి ఏర్పడుతుంది. మన రక్షణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. ప్రజల అభివృద్ధికి నిధులు లభిస్తాయి. పొరుగుదేశాలతో వాణిజ్యం దేశంలో పారిశ్రామిక పెరుగుదలకు తోడ్పడుతుంది. ప్రజలకు ఉపాధి లభిస్తుంది. 2. అమెరికా యుద్ధ వ్యూహంలో భాగస్వాములం కావడం. చైనా, రష్యా, ఇరాన్‌లను నిలువరించేందుకూ, యుద్ధం వస్తే దాన్ని ఆసియాలో యుద్ధంగా మార్చేందుకూ అమెరికా వ్యూహం రచించింది. దీన్ని ఆసియా కేంద్రం, చైనా కేంద్రం (చైనా పైవొట్) అంటున్నారు. ఇందులోకి దక్షిణకొరియా, జపాన్, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్‌లను లాగింది. ఇప్పుడు భారత్‌ను లాగుతోంది. దీనివల్ల మన దేశం చైనా, రష్యా, ఇరాన్‌లతోనే కాదు, రానున్న కాలంలో అమెరికా చెప్పిన దేశాలన్నిటితో యుద్ధానికి సంసిద్ధం కావాలి. దానివల్ల మన పొరుగుదేశాలతో మరింత వైరం పెరుగుతుంది. అంతర్గత, సరిహద్దు రక్షణకోసం విపరీతంగా ఖర్చు చేయాలి. వాణిజ్యానికి అమెరికా మీద ఆధారపడాలి. పర్యవసానాలు స్పష్టమే. రక్షణ, వాణిజ్యం తదితర రంగాల్లోకి అమెరికా, యూరప్ నిధులు రావచ్చు. కానీ ఆ నిధులన్నీ రక్షణకోసమే ఖర్చయితే ప్రజల బాగుకు నిధులుండవు. ఇరుగుపొరుగు దేశాలతో వాణిజ్యం తగ్గితే పారిశ్రామికాభివృద్ధి మందగిస్తుంది. ఉపాధి తగ్గుతుంది. ఈ మార్గంలో పోతే మన దేశంలో కొద్దిమంది కార్పొరేట్ వర్గాల లాభాలు ఇబ్బిడి ముబ్బిడిగా పెరగవచ్చుగాక కానీ దేశ ప్రజల విశాల ప్రయోజనాలు దెబ్బతింటాయి.

మన పాలక వర్గాలు మొదటి మార్గాన్ని విడిచిపెట్టి రెండో మార్గాన్ని ఎన్నుకున్నారు. అందుకే కార్పొరేట్ల వలన, కార్పొరేట్ల కోసం, కార్పొరేట్లచేత పాలించబడుతున్న మోడీ సర్కారు అమెరికా వ్యూహంలోకి దేశాన్ని నడిపిస్తోంది. గణతంత్ర వ్యవస్థను 'పరతంత్ర' వ్యవస్థగా మారుస్తోంది. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్నాడు గురజాడ. దేశమంటే కార్పొరేట్లు కాదోయ్ దేశమంటే ప్రజలోయ్ అని చాటాల్సిన సమయమొచ్చింది.

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ. 10**, సంవత్సర చందా: **రూ. 100**, పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు**
**(సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.హెచ్ భవన్ (ప్రజాశక్తి కార్యాలయం),**
**అజామాబాద్, హైదరాబాద్- 20**

# సైద్ధాంతిక రంగంలో పోరాటం

**సీతారామ్ ఏచూరి**



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యులు

అక్టోబర్‌సోషలిస్టు మహా విప్లవం విజయం సాధించిన 47వ వార్షికోత్సవం సందర్భంగా 1964 నవంబరు 7వ తేదీన సిపిఐ (యం) ఏడవ మహాసభలో, పార్టీ ఆవిర్భావాన్నీ, విప్లవ కార్యాచరణనూ ప్రకటించింది. భారత కమ్యునిస్టు పార్టీ 1920 అక్టోబరు 17వ తేదీన తాష్కెంట్‌లో ఏర్పడిందన్నదే సిపిఐ(యం) అభిప్రాయం. కాని సి.పి.ఐ మాత్రం 1925 డిసెంబరు 28–30 తేదీలలో, ఆ నాటి బ్రిటిష్ వలసపాలనలోని, సంస్థానాలలోని కమ్యూనిస్టు గ్రూపులన్నీ కాన్పూరులో సమావేశమైన సందర్భంలోనే కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భవించి నట్లుగా భావిస్తున్నది. ఈ సమావేశానికి మద్రాస్ ప్రెసిడెన్సీలోని కమ్యూనిస్టు నాయకుడు సింగారవేలు చెట్టియార్ అధ్యక్షత వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో వేర్వేరు కమ్యూనిస్టు గ్రూపులు పనిచేస్తూ ఉండకపోతే ఈ సమావేశం జరిగే అవకాశమే ఉండేదికాదు. స్వాతంత్రోద్యమ కాలంలో 1921లో అహమ్మదాబాద్‌లో జరిగిన ఎ.ఐ.సి.సి సమావేశంలో సంపూర్ణ స్వరాజ్యం మన డిమాండ్‌గా ఉండాలనే తీర్మానాన్ని ఇద్దరు కమ్యూనిస్టు నాయకులు, మౌలానా హజరత్ మొహానీ, స్వామి కుమారానంద్‌లు కమ్యునిస్టు పార్టీ తరపున ప్రవేశ పెట్టారు. ఆ తీర్మానాన్ని గాంధీజీ అంగీకరించలేదన్నది వేరే విషయం. అప్పటికి గాంధీగారు కేవలం స్వపరిపాలనను, అంటే బ్రిటిష్ సామ్రాజ్యంలోనే భారతీయులను కూడా బ్రిటిష్ పౌరులతో సమానంగా పరిగణించాలని డిమాండ్ చేస్తున్నారు. 1929 డిసెంబరు 31న జరిగిన లాహోర్ సమావేశంలో సంపూర్ణ స్వరాజ్యం కావాలని ఎఐసిసి తీర్మానం చేసింది. 1921లోనే కమ్యూనిస్టు పార్టీ ఈ తీర్మానాన్ని ప్రవేశ పెట్టిందంటే పార్టీ అంతకుముందే స్థాపించబడినట్లే కదా!

సి.పి.ఐ. మితవాద వర్గ సంకర విధానాలతో విడగొట్టుకొని, 1964లో మనం పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినప్పుడు, భారత విప్లవోద్యమ అగ్రగామిగా, నిజమైన వారసులంగా పరిగణించుకుని, ఆ మహాసభను ఏడవ మహాసభగా చెప్పామే కాని మొదటి మహాసభ అనిచెప్పలేదు. అంటే ఈ 50వ వార్షికోత్సవం పార్టీ ఆవిర్భవించిన 94వ వార్షికోత్సవం అవుతుంది.

1982 జనవరిలో జరిగిన సిపిఐ(ఎం) 11వ మహాసభ రాజకీయ, నిర్మాణ నివేదిక ఈవిధంగా చెప్పింది. “1955–62 మధ్య సరైన సైద్ధాంతిక రాజకీయ విధానం కోసం భారత కమ్యూనిస్టు పార్టిలో జరిగిన అంతర్గత పోరాటం 1963–64లో పార్టీ చీలిపోయి సిపిఐ(యం) ఆవిర్భవించటంతో ముగిసింది. సైద్ధాంతిక, రాజకీయ, జాతీయ, అంతర్జాతీయ అంశాలపై రెండింటి మధ్య ఉన్న తీవ్రమయిన విబేధాలే ఈ చీలికకు కారణం.”

ఇంకా ఇలా చెప్పింది “భారత రాజ్యాంగ యంత్రం, ప్రభుత్వం యొక్క వర్గ స్వభావాన్ని అంచనా వేయడంలో వచ్చిన విభేదాలు ఆ తరువాత కాలంలో పరస్పర విరుద్ధమైన రెండు కార్యక్రమాలనూ, రాజకీయ ఎత్తుగడలనూ రూపొందించుకోవటానికి దారితీశాయి”.

సి.పి.ఐ.(యం) ఏడవ మహాసభ, 20వ వార్షికోత్సవం (1984 నవంబర్ 7వ తేదీ) సందర్భంగా పీపుల్స్ డెమోక్రసీలో ఓ ప్రత్యేక వ్యాసం వ్రాస్తూ కా॥ బి.టి. రణదివే ఏడవ కాంగ్రెస్ గురించి ఇలా అన్నారు “భారత రాజ్యాంగ యంత్రం, ప్రభుత్వం యొక్క వర్గ స్వభావాన్ని, దాని ఆధారంగా విప్లవంలో కార్మికవర్గ కర్తవ్యాలనూ అంతర్గతంగా అంచనా వేయడం అత్యంత కీలక మయినది.” ఇది బుర్జువా భూస్వామ్య రాజ్యమనీ, దీనికి బడా బుర్జువా వర్గం నాయకత్వం వహిస్తున్నదనీ, వీరువిదేశీ ద్రవ్య పెట్టుబడి దారులతో మిలాఖత్ అవుతున్నారని సిపిఐ(యం) నిర్ధారణకు వచ్చింది. అంటే జనతా ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం ఈ ప్రభుత్వానికీ, రాజ్యాంగ యంత్రానికీ వ్యతిరేకంగా నిరంతరం, ఏ మాత్రం రాజీలేని పోరాటం చేయవలసి ఉంటుంది. అందువలననే సిపిఐ(యం) అణచివేతలను ఎదిరించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్నది. బెంగాల్‌లో అర్ధఫాసిస్ట్ నిర్బంధానికి వ్యతిరేకంగానూ, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లలో పార్టీపై సాగిస్తున్న హత్యాకాండకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడుతున్నది. వామపక్షాలకు, ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకంగా జరుగుతున్న అణచివేతను ఎదుర్కొంటూ, ఒక్కొక్కసారి ఇతర వామపక్షాలన్నీ వదిలి వెళ్ళిపోయినా, ఈ కాలమంతా సి.పి.ఐ.(యం) ఒంటరిగా కూడా పోరాటం చేసున్నది.

“భారతదేశపు రాజ్య స్వభావాన్ని సిపిఐ ఎలా అర్థం చేసుకుంటున్నది? భారతదేశాన్ని గుత్త, గుత్తేతర బుర్జువా వర్గం మొత్తం కలిసి పాలిస్తున్నారని వారి అంచనా. నిజానికి ప్రభుత్వం, రాజ్యం గుత్తేతర బూర్జువావర్గం ఆధిపత్యంలో ఉందని వారు అంచనా వేస్తున్నారు.”

ప్రజాతంత్ర విప్లవదశ గురించిన అంచనాలో తేడాలేమీ లేనప్పటికీ, రాజ్యాంగ యంత్రం వర్గ స్వభావం, భారత బూర్జువావర్గం యొక్క ద్వంద్వ స్వభావాన్ని అంచనా వేయటంలోనూ, వాటికనుగుణంగా సరైన ఎత్తుగడలను రూపొందించుకోవటంలోనూ ఇరువురి మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నాయి.

ఈ విషయాలన్నింటిపై ఇప్పటికే చాలా వ్యాసాలు వచ్చాయి. ఈ సంవత్సర కాలంలో మరిన్ని వ్యాసాలు వస్తాయి. ఈనాటికి కూడా ప్రాధాన్యతాంశాలుగా, సి.పి.ఐ(యం)కు మౌలిక


పునాదులుగా ఉన్న కొన్ని సైద్ధాంతిక అంశాలపై నేను కేంద్రీకరిస్తాను. సిపిఐ(యం) ఏర్పడడానికి, తరువాతి కాలంలో దేశ కమ్యూనిస్టు ఉద్యమంలో పార్టీ నాయకత్వ శక్తిగా ఎదగడంలో ఈ అంశాలు ప్రధానమైనవిగా ఉన్నాయి.

ఈ విషయాలు ప్రస్తావించే ముందు, కమ్యూనిస్టు ఉద్యమ సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు చాలా మంది తరచుగా లేవనేత్తే అంశం పార్టీలో భిన్నాభిప్రాయాలు, చీలిక రాకుండావుంటే, కమ్యూనిస్టు ఉద్యమం ఈనాడున్న స్థితికన్నా మెరుగైన స్థితిలో ఉండేదికదా అని అడుగుతుంటారు. ఈ అంశాలపై ముందుగా మాట్లాడతాను.

ఇంతకు ముందు ప్రస్తావించిన వ్యాసంలోనే ఈ విషయంపై కా॥ బి.టి. రణదివే ముప్పై సంవత్సరాల క్రితమే ఇలా చెప్పారు. "కమ్యూనిస్టు పార్టీలోని ఏ అర్ధరహితమైన చీలిక అయినా నేరపూరితమే. సరైన పంథాను వ్యతిరేకించి, చీలికకు కారణమైన వారు ప్రజలనుండి దూరమవుతారు. వారి తప్పుడు విధానాలను సరిచేసుకోకపోతే ఒక రాజకీయశక్తిగా ఉండే స్థితిని కోల్పోతారు. అదే సమయంలో పార్టీపై ఆధిపత్యం వహించే నాయకత్వం తప్పుడు విధానాలను అనుసరిస్తూ, వాటిని మార్చుకునేందుకు సిద్ధం కాకపోతే, పార్టీని వర్గ సంకర విధానాల వైపుకు తీసుకొనిపోవాలనే దృఢ సంకల్పంతో ఉంటే పార్టీలో విభేదాలూ, చీలికలూ తప్పనిసరిగా వస్తాయి. ఆ విధానం వలన వాటిల్లిన హానికరమైన నష్టాలను మనం ఆచరణలో చూశాం." తరువాతి కాలంతో సిపిఐ(యం) ఒక పెద్ద వామపక్షశక్తిగా ఎదగటం మన అవగాహన సరైనదేనని రుజువు చేస్తున్నది.

సి.పి.ఎస్.యూ 20వ మహాసభ నిర్ణయాల వలన అనర్ధదాయక ఫలితాలు వస్తాయని, అవి రివిజనిజానికి, వర్గ సంకర విధానానికి దారి తీస్తాయని సిపిఐ(యం)ను స్థాపించినపుడు, ఆ తరువాత 1968లో బర్ద్వాన్‌లో సైద్ధాంతికాంశాలపై జరిగిన ప్లీనంలోనూ పార్టీ నిర్ణయానికి వచ్చింది. వారి విధానాలు మితవాద దిగజారుడుకు, వర్గసంకర విధానానికి ఏ విధంగా దారితీశాయో చూశాం. 1990 మే 28–31తేదీలలో జరిగిన సిపిఐ(యం) కేంద్ర కమిటీ సమావేశంలో ఆమోదించిన తీర్మానం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన ఈ మితవాద ధోరణుల ఫలితాలను వివరించింది. "మితవాద విధానాల వలన చాలా కమ్యూనిస్టు పార్టీలు నాశనమయి పోయాయి. ఈజిప్టు, సూడాన్, ఇరాక్, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలలోని కమ్యూనిస్టుపార్టీలు ఈ మితవాద దాడికి బలైపోయాయి. ఫలితంగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం బలహీన పడింది". దురదృష్టకరమైన ఇండోనేషియా అనుభవాన్ని చూస్తే అక్కడ బలమైన కమ్యూనిస్టుపార్టీ కూడా క్రూరంగా నాశనం చేయబడటం మన గమనంలో ఉండాలి.

> **❝ మన దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం తుడిచిపెట్టుకు పోకుండా ఉండడానికి రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటమే కారణం. ఆ విధంగా రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం ఎంతో కీలక ప్రాధాన్యతను కలిగి వుంది. కాబట్టి మితవాద,వర్గసంకర విధానాలకు వ్యతిరేకంగా సి.పి.ఐ.లో వచ్చిన చీలిక భారతకమ్యూనిస్టు ఉద్యమంలోని విప్లవకర సారాంశాన్ని కాపాడటానికీ, దాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్ళటానికీ పయోగపడింది. ❞**


బి.టి. రణదివే

మన దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం తుడిచిపెట్టుకుపోకుండా ఉండడానికి రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటమే కారణం. ఆ విధంగా రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం ఎంతో కీలక ప్రాధాన్యతను కలిగి వుంది.కాబట్టి మితవాద,వర్గసంకర విధానాలకు వ్యతిరేకంగా సి.పి.ఐ.లో వచ్చిన చీలిక భారతకమ్యూనిస్టు ఉద్యమంలోని విప్లవకర సారాంశాన్ని కాపాడటానికీ, దాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్ళటానికీ పయోగపడింది.

భారతదేశంలోనూ, మూడవ ప్రపంచ దేశాలలోనూ కమ్యూనిస్టు ఉద్యమాన్నిఅంతం చేసే మితవాద ప్రభావాన్ని సరిగానే అంచనా వేసినా, దాని తీవ్రతను అంచనా వేయడంలో విఫలమయినట్లు సిపిఐ(యం) ఆత్మ విమర్శనాపూర్వకంగా చెప్పుకుంది. (1990 మే 28–31 సి.పి.యం.కేంద్రకమిటి తీర్మానం, తర్వాత 1992 జనవరిలో జరిగిన 14వ మహాసభ తీర్మానం) "రివిజనిజం, అతివాద పెడధోరణులు అంతర్జాతీయ కార్మికోద్యమాన్ని బలహీనపరచడమేకాక, వర్గపోరాటాల పదునును కూడా తగ్గించే ఎత్తుగడలను అనుసరించాయి. ఇది ప్రపంచంలోని కార్మికోద్యమాలపైనేకాక, సోషలిస్టు దేశాలలో ఉన్న ప్రజల సామూహిక చైతన్యాని కూడా ప్రభావితం చేసింది. "సి.పి.ఐ.(యం) చెప్పిన ఈ అంశం ఆ తరువాత కాలంలో ప్రపంచంలోని సోషలిస్టు దేశాలకు తగిలిన ఎదురుదెబ్బలతో రుజువైంది. ఈ అవగాహన ఆతర్వాత 14వ మహాసభ సైద్ధాంతిక తీర్మానంలో మరింతగా వివరించబడింది. సోవియట్ యూనియన్‌లోనూ, ఆ తర్వాత తూర్పు యూరప్‌లోనూ సోషలిజం విచ్ఛిన్నంపై మన అవగాహనను ఆ తీర్మానంలో వివరించాం.

తరువాత వామపక్ష అతివాద పెడధోరణి తలెత్తటం, ఈ పెడధోరణికి వ్యతిరేకంగా సి.పి.ఐ.(యం) చేసిన పోరాటంలో పార్టీ, దాని సైద్ధాంతిక అవగాహనా మరింతగా పదునెక్కింది. భారతదేశంలో విప్లవోద్యమాన్ని శాస్త్రీయ దృక్పథంతో మార్క్సిస్టు–లెనినిస్టు పంథాలో నడిపిస్తూ ముందుకు తీసుకుపోవటానికి పార్టీ కృషి చేస్తున్నది.

ఈ రెండు పెడధోరణులకు వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో సైద్ధాంతిక పోరాటం చేస్తున్నప్పటికీ, భారతదేశంలో మితవాద పెడధోరణిని సమర్ధిస్తున్న సోవియట్ యూనియన్‌ను గానీ, సోషలిస్టేతర దేశాలలో కొన్ని సంవత్సరాలు నక్సలైట్ల అతివాద దుందుడుకు చర్యలను సమర్ధించిన చైనానుగానీ నిందించకుండా మనం ఈ పోరాటాన్ని కొనసాగించాం. రెండుదేశాల

**❝ఈ దశాబ్దాల అనుభవాలనుంచి మనం నేర్చుకున్న దేమంటే కమ్యూనిస్టు పార్టీలకు నిజమైన పరీక్ష తమ తమ దేశాల నిర్దిష్ట పరిస్థితులను అంచనా వేయటం, మార్క్సిజం-లెనినిజాన్ని అన్వయించటం, అందుకనుగుణమైన ఎత్తుగడల పంథాను రూపొందించుకోవటంలో ఉంటుంది. పార్టీ సైద్ధాంతిక నిబద్ధతను మరింత ధృఢపరచుకోవటం, దేశంలో దోపిడీకి గురవుతున్న ప్రజలతో సంబంధాలను మరింత బలపరచుకోవటం ద్వారానే దీనిని సాధించగలం.❞**

పాలక కమ్యునిస్టుపార్టీలు మార్క్సిస్టు–లెనినిస్టు మౌలిక సూత్రాలను తీవ్రంగా ఉల్లంఘిస్తు న్నాయకనీ, సోషలిజాన్ని నిర్మించే క్రమంలో తీవ్రమైన తప్పులు చేస్తున్నాయనీ మనం బహిరంగంగానే విమర్శించాం. ఆ విధంగా సుమారు పావు శతాబ్దం పాటు సి.పి.ఐ.(యం) అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం నుండి "ఒంటరిపాటు" కావాల్సివచ్చింది.

ఈ సందర్భంగా ఇ.ఎమ్.ఎస్ నంబూ ద్రిపాద్ మాటలను గుర్తు చేసుకుందాం. 1964 లో జరిగిన సి.పి.ఐ. ఏడవ మహాసభకు అన్ని దేశాల కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు హాజరు కాగా, సి.పి.ఐ.(యం) మహాసభకు ఏ ఒక్క పార్టీ ప్రతినిధి కూడా హాజరు కాలేదు. ఆ సందర్భంగా విలేకరులు నంబూద్రిపాద్‌ను "సి.పి.ఐ.(యం)కి ఎవరు మద్దతిస్తున్నారు?" అని ప్రశ్నించగా "భారతదేశ ప్రజలు" అని నంబూద్రిపాద్ తన సహజ ధోరణితో సమాధా నం చెప్పారు.

అవిశ్రాంత కృషి, శ్రామిక వర్గంలో మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయడం వల్లనే ఈ రోజు సి.పి.ఐ(యం) భారత దేశంలో ఒక గణనీయమైన కమ్యునిస్టు శక్తిగా ఎదిగింది. దేశంలో ఎమర్జన్సీ ఓడిపో యిన తరువాత, బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాలను ఏర్పా టు చేసి, భారత రాజకీయాలను ప్రభావితం చేయటం ప్రారంభమైన తరువాత మాత్రమే అంతర్జాతీయ కమ్యునిస్టు ఉద్యమంలోని వివిధ పార్టీలు సి.పి.ఐ.(యం)తో సంబంధాలను పునరుద్ధరించుకోవటానికి పూనుకున్నాయి. సోవియట్ యూనియన్, ఇతరదేశాలు 1980వ దశాబ్దం నుండి మాత్రమే వివిధ సందర్భా లలో సౌహార్ద పర్యటనలకు ఆహ్వానిస్తున్నాయి. 1983లో మాత్రమే చైనా కమ్యూనిస్టు పార్టీ చొరవతో, ఆపార్టీతో సంబంధాలు పునరుద్ధ రించబడ్డాయి.

ఈ దశాబ్దాల అనుభవాలనుంచి మనం నేర్చుకున్న దేమంటే కమ్యూనిస్టు పార్టీలకు నిజమైన పరీక్ష తమ తమ దేశాల నిర్దిష్ట పరిస్థితులను అంచనా వేయటం, మార్క్సిజం–లెనినిజాన్ని అన్వయించటం, అందుకనుగుణ మైన ఎత్తుగడల పంథాను రూపొందించు కోవటంలో ఉంటుంది. పార్టీ సైద్ధాంతిక నిబద్ధ తను మరింత ధృఢపరచుకోవటం, దేశంలో దోపిడీకి గురవుతున్న ప్రజలతో సంబంధాలను మరింత బలపరచుకోవటం ద్వారానే దీనిని సాధించగలం. మనం 50వ వార్షికోత్సవం జరుపుకుంటున్న ఈ సందర్భంలో పార్టీ అంతా ఈ అంశాలను గమనంలో ఉంచుకోవాలి.

### ప్రపంచంలో సామాజిక వైరుధ్యాలు

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలోని మితవాద పోకడలపై మొద ట్లో సరైన పద్ధతిలో పోరాటం ప్రారంభించిన చైనా కమ్యూనిస్టుపార్టీ, తరువాత కాలంలో అతివాద దుందుడుకు వాదానికి లోనవడంతో, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం తీవ్ర మయిన చీలికలకు గురయింది. ఈ విభేదాలను పరిష్కరించుకునేందుకు 1957లో కొన్ని కమ్యూనిస్టు పార్టీలతో సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం 1960లో 81 కమ్యూనిస్టు పార్టీలతో సమావేశం జరిగింది. సిపిఐ(యం) 14వ మహాసభలో మనం చేసిన తప్పులను ఆత్మవిమర్శనాపూర్వకంగా అంగీ కరించి, 1960లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానంలోని పొరపాటు అవగాహనను సరిచేసుకున్నాం. (ఆ తీర్మానంలో మనం కూడా భాగస్వామిగా ఉన్నాం) ఆ తీర్మానంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పరిస్థితులలో మార్పులకు అనుగుణంగా మారగలశక్తినీ, సంక్షోభాల్ని తాత్కాలికంగా అధిగమించగలశక్తినీ, సోషలిస్టు దేశాలపై విప్లవ ప్రతీఘాతుక దాడి చేయగల దానిశక్తినీ మనం తక్కువగా అంచనా వేశాం. అదే సమయంలో సోషలిజం అప్రతిహతంగా, ప్రపంచ వ్యాప్తంగా విజయం సాధించే దిశగా ముందుకు దూసుకు పోతోందనీ, దాని శక్తిని ఎక్కువగా అంచనా వేసుకున్నాం.

అయినప్పటికీ 1964 తీర్మానంలో సరిగా అంచనా వేసిన ప్రపంచంలోని ప్రధాన సామాజిక వైరుధ్యాలు అన్న అంశాన్ని సిపిఐ(యం) 14వ మహాసభ ఆమోదించింది. ప్రపంచ అభివృద్ధి క్రమంలో ఏ దశలోనైనా రకరకాల వైరుధ్యాలుంటాయి. ప్రస్తుతదశలోని నాలుగు మౌలిక వైరుధ్యాలను సక్రమంగా అర్థం చేసుకోవటం ద్వారానే ప్రపంచం పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి సోషలిస్టు వ్యవస్థకు పరివర్తన చెందుతున్న నేటి యుగాన్ని అర్థం చేసుకోగలం. ప్రపంచ సోషలిజానికీ సామ్రాజ్యవాదానికీ మధ్య, సామ్రాజ్యవాదానికీ అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలకూ మధ్య, సామ్రాజ్యవాద దేశాలమధ్య, పెట్టుబడిదారీ దేశాలలోని పెట్టు బడికీ, కార్మికులకూ మధ్య ఉన్న ఈ నాలుగు వైరుధ్యాలు ప్రధాన వైరుధ్యాలుగా ఉన్నాయి.

సిపిఐ(యం) ఇప్పటికీ ఈ నాలుగు వైరుధ్యాలు ప్రధానమైనవన్న అవగాహనతో ఉ న్నది. ప్రపంచ స్థాయిలో సామ్రాజ్యవాదానికీ సోషలిజానికీ మధ్య ఉన్న వైరుధ్యమే ప్రస్తుత యుగంలో కేంద్ర వైరుధ్యంగా ఉన్నది. కేంద్ర వైరుధ్యం కొనసాగుతుండగానే ప్రపంచంలో జరుగుతున్న వివిధ పరిణామాల ఫలితంగా ఈ నాలుగు వైరుధ్యాలలో ఏ వైరుధ్యమయినా, ఎప్పుడయినా ముందుకు రావచ్చు.

పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి సోషలిస్టు వ్యవస్థకు పరిణామం చెందే ప్రస్తుత యుగంలో ఈ నాలుగు వైరుధ్యాలూ మౌలికమైనవే అన్న అవగాహన ప్రధానమైనది. వీటిలో సామ్రాజ్య వాదానికీ సోషలిజానికీ మధ్యనున్న వైరుధ్యమే కేంద్ర వైరుధ్యం. సోవియట్ యూనియన్‌లో సోషలిజం కూలిపోయిన తరువాత, ప్రస్తుత ప్రపంచంలో సోషలిజం సామ్రాజ్యవాదం మధ్య వర్గ శక్తుల బలాబలాలు సామ్రాజ్యవాదా నికి అనుకూలంగా మారాయి. అయినప్పటికీ ఈ వైరుధ్యమే కేంద్ర వైరుధ్యంగా ఉంటుంది.

ఈ నాలుగు వైరుధ్యాలలో ఏదో ఒక వైరు ధ్యం ఏసమయంలో నైనా ప్రధాన వైరుధ్యంగా ముందుకు రావచ్చు. వియత్నాంకు వ్యతిరేకంగా అమెరికన్ సామ్రాజ్యవాదులు యుద్ధం చేస్తున్న పుడు, సామ్రాజ్యవాదానికీ, అభివృద్ధి చెందుతున్న దేశాలకూ మధ్య ఉన్న వైరుధ్యం ప్రధాన వైరు ధ్యంగా ముందుకు వచ్చింది. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించటం పైనే ప్రపంచ అభివృద్ధి దిశ ఆధారపడి ఉంటుంది. ఆనాడు అమెరికన్ సామ్రాజ్యవాదం ఓడిపోవడం వలన ఈ

వైరుధ్యం సోషలిజానికి అనుకూలంగా పరిష్కరించ బడింది. ఈ రోజు ఈ నాలుగు వైరుధ్యాలూ తీవ్రమౌతూనే ఉన్నాయి. మిగతా రెండింటి కన్నా సామ్రాజ్యవాదుల మధ్య ఉన్న అంతర్గత వైరుధ్యం నిదానంగా అభివృద్ధి అవుతున్నది. ఉదాహరణకు ఈ రోజు అమెరికన్ సామ్రాజ్యవాదులు సోషలిస్టు క్యూబాకు వ్యతిరేకంగా దురాక్రమణకు పాల్పడితే, అపుడు కేంద్ర వైరుధ్యమే తక్షణ పరిష్కారం కోరుతున్న ప్రధాన వైరుధ్యంగా ముందుకు వస్తుంది.

సిపిఐ(యం) ఇప్పటికీ ఈ అవగాహనతోనే ఉన్నది. 1968, 1992, 2012లలో పార్టీ చేసిన సైద్ధాంతిక తీర్మానాలుగానీ, ప్రతి మహాసభలోనూ అంతర్జాతీయ పరిస్థితిని నిర్దిష్టంగా అంచనా వేస్తూ చేస్తున్న తీర్మానాలుగానీ ఈ అవగాహనకు కట్టుబనవే.

ప్రస్తుత ప్రపంచ పరిస్థితిని ఈ అవగాహనతో ఇక్కడ అంచనా వేయడంలేదు. ఇది ఎప్పటిలాగే పార్టీ మహాసభ తీర్మానాలలో చేయటం కొనసాగుతుంది. ఇక్కడ గమనించ వలసినది ఏమిటంటే, ప్రపంచ సామాజిక వైరుధ్యాలను సక్రమంగా అర్థం చేసుకోకపోతే అది అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, వివిధ దేశాల కమ్యూనిస్టు పార్టీలు వారి వారి దేశాలలో అనుసరిస్తున్న ఎత్తుగడలలోనూ తీవ్రమైన తప్పులకు దారి తీస్తుంది.

> “ప్రపంచ సామాజిక వైరుధ్యాలను సక్రమంగా అర్థం చేసుకోకపోతే అది అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, వివిధ దేశాల కమ్యూనిస్టు పార్టీలు వారి వారి దేశాలలో అనుసరిస్తున్న ఎత్తుగడలలోనూ తీవ్రమైన తప్పులకు దారి తీస్తుంది.”

అమెరికా, సోవియట్ యూనియన్‌ల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం, దాని ఫలితంగా సోవియట్ యూనియన్ అమెరికాల మధ్య ఆయుధపోటీ పెరుగుతున్న కాలంలో సామ్రాజ్యవాదానికీ, సోషలిజానికీ మధ్య నున్న కేంద్ర వైరుధ్యం, యుద్ధం–శాంతి రూపంలో వ్యక్తీకరించ బడుతున్నట్టు సి.పి.ఎస్.యు. భావించింది. అందు వలననే దీనిని తక్షణ పరిష్కారం కోరుతూ ముందుకొచ్చిన వైరుధ్యంగా చూసింది. అందువలననే ప్రపంచశాంతిని కోరుకుంటున్న, అమెరికన్ సామ్రాజ్యవాదుల యుద్ధ ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్న కమ్యునిస్టేతర రాజకీయ శక్తులన్నీ తమ తమ దేశాలలో కమ్యూనిస్టు పార్టీలకు మిత్రులని అంచనాకు వచ్చింది. అందువలననే సిపిఐ యొక్క మితవాద వర్గ సంకర విధానం తీవ్రమై సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ప్రపంచశాంతిని కోరుకుంటున్న మొనగాడిగా మన దేశంలో కాంగ్రెస్ పార్టీని భావించి మద్దత్తునిచ్చింది. ఇది భారతదేశంలోని ఆనాటి వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఉన్నది. వాస్తవంగా అందువలనే ఆ రోజు పాలకవరాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలు రాజీ



ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్

మార్గంలో సాగి, నీరుగారిపోవటానికి దారి తీసింది. అంతిమంగా ఇందిరా గాంధీ విధించిన ఆంతరంగిక అత్యవసర పరిస్థితినీ, ఇతర విధానాలను కూడా సమర్ధించే దశకు తీసుకెళ్ళింది. అత్యవసర పరిస్థితి అనంతరం జరిగిన భటిండా మహాసభలో సిపిఐ తన పొరపాటు అవగాహనను సరిదిద్దుకుంది.

మరోవైపున ఈ యుగంలోని కేంద్ర వైరుధ్యాన్ని పక్కనపెట్టి, వియత్నాంకు వ్యతిరేకంగా అమెరికా చేస్తున్న యుద్ధం సందర్భంగా ముందుకొచ్చిన వైరుధ్యాన్ని కేంద్ర వైరుధ్యంగా చూడడం, దీనిని పరిష్కరించటం పైనే ప్రపంచ కమ్యునిస్టు ఉద్యమ పురోగమనం ఆధారపడి ఉన్నదనే అంచనాకు రావటం అతివాద దందుడుకు వాదానికి దారితీసి, అనేక ఇతర అంశాలతో పాటు సోవియట్ యూనియన్‌ను “సోషల్ సామ్రాజ్యవాది”గా చిత్రీకరించడంతో ముగిసింది. ఇది దేశీయ పాలక వర్గాల్ని “దళారి” బూర్జువావర్గంగా లేక దేశ ప్రజలలో ఏమాత్రం పునాదిలేని సామ్రాజ్యవాద తొత్తులుగా పరిగణించడానికి దారితీసింది. ఫలితంగా ప్రజలలో అధికభాగం పాలకవర్గాల పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారనీ, విప్లవానికి సమయం ఆసన్నమైందని, చేయవలసిందల్లా తిరుగుబాటుకు ప్రజలకు పిలుపివ్వటమే అనే అవగాహనకు ఇది దారితీసింది. ఇది అనేక దేశాలలో ప్రజా యుద్ధం (పీపుల్స్‌వార్) నినాదం ఇవ్వటానికి దారితీసింది. దీనిని మన దేశంలో మొదట్లో నగ్జలైట్లు అమలు చేశారు. ఆ తరువాత మావోయిస్టులు అనుసరిస్తున్నారు. భారతదేశంలోని కమ్యూనిస్టు ఉద్యమంపై వీటి వినాశకర ఫలితాలు ఎలా ఉన్నాయో మనందరికీ తెలుసు.

భారత ప్రజలలోని వర్గ బలాబలాలను మనకనుకూలంగా మార్చుకున్నపుడు మాత్రమే ప్రస్తుత పాలకవర్గాలను అధికారం నుండి తొలగించగలమనే ముఖ్యాంశాన్ని ఈ రెండు పెడధోరణులకు గురైనవారు దాటవేస్తున్నారు.

సిపిఐ(యం) ప్రపంచంలోని సామాజిక వైరుధ్యాల గురించి సరైన అవగాహనకు కట్టుబడి ఉంటూనే, చైనా, సోవియట్ యూనియన్‌లు మనదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో జోక్యం చేసుకోవటం వలన నష్టం జరుగుతున్నప్పటికీ, చైనానుగానీ, సోవియట్ యూనియన్‌నుగానీ సోషలిస్టు దేశాలు కాదని నిందించటానికి తిరస్కరించింది. అదే సమయంలో ప్రపంచ కమ్యూనిస్టు అగ్రదేశాలు అనుసరిస్తున్న ఈ తప్పుడు ధోరణులు, పొరపాట్ల నుండి విడగొట్టుకొంటూనే వారి తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ(యం) నికరంగా పోరాడింది. ఆ విధంగా మార్క్సిజం–లెనినిజం యొక్క విప్లవకర సారాంశాన్ని సమున్నతంగా నిలబెడుతూ, ఆ సిద్ధాంత ప్రాతిపదికగానే భారతదేశంలో విప్లవకర మార్పుకోసం సి.పి.ఐ.(యం) నిరంతరం పోరాడుతున్నది.

భారతదేశంలో విప్లవోద్యమం ముందుకెళ్ళాలంటే భౌతిక పరిస్థితులు ఎంత అనుకూలంగా ఉన్నప్పటికీ అదొక్కటే సరిపోదు. అందుకు భారత విప్లవోద్యమ “అంతర్గత అంశం” అయిన కార్మికవర్గం యొక్క విప్లవకర సైద్ధాతిక

> **"మొత్తంగా వర్గ పోరాటాలలో మనం చురుకుగా జోక్యం చేసుకొని వాటిని మరింత తీవ్రం చేయటానికి కృషి చేయటం, మనం గుర్తించిన రంగాలలో మరింత ఎక్కువగా కృషి చేయటం ద్వారా మాత్రమే మనదేశంలో విప్లవోద్యమం ముందుకుపోతుంది."**

పోరాటశక్తి పెరగాలి. దేశంలో దోపిడీకి గురవుతున్న వర్గాలన్నింటినీ సమీకరించి, ప్రజానీకంలో ప్రస్తుత వర్గశక్తుల బలాబలాలలో మార్పుకోసం పోరాడుతూ, జనతా ప్రజాస్వామిక విప్లవ సాధన కోసం, ఆ పునాదిపై సోషలిజం కోసం మార్క్సిజం లెనినిజానికి కట్టుబడిన పార్టీ నాయకత్వంలో కార్మికవర్గం నిర్ణయాత్మకంగా జోక్యం చేసుకోవాలి.

"అంతర్గత అంశం" అయిన పార్టీని బలపరచుకోవటం కోసం సి.పి.ఐ.(యం) 20వ మహాసభ సైద్ధాంతిక తీర్మానం అత్యవసరంగా జోక్యం చేసుకోవాల్సిన రంగాలను నిర్ధిష్టంగా గుర్తించింది. 20వ మహాసభ గుర్తించిన, అత్యవసరంగా జోక్యం చేసుకోవాల్సిన ఎనిమిది రంగాలను దిగువ పేర్కొంటున్నాను. పార్లమెంటరీ, పార్లమెంటరీయేతర పోరాటాలను బలోపేతం చేస్తూ, ఈ రెండూ పరస్పరం తోడ్పాటునందించుకునేలా సమన్వయం చేయాలి. కార్మిక, కర్షక సంఘటనను నిర్మించాలి. కార్మిక వర్గ ఐక్యతను పటిష్టం చేయాలి. "అస్థిత్వవాద రాజకీయాల" ప్రతికూల ప్రభావాలపై పోరాటం చేయాలి. సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను మరింత తీవ్రం చేయటంతోపాటు కులాల ప్రాతిపదికన జరిగే రాజకీయ సమీకరణలపై సరైన విధంగా స్పందించాలి. మతతత్వ వ్యతిరేక పోరాటాలలో చురుకుగా పాల్గొని మతతత్వాన్ని ఓడించాలి. లింగ వివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలను మరింత తీవ్రం చేయాలి. "జాతీయవాదం" పై వస్తున్న వివిధ రకాలైన ప్రతికూల భావాలకు వ్యతిరేకంగా పోరాడాలి.

మొత్తంగా వర్గ పోరాటాలలో మనం చురుకుగా జోక్యం చేసుకొని వాటిని మరింత తీవ్రంచేయటానికి కృషి చేయటం, మనం గుర్తించిన రంగాలలో మరింత ఎక్కువగా కృషి చేయటం ద్వారా మాత్రమే మనదేశంలో విప్లవోద్యమం ముందుకుపోతుంది. నిర్ధిష్ట పరిస్థితులను నిర్ధిష్టంగా విశ్లేషణ చేయటం ద్వారా ఇందుకవసర మయిన ఎత్తుగడలను రూపొందించే కర్తవ్యాన్ని క్రమబద్ధంగా జరిగే పార్టీ మహాసభలు నిర్వహిస్తాయి. 'వ్యూహం లేని ఎత్తుగడలు' మితవాదానికి దారి తీస్తే, 'ఎత్తుగడలులేని వ్యూహం' అతివాద దుస్సాహసానికి దారి తీస్తుందని నిరంతరం గమనంలో ఉంచుకోవాలి. అందుకని ఈ రెండు పెదధోరణలకు వ్యతిరేకంగా నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. సి.పి.ఐ.(యం) 20వ మహాసభ సైద్ధాంతిక తీర్మానం ఈ విధంగా చెప్పింది. "సిపిఐ(యం) ఆవిర్భావం నుండి భారత విప్లవోద్యమాన్ని సరైన శాస్త్రీయ మార్గంలో ముందుకు తీసుకువెళ్ళటానికి ఈ రెండు పెదధోరణులకు (మితవాదం, అతివాద దుందుడుకు వాదం) వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేస్తున్నది. ఈ పోరాటం సి.పి.ఐ (యం) ఆవిర్భావంతో ముగియలేదు. భారత దేశంలో విప్లవం విజయం సాధించిన తరువాత కూడా ముగిసిపోదు. మార్క్సిజం-లెనినిజం యొక్క విప్లవ సారాన్ని తొలిచివేసే వివిధ పెదధోరణులకు బలికాకుండా ఉండాలంటే ఎంత అప్రమత్తంగా ఉండాలో సోషలిస్టు సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాల అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ విధమైన అప్రమత్తత లోపించటం వలన సోవియట్ యూనియన్‌లో సోషలిజం విచ్ఛిన్నం కావటంతో పాటు, ఆ నమూనాను 21వ శతాబ్దంలో ఎక్కడా అమలుజరపలేని పరిస్థితి ఏర్పడింది."

అందువలన ప్రస్తుత పరిస్థితులలో, సిపిఐ (యం) ఏర్పడిన 50వ వార్షికోత్సవ సందర్భంలో భారత విప్లవోద్యమంలో "అంతర్గత అంశం" పార్టీని బలపరచుకొనేందుకు ద్విగుణీకృతమైన శక్తితో కృషి చేయాలి.

సోషలిజం భవిష్యత్తు ఏమిటి అనే ప్రశ్నకు "సోషలిజం మాత్రమే భవిష్యత్" అని సమాధానం చెప్పాలి. అలాకాకపోతే మానవ నాగరికత అభివృద్ధి క్రమం వెనక్కు తిరిగి, ఆటవిక యుగానికి వెళ్ళే ప్రమాదం ఉంది. 20వ శతాబ్దంలో రోజా లగ్జంబర్గ్ "సోషలిజం లేక ఆటవికత" అని నినాదాన్నిచ్చారు. ఇప్పుడు ఫైడల్ కాస్ట్రో తిరిగి అదే నినాదాన్ని ఇస్తున్నాడు. ఈ రోజు మానవాళి ముందున్న మార్గం ఇది మాత్రమే. భారత దేశానికి సంబంధించినంత వరకు సి.పి.ఐ(యం) మనదేశం ఆటవికత వైపు వెళ్ళకుండా నిరోధించేందుకు, విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోయేందుకు కృషి చేస్తున్నది. వర్గపోరాటాలను తీవ్రం చేస్తూ జనతా ప్రజా స్వామికం కోసం, ఆ పునాదిపై సోషలిజం సాధన కోసం కృషి చేస్తుంది.

**(అనువాదం:ఆర్. ఉషారాణి)**

PSBH

తప్పక చదవండి




ఈ పుస్తకంలో సుప్రసిద్ధ శాస్త్రవేత్త ఛార్లెస్ డార్విన్ జీవిత వివరాలు, ఆయన గావించిన విజ్ఞాన పరిశోధనలు, రూపొందించిన 'పరిణామ సిద్ధాంతం' వివరాలు.. అన్నీ మనం తెలుసుకోవచ్చు. ఆయన ప్రతిపాదించిన 'జీవ పరిణామాభివృద్ధి' (జీవ పరిణామ సిద్ధాంతం)తో పాటు శాస్త్రవిజ్ఞాన గ్రంథాలకు సంబంధించిన సమాచారం కూడా ఈ పుస్తకం మనకు అందిస్తుంది. ఆయన నిర్ధారణలు ప్రపంచ విజ్ఞానరంగంలో సాటిలేని విప్లవం సాధించాయి. అయినా ఈనాటికీ అమెరికా పాలకులు దానిని అంగీకరించక తమ విద్యాలయాల్లో దానిని బహిష్కరించి, ఆ సిద్ధాంత సమర్థకులను కోర్టులకీడ్చి చేస్తున్న హంగామా గురించి కూడా ఈ 'ఛార్లెస్ డార్విన్' పుస్తకం వివరిస్తుంది. డార్విన్ సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా చూరగొన్న అపార విజయాలు అమెరికన్ పాలకులకు చెంపపెట్టు లాగా పరిణమించాయి.

**ఛార్లెస్ డార్విన్** - ఆర్. పెరియస్వామి - వెల :రూ. 60/- పేజీలు : 96

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్ -20, ఫోన్ : 27608107, 9490099202


బ్రాంచీలు :
హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు, నల్గొండ, ఖమ్మం, ఒంగోలు, కరీంనగర్

ఈ మాసం ముఖ్యాంశం

# స్వస్తిక్ సైనికులు



**1930లలో ఆర్.యస్.యస్.కు ఫాసిస్టులతో ఉన్న చారిత్రక సంబంధాలను పరిశీలిస్తే ప్రస్తుతం వారు చేస్తున్న ఫాసిస్టు ప్రచారం ఏమాత్రం ఆశ్చర్యం కలిగించదు. ప్రాచీన పత్రభాండాగారం నుండి సేకరించిన ప్రామాణికమైన సమాచారం ఆధారంగా ఈ విషయాలు రుజువు చేయబడ్డాయి. తన జీవితకాలంలో అత్యధిక భాగం ఆర్.యస్.యస్. ప్రచారక్‌గా పనిచేసిన ప్రధానమంత్రి నరేంద్రమోడి అదే వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ఆ విశ్వాసాలు, నమ్మకాలతో మమేకమై ఉన్నారు.**



**రచయిత ప్రఖ్యాత లాయర్, చరిత్రకారుడు, రచయిత. భారత రాజ్యాంగ నిపుణుడు.**

**ఎ.జి. నూరాని**

"పోప్ ఈ సంస్కరణలనో, ఆ సంస్కరణలనో ఎందుకు ప్రవేశపెట్టలేదని ప్రజలు కొన్ని సందర్భాలలో ఉబుసుపోని ప్రశ్నలు అడుగుతుంటారు. దీనికి సరైన సమాధానం ఏమిటంటే విప్లవకారునిగా ఉండాలనుకొనే వ్యక్తి పోప్‌గా మారటానికి అంగీకరించడు. పోప్‌గా మారటానికి అంగీకరించిన వ్యక్తి విప్లవకారునిగా ఉండటానికి సిద్ధం కాడు."

– ఎ.వి.డైసి, యాన్ ఇంట్రడక్షన్ టు ది స్టడీ ఆఫ్ ది లా ఆఫ్ ది కాన్స్టిట్యూషన్. పేజి 80

ఆర్.ఎస్.ఎస్.కి చెందిన ఉద్దండ పిండాలు ఒకరి తర్వాత ఇంకొకరుగా వంతులు వేసుకున్నట్లు వివిధ వేదికల మీద నుండి రకరకాల హిందూత్వ నినాదాలను స్వరం పెంచి మరీ వినిపిస్తూ వుంటే, పాపం– విషయం తక్కువ జీతాలు ఎక్కువగా వుండే మన టీవీ యాంకర్లు, ప్రింట్ మీడియాలో మోడీ భక్త హనుమాన్లు, కార్పొరేట్ మొగలాయిలు కుర్చీల్లో అసహనంగా కదుల్తూ, కించిత్ మొహమాటం ప్రదర్శిస్తూ 'మోడీజీ' ఈ రాద్ధాంతానికి దూరంగా వుండాలి, లేకుంటే ఆయన తలకెత్తుకున్న అభివృద్ధి కార్యక్రమం పక్కకిపోయే ప్రమాదముంది అని అతి విశ్వాసంగా పలుకుతూ ఉన్నారు. కానీ వీళ్ళ మొహమాటాలు, సిగ్గరితనాలు ఆర్.ఎస్.ఎస్. 'సుప్రీంబాస్'కి ఒక లెక్కా. డిసెంబర్ 20న కోల్‌కతాలో ఆర్.యస్.యస్. నిర్వహించిన "సొంతింటికి చేరుకోవడం" (ఘర్ వాపసి) కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "దారితప్పి మన హిందూమతానికి దూరమైన వారందరినీ తిరిగి వారి సొంతింటికి చేర్చే కార్యక్రమం ఇది. దొంగ మన విలువైన సామాను ఎత్తుకెళ్ళాడనుకోండి. ఆ దొంగ దొరికితే మన సామాను మనకు దక్కుతుంది కదా. వాళ్ళూ అలానే" అంటూ తమ మత మార్పిడుల కార్యక్రమాన్ని సమర్థించుకున్నారు. (హిందూస్థాన్ టైమ్స్ 2014 డిసెంబర్ 21 సంచిక).

ఆర్.ఎస్.ఎస్. భాజపాలు జనంమీద రుద్దే బలవంతపు కార్యక్రమాల గురించి వాళ్ళ మాట్లాడే భాషే అంత. 2014 ఎన్నికల ప్రచారంలో మోడీ వాడిందీ ఈ భాషే. ఇప్పుడేమో ప్రసార, ప్రచార మాధ్యమాల్లో 'మోడీ ఇలాంటి వాటిని వదిలించుకోవాలి" అన్న సుద్దులు వినబడుతున్నాయి. ఇంతకీ ఎవరి కార్యక్రమాన్ని ఎవరు హైజాక్ చేస్తున్నట్టు? "మోడీ కార్యక్రమాన్ని ఆర్ఎస్ఎస్, బి.జె.పి. హైజాక్ చేస్తున్నాయా?"వీరుమాత్రం "మోడీ వాటిని వదులుకోవాలి" అని గొడవ చేస్తున్నారు.

ఈ సుద్దులు చెప్పేవాళ్ళంతా ఒక వాస్తవాన్ని తెలివిగా విస్మరిస్తున్నారు. మోడీ ఇప్పటి దాకా తన జీవితమంతా ఒక ప్రచార కర్తగా ఆర్.ఎస్.ఎస్. సేవలో తరించాడు. ఆర్.ఎస్.ఎస్. ఎదుగుదలకు కృషి చేశాడు. మోడీ ఆ హిందూత్వ కుదురులో మొక్కే. ఆ భాషకాకుండా వేరే భాష మాట్లాడతాడని ఆశించడం అత్యాశే. ఎందుకంటే మోడీ ఆర్.ఎస్.ఎస్.లో కరడుగట్టిన వాళ్ళలో కరడుగట్టిన వాడు. ప్రముఖ రాజ్యాంగ న్యాయ నిపుణుడు డైసీ పార్లమెంటు సార్వభౌమత్వానికి గల అంతర్గత పరిమితులు గురించి బాగా చెప్పారు. 'అందులో సభ్యులు బ్రిటీష్ సమాజం యొక్క అభిప్రాయాలు వెల్లడిస్తుంటారు' అంటారు. అలానే మోడీ కూడా ఆర్.ఎస్.ఎస్. తీర్చిదిద్దిన వ్యక్తి. అతను ఆ భాషలోనే మాట్లాడతాడు. ఆ భావజాలాన్నే ప్రచారం చేస్తాడు. ఆ విద్వేష రాజకీయాలనే ఆచరిస్తాడు. మత మార్పిడుల అంశం మీద పార్లమెంటు దద్ధరిల్లిపోతుంటే మోడీ మౌనం వహించాడు అని కొందరు అనుకుంటున్నారు. కాని అతను మనసులో పరవశించిపోయాడని ఎందరు గ్రహించగలిగారు.


నిద్ర నటించే వాళ్ళని మేల్కొల్పలేం గానీ, భారత ప్రజాస్వామ్యం పట్ల ఆపేక్ష ఉన్నవాళ్ళు ఎవరైనా సరే జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలించాలి. సమగ్రంగా అవగాహన చేసుకోవాలి. ఇదంతా క్యాబినెట్ వ్యవస్థ మాటున జరుగుతున్న దాడి. సుప్రీం లీడరైన

> **❝ వ్యక్తి ఆరాధన, మిలిటరీ శిక్షణ మీద ప్రధాన దృష్టి, జాతి, మత ఆధిపత్య ధోరణులు, మతవాదంతో కూడిన కుహనా దేశభక్తి, గతించిన కాలాన్ని గొప్పగా చిత్రించడం, జాతి ఐక్యత పేరిట నినాదాలు, ఆచరణలో జాతి-మత మైనార్టీల అణిచి వేత - ఇవన్నీ ఆర్.ఎస్.ఎస్. హిందూత్వలో అంతర్భాగం. యూరప్‌లో తలెత్తిన ఫాసిస్టు భూతం నకళ్ళే ఇవి. ఫాసిజం అనేది రాజ్యం ఆరాధనను పెంచి పోషిస్తుంది. వ్యక్తిని, వ్యక్తుల స్వేచ్ఛను, హక్కులను డొల్ల చేసేస్తుంది. ❞**

ప్రధాని మౌనమునిలా ఫోజుపెడుతూ, రిమోట్‌తో వ్యవహారం నడిపిస్తూ ఉంటాడు. మంత్రులు నోరేసుకుపడిపోతూ ఉంటారు. సివిల్ సర్వీసు స్వేచ్ఛమీద దాడులు జరుగుతూ ఉంటాయి. ప్రధాని మాత్రం పెదవి విప్పడు. భాజపా అనేది ఫాసిస్టు సంస్థ అయిన ఆర్.ఎస్.ఎస్. సృష్టి. ఒక దశాబ్దం క్రితం నుండి భాజపా మీద ఆర్.ఎస్.ఎస్. తన పట్టు బిగించి, దాన్ని తన నియంత్రణలోకి తీసుకుంది. ఫాసిస్టు సంస్థలు వెనకుండి నడిపించే పార్టీలు ఏవైనా సరే ముందుగా రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టిస్తాయి.

ఆర్.యస్.ఎస్. ఒక ఫాసిస్టు సంస్థ. 'ఇండియా యాజ్ ఎ సెక్యులర్ స్టేట్' అన్న పుస్తకంలో నెహ్రూ ఒక సందర్భంలో 'హిందూ మతోన్మాదం అనేది ఫాసిజానికి భారతీయ రూపంలాంటిదని' పేర్కొన్నట్లు 'డొనాల్డ్ ఈగెన్ స్మిత్ రాశాడు. ఆర్.ఎస్.ఎస్. విషయానికొస్తే మీకు ఈ విషయమ్మై చాలా పోలికలు కనిపిస్తాయి. వ్యక్తి ఆరాధన, మిలిటరీ శిక్షణ మీద ప్రధాన దృష్టి, జాతి, మత ఆధిపత్య ధోరణులు, మతవాదంతో కూడిన కుహనా దేశభక్తి, గతించిన కాలాన్ని గొప్పగా చిత్రించ డం, జాతి ఐక్యత పేరిట నినాదాలు, ఆచరణలో జాతి-మత మైనార్టీల అణిచివేత - ఇవన్నీ ఆర్.ఎస్.ఎస్. హిందూత్వలో అంతర్భాగం - యూరప్‌లో తలెత్తిన ఫాసిస్టు భూతం నకళ్ళే ఇవి. ఫాసిజం అనేది రాజ్యం ఆరాధనను పెంచి పోషిస్తుంది. వ్యక్తిని, వ్యక్తుల స్వేచ్ఛను, హక్కులను డొల్ల చేసేస్తుంది.

"రాజ్యాధికారం ద్వారా తన లక్ష్యాలను సాధించుకోగలనని సంఘ్ పరివార్ ఏనాడూ నమ్మలేదు. హిందూ సమాజాన్ని పునర్నిర్మిం చడం ఆర్.ఎస్.ఎస్. లక్ష్యం. అది రాజ్యాధి కారం ద్వారా పైనుండి కాక సమాజంలో అట్టడుగు నుండి సాగాలి. అయితే జనసంఘ్ ద్వారా గానీ, లేదా ప్రత్యక్షంగా గానీ రాజ్యాధి కారం చేతికి అందివస్తే ఆర్.ఎస్.ఎస్. ఆ రాజకీయాధికారాన్ని ఎలా వినియోగించు



('ఇన్ ది షేడ్ అఫ్ స్వస్తికా...' )

కుంటుంది అనేది దురూహ్యం. బహుశా తన హిందూత్వ సిద్ధాంతంలోని కొన్ని అంశాలని, ముఖ్యంగా ముస్లింలు, ఇతర మైనారిటీల పట్ల తన వైఖరిని అమలు చెయ్యడానికి రాజ్యాంగ యంత్రాన్ని విస్తృతంగా వాడుకోవచ్చు" అని యూజీనీ స్మిత్ ఆ పుస్తకంలో రాశాడు. ఎంత ముందుచూపుతో రాశాడో కదా!

అలాగే ఇటలీకి చెందిన మార్జియా కాసో లారి అనే రిసెర్చ్ స్కాలర్ వ్రాసిన '1930వ దశకంలో హిందూత్వ (శక్తుల) విదేశీ సంబం ధాలు - ప్రాచీన పత్రభాండాగార (ఆర్కైవ్స్) సాక్ష్యాలు' అన్న వ్యాసం ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో (22-1-2000) ప్రచురించ బడింది. అలాగే 'హిందూ అస్థిత్వ రాజకీయ సంస్థ నిర్మాణంలో బెనారస్ పాత్ర' అన్న మరో వ్యాసం కూడా అదే పత్రిక 2002-ఏప్రిల్ 13 సంచికలో ప్రచురితమైంది. హిందూ మహాసభ, ఆర్.ఎస్.ఎస్.లు ఇటలీ ఫాసిజంతో ఎలాంటి సంబంధాలు కొనసాగించాయి అనే అంశం మీద పురాతన పత్ర భాండాగార సమాచారం ఆధారంగా సదరు రచయిత్రి 'ఇన్ ది షేడ్ అఫ్ స్వస్తికా - ది యాంబిగ్యూయస్ రిలేషన్‌షిప్ బిట్వీన్, ఇండియన్ నేషనలిజమ్ అండ్ నాజి ఫాసిజమ్' పేరిట ఒక పుస్తకమే వెలువరించింది.

ఇక్కడ మార్జియా కాసోలారి గురించి నాలుగు ముక్కలు చెప్పుకోవాలి. ఈవిడ యూనివర్శిటీ అఫ్ పెరుగ్వేలో రాజనీతిశాస్త్రం, ముఖ్యంగా 'ఆసియా చరిత్ర' బోధకురాలు. ఇటలీ విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ అనుమతితో భారతదేశంలో 1991 నుండి 1993 వరకు పరిశోధన చేశారు. 'ఫాసిస్టు పరిపాలనా కాలంలో ఇటలీ విదేశాంగ విధానము, భారతదేశంతో సంబంధాలు- ఫాసిజం, హిందూ జాతీయవాదం మధ్య ఉన్న సంబంధాలు' అన్న పరిశోధనాంశాన్ని ఆమె ఎంచుకున్నది. 1994 వరకు ఈ అంశం మీద పరిశోధన సాగించింది. 1998లో డాక్టరేట్ పట్టా అందుకుంది. అలాగే 1994లో 'ఇండియన్ కౌన్సిల్ అఫ్ హిస్టారికల్ రీసెర్చ్'లో షార్ట్ టర్మ్ రీసెర్చి ఫెలోషిప్ కూడా చేసింది. 1999 నుండి అనేక పర్యాయాలుగా భారత దేశం వచ్చి వెళుతూ భారతదేశంలో హిందూ అతివాద రాజకీయాలు - ముస్లిములు అన్న అంశంమీద పరిశోధన చేస్తున్నది.

'భారతదేశంలో ముస్లీం మతం సెప్టెం బరు 11కు ముందు,తర్వాత'అనే పుస్తకాన్ని 2006లో ప్రచురించింది. ఈ పుస్తకాన్ని డీగో అబెనాంటే,ఎలిసా గియాన్సిలు ఎడిట్ చేశారు. శ్రీలంకలో ఘర్షణలను గురించి, అందుకు సంబంధించిన ఇతర విషయాలను గురించి ఆమె అనేక వ్యాసాలను ప్రచురించింది. దక్షిణ, తూర్పు, దక్షిణాసియా ప్రాంతాలకు సంబంధిం చిన సమకాలీన సమస్యలపై ఇటలీ విద్యావేత్తలు అధ్యయనం చేస్తున్న ఆసియా మెయర్ అనే సంస్థకు 2010 నుండి అధ్యక్షురాలిగా పనిచేస్తున్నది.

'ఇన్ ది షేడ్ అఫ్ స్వస్తికా...' పుస్తకంలో ప్రధానాంశం ఇటలీని ఫాసిస్టు నియంత ముస్సో లిని ఏలిన కాలంలో భారతదేశం పట్ల అనుస రించిన విదేశాంగ విధాన పరిశీలన, సుభాష్ చంద్రబోస్, రాస్ బిహారీ బోస్, యం.ఆర్. జయకర్ వంటి వారి పాత్రను, భారతదేశంలో ఇటలీ ప్రముఖుల పాత్రను బొంబాయి, మద్రాసులలోని ఇటలీ రాయబార కార్యాలయ కార్యకలాపాల గురించి మనకుఈ పుస్తకం వివరిస్తుంది. 1932లో ముస్సోలిని నేరుగా విదేశాంగ శాఖను తన ఆధీనంలోకి

తెచ్చుకున్నాడు.

'ప్రచురిత సమాచారం, అధికారిక రికార్డులు, చలామణిలో వున్న ఇతర డాక్యుమెంట్లు ఏం రుజువు చేస్తున్నాయంటే 1920ల నుండి 40ల వరకు హిందూ మహాసభ, ఆర్.ఎస్.ఎస్. తదితర సంస్థలు ఫాసిజం పట్ల ఆసక్తి కనబరిచాయి. ముస్సోలిని రాసిన వ్యాసాలు, అతని జీవిత గాథలు, అతని రచనలు, కొటేషన్‌ల వంటివి ఈ గ్రూపుల మధ్య పంపిణీ అవుతూ వచ్చాయి. దీన్నిబట్టి 1920వ దశకం నాటినుంచే హిందూత్వ సంఘాలు, సంస్థలు ఫాసిజం గురించి తెలుసుకోవడమే కాకుండా అలాంటి పాలన పట్ల మొగ్గు చూపాయన్న నిర్ధారణకు రావచ్చు.


సావార్కర్ అధ్యక్షతన 1938 వచ్చేసరికి హిందూ మహాసభ ప్రధాన ఫోకస్ నాజీ జర్మనీ మీదకి మారింది. భారత దేశంలో ముస్లిం సమస్య పరిష్కారానికి జర్మనీ అనుసరించిన జాత్యహంకార, విద్వేషపూరిత రాజకీయ మార్గాన్ని ఆచరణీయ నమూనాగా హిందూ మహాసభ భావించింది. 1920-40ల మధ్య కాలంలో హిందూత్వ సంస్థలు రెండు ప్రధాన రాజకీయ మార్గాలని ఎంచుకున్నాయి. 'హిందూత్వ' పేరిట మతాన్ని అన్ని స్థాయిల్లోనూ పెద్దఎత్తున వ్యక్తీకరించాలి అనేది మొదటి మార్గం. ఆనాటికి యూరప్‌లో విస్తృతంగా చెలామణిలో వున్న జాత్యహంకార ధోరణులను అందిపుచ్చుకోవడమే దీని లక్ష్యం.

"ఇక రెండోవైపు నుండి హిందువులు చేవచూపించకపోవడమే ఈ పరిస్థితులకు కారణమని ప్రజాభిప్రాయాన్ని మలచాలనేది మరో రాజకీయ మార్గం. ముస్లిమ్ భూతాన్ని తరిమికొట్టాలంటే హిందూ సమాజం సుశిక్షిత సైన్యం మాదిరిగా తయారవ్వాలని హిందూ మహాసభ తరచూ పిలుపునిస్తుండేది. 1920వ దశకం నుండే ముస్లింలను ప్రధాన లక్ష్యంగా చేసుకొని హిందూత్వ శక్తులు రాజకీయాలు నడపడం మొదలుపెట్టాయి. బ్రిటీష్ పాలకుల కంటే ముస్లింలతోనే దేశానికి ఎక్కువ ప్రమాదం అనే స్థాయిలో హిందూత్వ శక్తుల ప్రచారం నడిచేది"

వివాదాలకు తావులేని సమాచారం ఆధారంగా హిందూత్వ శక్తుల అసలు స్వరూపం ఏమిటో బట్టబయలు చేసింది ఈ రచయిత్రి, పరిశోధకురాలు. మహాత్మాగాంధీ హత్యానంతరం జరిగిన కేసు విచారణలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.ఎల్. కపూర్ హిందూ మహాసభ అధ్యక్షుడు వి.డి. సావార్కర్ ఈ కుట్రలో ప్రధాన నిందితుడు అని తీర్పు చెప్పడంతో ఆర్.ఎస్.ఎస్, జనసంఘ్ (ఈ జనసంఘ్ వారసురాలే భారతీయ జనతాపార్టీ) సంస్థలు రెండూ సావార్కర్‌కి తమ సంస్థలకి మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నట్లు చెప్పుకొచ్చేవి. మార్జియాకాసోలారి వారి ఈ వాదన కల్పితం అని బట్టబయలు చేసింది. 'ఆర్.ఎస్.ఎస్. స్థాపించాలని నిర్ణయం తీసుకున్నది అతి కొద్ది మంది వ్యక్తులు మాత్రమే. వీరంతా ఒకే రాజకీయ కోవకి చెందినవాళ్ళు. కె.బి. హెడ్గెవార్‌తోపాటు ఆర్.ఎస్.ఎస్. స్థాపనకు కృషిచేసినవారు బి.ఎస్. మూంజీ, యల్.వి. పరాంజపే, బాబారావ్ సావర్కర్ మరియు తోల్కర్. వీరంతా హిందూ మహాసభ సభ్యులే. 1925 వసంతకాలంలో ఆర్.ఎస్.ఎస్.ను స్థాపించడానికి ముందు హెడ్గెవార్ రత్నగిరిలో నిర్బంధంలో ఉన్న వినాయక్ దామోదర్ సావర్కర్‌ను కలిసి, సంస్థను నెలకొల్పేదానికి తగిన సూచనలు సలహాలు పొందాడని' ఈ పుస్తక రచయిత్రి సస్యాక్ష్యంగా వివరించింది.

బి.ఎస్. మూన్జీ అటూ హిందూ మహాసభకు ఇటు ఆర్.ఎస్.ఎస్.కు మధ్యన వారధిగా పనిచేశాడు. 1931 మార్చి 19న మూన్జీ రోమ్‌లో ముస్సోలినీని వ్యక్తిగతంగా కలిసాడు. మీలాంటి లక్ష్యాలనే ఎంచుకొని స్వతంత్రంగా మా అంతటా మేమే ఆర్.ఎస్.ఎస్. అనే సంస్థని స్థాపించాం, అని ముస్సోలినికి తెలియజేశాడు. అలాగే 1934లో స్థాపించిన భోన్స్లే మిలిటరీ స్కూలు స్థాపనకు సంబంధించిన పూర్తి వివరాలు ఉన్నాయి.

> **"ఆర్.ఎస్.ఎస్. మహాత్మాగాంధీ అహింసా సిద్ధాంతానికి బద్ధ వ్యతిరేకి. ఆర్.ఎస్.ఎస్. అనేది సమిష్టిస్వీయ రక్షణ కోసం అనిహెడ్గెవార్ దృష్టిలో ఉండేది. కానీ మూన్జీ ఆలోచనలు వేరుగా ఉండేవి. 'ముందు దెబ్బ మనదే కావాలి' అనే సిద్ధాంతం మూన్జీది."**



మతతత్వ సిద్ధాంతవేత్తలు హెడ్గెవార్, గోల్వాల్కర్, సావార్కర్

బ్రిటీష్ ఇంటిలిజెన్స్ విభాగం క్రోడీకరించిన సమాచారంలో "జర్మనీలో నాజీలు, ఇటలీలో ఫాసిస్టుల మాదిరి భారతదేశంలో ఏనాటికైనా తమదే భవిష్యత్తు అని 'సంఘ్' ఆశాభావంతో ఉంది" అని పేర్కొంది. 1932 సెప్టెంబర్ 24 నుండి 26 వరకు జరిగిన హిందూ మహాసభ సదస్సు ఒక బలీయమైన హిందూ సంస్థ నిర్మాణాన్ని విజయవంతం చేసినందుకు హెడ్గెవార్‌ను అభినందిస్తూ ఒక తీర్మానం ఆమోదించింది.

ఆర్.ఎస్.ఎస్. మహాత్మాగాంధీ అహింసా సిద్ధాంతానికి బద్ధ వ్యతిరేకి. ఆర్.ఎస్.ఎస్. అనేది సమిష్టిస్వీయ రక్షణ కోసం అనిహెడ్గెవార్ దృష్టిలో ఉండేది. కానీ మూన్జీ ఆలోచనలు వేరుగా ఉండేవి. 'ముందు దెబ్బ మనదే కావాలి' అనే సిద్ధాంతం మూన్జీది.

1934 జూన్ 23-24 తేదీలలో బొంబాయి, బొంబాయి శివారు ప్రాంత హిందూ మహాసభ కాన్ఫరెన్స్ సందర్భంగా మరోసారి డాక్టర్ హెడ్గెవార్‌ను అభినందనలతో ముంచెత్తారు. "హిందూ మతసేవలో తరించడానికి 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్' పేరిట ఒక వలంటీర్ పోలీస్ దళాన్ని స్థాపించడం, అందులో అటు బ్రాహ్మణుల నుండి ఇటు

**❝ హిట్లర్‌ను విమర్శించిన నెహ్రూను సావార్కర్ ఘాటుగా విమర్శించేవాడు. జెకోస్లోవేకియాలో భాగమైన సూడేటన్‌లాండ్‌ను హిట్లర్ ఆక్రమించుకోవడాన్ని, యూదుల పట్ల హిట్లర్ వైఖరిని సావార్కర్ బలంగా సమర్థించాడు. భారతదేశంలో ముస్లింలకూ అలాంటి గతే పట్టాలని అనేవాడు. జర్మనీ ఏజెంట్ ఒకరు సావార్కర్‌కు హిట్లర్ రాసిన మీన్‌కాంఫ్ పుస్తకాన్ని అందజేశాడు.❞**

పంచముల వరకూ అన్ని కులాలకు చెందిన యువకులను పోగేసి భారతదేశాన్ని రక్షించుకోవడమనే ఏకైక లక్ష్యంతో ఎవరు కలిసి వచ్చినా రాకున్నా పనిచేసేందుకు తగిన శిక్షణగరపుతున్న నాగపూర్ వాసి మన డాక్టర్ హెడ్గెవార్‌కు అభినందనలు'' అని ఆ తీర్మానంలో పొందు పరిచారు. దానితోపాటు ఈ మహాసభ బొంబా యి, దాని శివారు ప్రాంతాల్లో ఆర్.ఎస్.ఎస్. పనిని పర్యవేక్షించడానికి ఈ కింది వారిని కమిటీగా నియమిస్తుంది అని కూడా తీర్మానించింది. ఆ కమిటీలో 15 మంది పేర్లు వున్నాయి. ఎన్.డి. సావర్కర్, ఎన్.సి. కేల్కర్‌ల పేర్లూ అందులో వున్నాయి. హిందూ మహా సభకు ఆర్.ఎస్.ఎస్.కు మధ్యన ఉన్న అవినాభావ సంబంధానికి ఇంతకన్నా డాక్యు మెంటరీ సాక్ష్యం వేరే ఏమన్నా కావాలా?

ఈ రెండు దుష్టశక్తుల మధ్యన వుండే పొత్తు గురించి ఏమని వివరించిందో ఇప్పుడు చదవండి.

విడుదల అనంతరం సావార్కర్ స్థానిక ఆర్.ఎస్.ఎస్. ఆఫీసులు నిర్వహించిన సమావేశాలకు, బహిరంగ సభలకు హాజరై ఉపన్యసించేవాడు. తరచూ విద్యార్థుల సమావేశాలకు హాజరవుతూ ఉండేవాడు. ఈ సమావేశాల్లో కొన్నింటికి మిలిటెంట్లు హాజరయేవారు. సావార్కర్ వారికి బహిరంగంగానే కృతజ్ఞతలు తెలియచెప్పేవాడు. సావర్కర్ తన ఉపన్యాసాలలో హెడ్గెవార్ పాత్రను గురించి మరవకుండా చెప్పేవాడు. ఆర్.ఎస్ఎస్, హెడ్గెవార్‌ల క్రమశిక్షణను, వారి పనితీరును అభినందించేవాడు.

'ఆర్.ఎస్.ఎస్.ను అభినందనల పరంపరతో ముంచెత్తడం ఆ తరువాతి కాలంలోనూ కొనసాగింది. 1939 జులై 29న ఆర్.ఎస్.ఎస్. పూనాలో నిర్వహించిన గురుపూర్ణిమ ఉత్సవానికి హాజరైన సుమారు 5,000 మందిని ఉద్దేశించి ప్రసంగించాడు సావార్కర్.

"1943 మే 27 నుండి 29 వరకు పూనాలో గోల్వాల్కర్ సమక్షంలో నిర్వహించిన శిక్షణా శిబిరంలో సుమారు 5000 మందిని (అందులో సుమారు 1000 మంది మహిళలు) ఉద్దేశించి సావార్కర్ ప్రసంగించాడు. అప్పటికి సావార్కర్ హిందూ మహాసభ అధ్యక్ష పదవి నుండి తప్పుకొని ఉన్నాడు.

హెడ్గెవార్ స్థానంలో గోల్వాల్కర్ ఆర్.ఎస్.ఎస్.కు బాస్‌గా నియమితుడయ్యాడు. స్వయం సేవకులు ఇంత పెద్దఎత్తున హాజరవడం తనకి ఆనందంగా ఉందని, దేశంలో తాను పర్యటించిన అనేక ప్రాంతాలలో ఆర్.ఎస్.ఎస్. తన శాఖలను విస్తరించడం గమనించి గర్విస్తున్నామని, హిందూత్వ పట్ల యువకులు, పిల్లలు ఇంత పెద్దఎత్తున ఆకర్షితులై ఆర్.ఎస్.ఎస్.లో చేరడం తనకి ఆనందంగా ఉందని చెప్పుకొచ్చాడు"

హిట్లర్‌ను విమర్శించిన నెహ్రూను సావార్కర్ ఘాటుగా విమర్శించేవాడు. జెకోస్లోవేకియాలో భాగమైన సూడేటన్‌లాండ్‌ను హిట్లర్ ఆక్రమించుకోవడాన్ని, యూదుల పట్ల హిట్లర్ వైఖరిని సావార్కర్ బలంగా సమర్థించాడు. భారతదేశంలో ముస్లింలకూ అలాంటి గతే పట్టాలని అనేవాడు. జర్మనీ ఏజెంట్ ఒకరు సావార్కర్‌కు హిట్లర్ రాసిన మీన్‌కాంఫ్ పుస్తకాన్ని అందజేశాడు.

1939 మార్చి 25న హిందూ మహాసభ అధికార ప్రతినిధి ప్రసంగిస్తూ "ఆర్య సంస్కృతిని పున్ల ప్రతిష్టించడానికి, స్వస్థికా వెలుగులను పంచడానికి వేద సంస్కృతిని నేర్చుకొనేదానికీ, ఇండో-జర్మన్ నాగరికతలను, సాంప్రదాయాలను ముందుకుతీసుకు వెళ్ళటానికి జర్మనీ చేస్తున్న కృషి పట్ల భారతదేశంలో మతానురక్తి కలిగిన హిందువులు గొప్ప ఆశాభావంతోను, ఆనందంతోనూ ఉన్నారని" ప్రకటించాడు.

"పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వాన అతికొద్దిమంది సోషలిస్టులు మాత్రమే ప్రస్తుత జర్మనీ ప్రభుత్వాన్ని నిరసిస్తున్నారు. కాని భారతదేశంలో వారి కార్యకలాపాలకు ఏమాత్రం గుర్తింపు లేదు. జర్మనీ అనివార్యంగా, శక్తివంతంగా అనుసరిస్తూ వస్తున్న అంతర్గత విధానాల పట్ల మహాత్మాగాంధీ పెడుతున్న శాపనార్థాలు నిరర్థకమైనవి. ఎందుకంటే మార్మికతతో కూడిన మాటలతో ఆ మనిషి ఈ దేశాన్ని గందరగోళంలో ముంచి వంచించాడు. అలాంటి మనిషి మాటలను ఎవరూ లెక్క చెయ్యరు. ఆర్య సంస్కృతికి శత్రువులైన వారికి వ్యతిరేకంగా జర్మనీ సాగిస్తున్న పవిత్ర మత యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ఆర్యజాతులను, భారతదేశంలో హిందువులను మేల్కొలిపి, కోల్పోయిన తమ పూర్వ ప్రాభవాన్ని పునఃప్రతిష్టించు కునేందుకు ప్రేరేపిస్తుంది అని సావార్కర్ ప్రకటించాడు.

నిజానికి సంఘపరివారం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఏనాడూ భాగస్వామి కాలేదు. 1939 అక్టోబర్ 9న సావార్కర్ అప్పటి బ్రిటీష్ వైస్రాయ్ లార్డ్ లిన్‌లిత్‌గోను కలిసి బ్రిటీష్ పాలకులతో పొత్తుకు సిద్ధమని తెలియచేశాడు. "పరిస్థితి ఏంటంటే మహోఘనత వహించిన దొరల ప్రభుత్వం ఇప్పటికైనా హిందువులకేసి దృష్టి సారించి వారి మద్దతు కోసం కృషి చేయాలి. మేంగాని, హిందువులు గాని గతంలో చాలా ఇబ్బందులు పడ్డప్పటికీ, గ్రేట్ బ్రిటన్‌కు, ఫ్రాన్స్‌కు మధ్య వున్న సంబంధాల మాదిరిగానే, ప్రస్తుతానికి రష్యా జర్మనీ సంబంధాల వలెనే ఇబ్బందులు ఉన్నప్పటికీ మన ఇరువురి ప్రయోజనాలు ఒక్కటే కావడం వలన ఇరువురం కలిసి పనిచెయ్యడం మేలని భావిస్తున్నాను. మన ఉమ్మడి ప్రయోజనాలరీత్యా బ్రిటీష్ ప్రభుత్వం, హిందూత్వం స్నేహహస్తం అందించుకోవాలి. పాతకోపాలు, తాపాలు పక్కన పెట్టుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అని సావర్కర్ లార్డ్‌లిన్‌లిత్‌గోను కలిసి విన్నవించినట్లు అధికారిక పత్రాలు వెల్లడిస్తున్నాయి.

మార్జియాకాసోలార్గి రాసిన ఈ పుస్తకం నా దృష్టిలో అద్భుతమైన డాక్యుమెంట్. పరిమితమైన నిగ్రహమైన వ్యాఖ్యానాలతో వున్న వాస్తవాలను లోకానికి వెల్లడించింది. ఈ పుస్తకం చదువరి అవగాహనను మరింత లోతుగా పెంచుతుంది. 'శత్రువు' ఎవరన్న ఒక్క అంశమే భారత జాతీయవాదానికి, హిందూ జాతీయ వాదానికి మధ్య వున్న తేడా ఏమిటో వివరిస్తుంది. భారత జాతీయవాదులు రహస్య విప్లవ సంస్థల నుండి ఇటు ముస్లింలీగ్, కాంగ్రెస్ పార్టీల వారు బ్రిటీష్ సామ్రాజ్యాన్ని శత్రువుగా పరిగణించాయి. 1930వ దశకం నుండి


ముస్లింలీగ్ కాంగ్రెస్ విధానానికి భిన్నంగా తనవైన లక్ష్యాలను ఎంచుకోనారంభించింది. ఆక్రమం చివరికి ముస్లింలకు ప్రత్యేక రాజ్యం కావాలనే వరకూ దారితీసింది. అయితే ఈ క్రమంలో ఎక్కడా భాతృహత్యా సదృశ్యమైన ఆలోచనలను దరిచేరనివ్వలేదు. ముస్లింలకు ప్రత్యేక రాజ్యం కావాలని కోరుకోవడంలో హిందువుల పట్ల వ్యతిరేకత ఎక్కడా ప్రదర్శిం చలేదు. తప్పో, ఒప్పో కాని, ఆనాటి విధానాలు ముస్లింల ప్రయోజనాలను వ్యక్తం చేయటం లేదనే భావనతో ప్రత్యేక రాజ్యం ఏర్పాటు చెయ్యాలని, తద్వారానే తమ కష్టాలు తీరతా యని భావించేలా చెయ్యడంలో ముస్లిం లీగ్ విజయం సాధించింది. అయితే సంఘ పరివారం ఎత్తుకున్న ముస్లిం వ్యతిరేక విద్వేష ప్రచారం, సృష్టించిన హింసాత్మక వాతావరణం ముస్లిం మైనారిటీలలో కూడా విచ్ఛిన్నకర ధోరణుల పెరుగుదలకు దారితీసింది. దేశ విభజనకు ప్రత్యేక రాజ్యం కావాలన్న ముస్లింలీగ్ వైఖరి ఎంత కారణమో,సంఘ్ పరివార్ శక్తులు సాగించిన ముస్లిం వ్యతిరేక విద్వేష ప్రచారమూ, కాంగ్రెస్ పార్టీలో వున్న సంఘ్ పరివార్ సానుభూతి పరులు కూడా అంతే కారణం.

**రాజ్యాంగం – అధికార యంత్రాంగం**

1948 నవంబర్ 4న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ ముసాయిదాను రాజ్యాంగ అసెంబ్లీ ఆమోదానికి ప్రవేశపెడుతూ 'అధికార యంత్రాంగం స్వభావం కూడా రాజ్యాంగ స్వభావానికి అనుగుణంగా ఉంటుంది. రాజ్యాం గం స్వభావాన్ని ప్రతిఫలించేలా అధికార యంత్రాంగం స్వభావం ఉండేలా నిర్మాణాన్ని తీర్చిదిద్దాలి. ఇంకా చెప్పాలంటే అధికార యంత్రాంగం స్వభావాన్ని ఒక్కదాన్నే మార్చడం ద్వారా రాజ్యాంగాన్ని వక్రీకరించే ప్రమాదం ఉంది. రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడవడం, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పనిచెయ్యడం ద్వారా రాజ్యాంగానికి అధికార యంత్రాంగానికి పొసగకుండా చేసే ప్రమాదముంది" అని స్పష్టం చేశాడు.

ఇవాళ కేంద్రమంత్రివర్గంలో నరేంద్ర మోడీ సహా 19 మంది మంత్రివర్యులు ఆర్.ఎస్.ఎస్. కుదురునుండి వచ్చినవాళ్ళే. హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి వాళ్ళేం రాజ్యాంగాన్ని సవరించాల్సిన పనిలేదు. శ్యాంప్ర సాద్ ముఖర్జీ వాళ్ళకి రాజమార్గం చూపించాడు. 1946 జనవరి 6వ తేదీ డైరీ పేజీలో ఇందుకు సంబంధించిన 'క్లూ'ను తన వారసులకోసం

> **"డెబ్భైఐదు శాతం మంది జనాభా హిందువులుగా ఉన్న ఈ దేశంలో భారతదేశం ప్రజాస్వామిక పరిపాలనను ఎంచు కుందంటే ఆటోమాటిగ్గా అందులో హిందువులు ప్రధానపాత్ర పోషిస్తారు' అంటాడు శ్యాంప్రసాద్ ముఖర్జీ. దీనినే 'మెజారిటీ ఆధిపత్యం' అంటాం. కాబట్టి వరుసవారీ కార్య నిర్వాహక ఆజ్ఞల ద్వారా ఇప్పుడున్న లౌకిక పునాదులను ధ్వంసం చేయటానికి అవసరమైన వాతావరణం సృష్టించుకోవడం మోదీ మంత్రి వర్గానికి పెద్ద పనికాదు."**




రాసిపెట్టి ఉన్నాడు. "డెబ్భైఐదు శాతం మంది జనాభా హిందువులుగా ఉన్న ఈ దేశంలో భారతదేశం ప్రజాస్వామిక పరిపాలనను ఎంచు కుందంటే ఆటోమాటిగ్గా అందులో హిందువులు ప్రధానపాత్ర పోషిస్తారు" అంటాడు శ్యాంప్ర సాద్ ముఖర్జీ. దీనినే 'మెజారిటీ ఆధిపత్యం' అంటాం. కాబట్టి వరుసవారీ కార్య నిర్వాహక ఆజ్ఞల ద్వారా ఇప్పుడున్న లౌకిక పునాదులను ధ్వంసం చేయటానికి అవసరమైన వాతావరణం సృష్టించుకోవడం మోదీ మంత్రివర్గానికి పెద్ద పనికాదు.

ఒక జాతి నడక, నడత ఎలా వుంటుందో అది ఎంచుకునే చారిత్రక మహా కథనాలను, అది కీర్తించే కథానాయకులను బట్టి ఒక అంచనాకు రావొచ్చు. భారత రత్న బిరుదులు ఇవ్వడానికి మోదీ ఇద్దరు సంఘుపరివార్ ప్రముఖులను ఎంచుకున్నాడు. గోపాలకృష్ణ గోఖలేనో, దాదాభాయ్ నౌరొజీనో ఎందుకు ఎంచుకోలేదు?

ఘనమైన స్వాతంత్ర్యోద్యమ వారసత్వం లేని కారణానేనా గత కాలపు ఘనకీర్తిగా భగవద్గీతను ఊరేగించడం, గాడ్సేను కీర్తించడం? ఈ మత మార్పిడులు, పరమత విద్వేషం, హింస... ఇవన్నీ దేనికి సంకేతాలు? వీటన్నింటినీ మించిన కుట్ర ఏమిటంటే అధికార పార్టీకి ప్రభుత్వానికి మధ్యన ఉండాల్సిన అంతరాలను పక్కన పెట్టటం,క్యాబినెట్ మంత్రు లను, సివిల్ సర్వీస్ అధికారులను అంగుష్ట మాత్రులుగా మార్చి సర్వం, సకలం, ఒక్కటిగా చలామణీ చేయటానికి ప్రయత్నం చేస్తున్నారు.

అధికార యంత్రాంగం స్వభావం మార్పు లకు లోనవుతూ ఉన్నది. ఇప్పుడు ప్రమాదంలో పడింది అధికార యంత్రాంగం కాదు... భారత లౌకిక ప్రజాస్వామిక రాజ్యాంగమే. తస్మాత్ జాగ్రత్త...

**(అనువాదం : సత్యరంజన్ కె.)**

పార్టీ నిర్మాణం

# కమ్యూనిస్టు పార్టీలో నాయకత్వ ఎన్నిక



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు.

**ఎస్. వీరయ్య**

పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి విస్తృతమైన అర్థమున్నది. సాధారణ పార్టీ సభ్యులు, సానుభూతిపరులు పార్టీ నాయకత్వం ముందు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు పంచుకునే అవకాశం ఇందులో భాగమే. శాఖల్లోనూ, కమిటీల్లోనూ నిర్మొహమాటంగా తమ అభిప్రాయాలు చెప్పే అవకాశం ఉండాలి. మరింత నిర్దిష్టంగా చెప్పవలసి వస్తే, నిర్ణయాలు చేయడంలోనూ, అమలు చేయడంలోనూ, సమీక్ష చేయడంలోనూ అంతర్గత ప్రజాస్వామ్యం అమలు చేయాలి. తప్పొప్పులు నిర్ధారించడం, పొరపాట్లను సరిదిద్దుకోవడంలో కూడా ఇది ప్రతిబింభించాలి. ఇది విమర్శ, ఆత్మ విమర్శ రూపంలో వ్యక్తమవుతుంది. అంతేగాదు, నాయకత్వ ఎన్నికల్లో కూడా అంతర్గత ప్రజాస్వామ్యం అమలు చేయాలి.

నాయకత్వం విషయంలో మూడు రకాల ధోరణులకు అవకాశం ఉంది. ఎన్నిక, ఎంపిక, స్వాధీనం చేసుకోవడం రూపంలో ఇవి వ్యక్తమవుతుంటాయి. ఎన్నిక మినహా మిగతా రెండు ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలే. కమ్యూనిస్టు పార్టీకి హానికరమే.

కమ్యూనిస్టు పార్టీలో నాయకత్వ పాత్ర చాలా కీలకమైంది. ఇది అలంకారం కాదు. హొదా అంతకంటే కాదు. వర్గపోరాటం నడపాలి. పాలకవర్గాల రాజ్యాంగ యంత్రానికి వ్యతిరేకంగా పోరాడవలసిన పార్టీ. రాజ్యాధికారం కోసం ప్రజా ఉద్యమం నడపవలసిన బాధ్యత కమ్యూనిస్టు పార్టీ మీద ఉంది. కమ్యూనిస్టు పార్టీలో నాయకత్వం అంటే హొదా కాదు, బాధ్యత. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన స్థానం. అందుకే నాయకత్వాన్ని ఎన్నుకునేటప్పుడు మహాసభకు హాజరైన ప్రతినిధుల్లో క్యాంపెయిన్ ద్వారా కాకుండా, గత మహాసభ తర్వాత కాలంలో ఉద్యమాలు, పార్టీ నిర్మాణంలో గ్రహించిన అనుభవాల పరిశీలన ఆధారంగానే ప్రతినిధులు నిర్ణయం తీసుకుంటారు. సమర్ధవంతమైన నాయకులకు నాలుగు లక్షణాలు ఉండాలి. క్లిష్ట సమయాల్లో కూడా గందరగోళపడకుండా తగు నిర్ణయాలు చేయగలగాలి. నిర్ణయాలు అమలు చేయడానికి అవసరమైన కార్యకర్తలను సమకూర్చుకోగలగాలి. వారి సామర్థ్యాన్ని బట్టి, వారికున్న అవకాశాలను బట్టి పని విభజన చేసి అమలు జరిగేటట్టు చూడాలి. అంతిమంగా ఫలితాలను సమీక్షించి అనుభవాలు–గుణపాఠాలు క్రోడీకరించగలగాలి. ఇవన్నీ సమిష్టి పని విధానంలో భాగమే. అయితే నాయకత్వానికి ఉండాల్సిన అత్యంత కీలకమైన లక్షణాలివి. నాయకత్వాన్ని ఎన్నుకునే క్రమంలో ప్రతినిధులు ఈ దృష్టితోనే పరిశీలిస్తారు.

టీమ్ లీడర్ స్థానం మరింత బాధ్యతాయుతమైంది. టీమ్ లీడర్‌కు అన్ని రకాల సామర్థ్యం ఉంటే మంచిదే. కానీ, ఇతర శక్తి, సామర్థ్యాలకు పరిమితులున్నా, ఐక్యతను కాపాడడం అత్యంత కీలకమైన బాధ్యత. కమ్యూనిస్టు పార్టీలో సైద్ధాంతిక ఐక్యత, నిర్మాణ ఐక్యత ముఖ్యం. ఈ రెండింటినీ కాపాడడంలోనూ, అభివృద్ధి చేయడంలోనూ కార్యదర్శికి ప్రధాన బాధ్యత ఉంటుంది. అందుకే కార్యదర్శి స్థానంలో ఉన్న వ్యక్తులు సమస్యలు పరిష్కరించేవారుగా ఉండాలే తప్ప, సమస్యలకు కారణం కారాదు. సమస్యలు సృష్టించకూడదు. అలాంటి లక్షణాలు ఉన్నవారు ఆ స్థానానికి తగరు. అందుకే కార్యదర్శిని ఎన్నుకునే సందర్భంగా నాయకత్వానికి ఉండాల్సిన సాధారణ లక్షణాల కన్నా, ఈ విషయానికి మొదటి ప్రాధాన్యతను ఇస్తారు.

నాయకత్వ ఎన్నిక ప్రజాస్వామ్యయుతంగా జరగాలన్న విషయాన్ని అర్థం చేసుకోవడంలో కూడా తప్పటడుగులు పడుతుంటాయి. ఎవరైనా పోటీ చేసి ఎన్నికలు జరిగితేనే ప్రజాతంత్ర పద్దతి అని, లేకుంటే కాదన్న అభిప్రాయం పొరపాటు. అంతేకాదు సాధారణంగా ఈ ప్రక్రియలో ఎన్నిక, ఎంపిక, స్వాధీనం చేసుకోవడం లాంటి పరిణామాల్లో ఏదో ఒకటి జరుగుతుంది. ఎన్నుకునే కార్యకర్తల పరిశీలన ఆధారంగా స్వేచ్ఛగా తమ అభిప్రాయం చెప్పడం, ఓటు వేయడం నిజమైన ప్రజాస్వామ్యం. తమ పరిశీలనలోనూ, అంచనాలోనూ సరైన నిర్ధారణకు రాగలిగితే, సరైన నాయకత్వాన్ని ఎన్నుకుంటారు. అందులో ఏమైనా లోపాలు ఉంటే అనుభవంలో చూడాల్సిందే. ఈ క్రమంలోనే ఏకగ్రీవంగానూ లేదా మెజారిటీ అభిప్రాయం ప్రకారం ఎన్నిక జరుగుతుంది. ఇది సరైన పద్ధతి. ఎన్నుకోవలసిన కార్యకర్తలు తగు నాయకత్వాన్ని ఎన్నుకోగలుగుతారో, లేదో అన్న సందేహంతో పై నాయకత్వం ప్రతిపాదించడం లేదా జోక్యం చేసుకోవడం ఎన్నికను ప్రభావితం చేస్తుంది. అది అంతిమంగా సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి తోడ్పడితే ఆచరణలో మంచి ఫలితాలు ఇవ్వవచ్చు. అంత మాత్రాన అది ఎన్నిక కాజాలదు. ఎంపిక మాత్రమే అవుతుంది. ఎంపిక, ఎన్నిక ఒకటి కాదు. ఓటేసేవారి అభిప్రాయానికి అనుగుణంగా నిర్ణయం తీసుకోవడం ఎన్నిక. పై కమిటీ నాయకత్వం అభిప్రాయంతో ప్రభావితమై నిర్ణయం తీసుకున్నప్పుడు అది ఎన్నిక రూపంలో కనపడినా, వాస్తవంగా ఎంపిక మాత్రమే అవుతుంది. ఇది అంతర్గత ప్రజాస్వామ్యానికి పరిమితులు విధించడమే అవుతుంది. ఈ రెంటికీ భిన్నమైంది – నాయకత్వ స్థానాన్ని చేజిక్కించుకోవడం లేదా స్వాధీనం చేసుకోవడం. ఇది ప్రజాస్వామ్యం పేరుతో జరిగే అప్రజాస్వామిక చర్య. అవాంఛనీయమైన పద్ధతి. హానికరం కూడా. కార్యదర్శివర్గంలోకి లేదా కార్యదర్శి స్థానానికి తనకు అవకాశం ఇవ్వాలని

> ***"సమిష్టితత్వం అంటే, నిబంధనావళికి లోబడిన సమిష్టి తత్వంగానే భావించాలి. అది కేంద్రీకృత ప్రజాస్వామ్యంలో అంతర్భాగం కావాలి. ఒక వ్యక్తికి బదులు, కొంత మంది కలిసి చేసే నిర్ణయాలన్నీ సమిష్టి నిర్ణయాలుగానే పరిగణిస్తే అవి నిబంధనావళికి వెలుపల కూడా చేయవచ్చు. తాను భాగస్వామిగా ఉన్న కమిటీలో కాకుండా, వెలుపల ఇతరులతో కలిసి చేసే నిర్ణయాలను సమిష్టి నిర్ణయాలుగా పరిగణించకూడదు."***

కోరడం తప్పుకాదు. అందుకోసం ప్రచారం చేయడం, ప్రభావితం చేయడం పొరపాటు. కొత్త కమిటీ సభ్యులను పాత కమిటీ ముందే చర్చించి ప్రతిపాదిస్తుంది. అందువల్ల అప్పటికే కమిటీలో ఉన్నవారికి కొత్తగా ప్రతిపాదించేవారి గురించి ముందే తెలుస్తుంది. అలాంటి వారికి ప్రతిపాదనను ముందే లీక్‌చేసి నువ్వు ఎన్నిక కాబోతున్నావని, కార్యదర్శివర్గంలోకి లేదా కార్యదర్శి స్థానానికి నాకే ఓటు వేయాలని వ్యక్తిగతంగా కోరడమంటే, తనకు అనుకూలమైన గ్రూపును తయారు చేసుకోవడమే. వ్యక్తిగత ప్రయోజనాలేవో ఉన్నప్పుడు మాత్రమే ఇలా వ్యవహరించే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత ప్రయోజనాలు లేకపోయినా, ఎన్నికలో పొరపాటు జరగకుండా చూడాలనే పేరుతో ఇలా వ్యవహరించినప్పటికీ, తామే పొరపాటు చేయడం అవుతుంది. ఇతరులు పొరపాటు పద్ధతులననుసరించడానికి అవకాశం ఇవ్వడమే. ఇది ప్రజాస్వామ్య పద్ధతి కాదు. నువ్వు నాకు ఓటెయ్యాలి అని చెప్పకపోయినా, ఈ సారి నువ్వు ఎన్నికవుతావు అని గాని లేదా ఈ సారి నీ విషయం చూద్దాం, తొందరపడకు అని గాని అంటే చాలు – నీకోసం నేను ప్రయత్నం చేస్తున్నా అనే సంకేతాలు ఇవ్వడమే అవుతుంది. మిగతావి చెప్పకున్నా, చెప్పినట్టే. ఒక నాయకుడి లేదా నాయకురాలి నిజాయితీని, నిబద్ధతను నిరంతరం ప్రశ్నించేవారు, ఉన్నట్టుండి వారికి అనుకూలంగా మారితే అనుమానించవలసిందే. నిజాయితీ లేకపోవడం నిజమైతే అంతర్గత పోరాటం కొనసాగించాలి. నిజాయితీ లేదని తాము పొరపాటుగా అర్థం చేసుకుని ఉండి ఉంటే దానిని అంగీకరించాలి. ఈ రెండూ లేకుండా ఎన్నిక సమయంలో అనూహ్యంగా అనుకూలించడం పరిశీలించవలసిన విషయమే. నూతన కమిటీ ప్రతిపాదనలో తన పేరు ఉంటే మిన్నకుండడం, లేకుంటే గొణగటం, ఆశించి అవకాశం రాని వారితో లేదా తనపట్ల సానుభూతి ప్రదర్శించే వారితో గుసగుసలు నడిపి గుంపు చేయడం సరైందికాదు. స్థూలంగా మహాసభలు ఐక్యతను పెంపొందించుకునే విధంగానూ, పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచే విధంగానూ, ప్రజలకు సందేశాన్నిచ్చే విధంగానూ జరగాలి. పార్టీ సభ్యులు, కార్యకర్తలు ఇదే ప్రధాన లక్ష్యంగా పని చేయాలి.

నాయకత్వం ఆశించేవారిని సముదాయించడం లేదా నచ్చజెప్పడం వంటి సందర్భాలు వస్తాయి. ఇలాంటి సమయంలో ప్రజాస్వామ్య పద్ధతికీ, అప్రజాస్వామ్య పద్ధతికి వెంట్రుకవాసి తేడా ఉంటుంది. సున్నితంగా అమలు జరపవలసి వస్తుంది. ఇలాంటి సందర్భాలను దుర్వినియోగం చేసే అవకాశమూ ఉంటుంది. సముదాయించడం లేదా నచ్చజెప్పడం అంటే, పార్టీ పద్ధతులు గుర్తు చేయడం. సామర్థ్యం పెంచుకునేందుకు సూచనలు చేయడం. లోపాలు సరిదిద్దుకునేందుకు మార్గం చెప్పడం. సామర్థ్యంలో పెద్ద తేడా లేకపోయినా, ప్రాతినిథ్యమూ అవసరమే అయినా, పరిమితులు అర్థం చేయించేందుకే ఈ ప్రక్రియ. అలా కాకుండా "తొందరపడకు, రాబోయే మహాసభ వరకు ఓపిక పట్టు" అనడం లేదా "మధ్యంతర సమీక్ష వరకు ఓపిక పట్టు" అనడం అంటే వాగ్దానం చేయడమే. కొన్ని సందర్భాల్లో "మెజారిటీ ఒప్పుకోలేదయ్యా" అనడం లేదా కమిటీ/ కార్యదర్శివర్గం అంగీకరించలేదని చెప్పడమంటే "నేను నీకు అనుకూలంగానే ఉన్నాను" అని సంకేతాలివ్వడమే. ఇవి తప్పుడు పద్ధతులు. అంతర్గత ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్యలు. అలా కాకుండా "కార్యదర్శివర్గం/ కమిటీ చర్చించింది. ప్రస్తుతానికి సాధ్యం కాదని నిర్ణయించింది" అనడం సరైన పద్ధతి. ఇలా చెప్పడంలో తన వ్యక్తిగత అభిప్రాయం ఏమిటో ఎదుటి వ్యక్తికి వ్యక్తం కాదు.

ఒక కార్యకర్త గురించి నాయకత్వానికి ఒక అభిప్రాయం ఏర్పడినప్పుడు దానిని తొలగించుకునేందుకు ప్రయత్నం చేయాలా? అయితే అందుకోసం ఏం చేయాలి? ఇలాంటి విషయాలు అనేక సందర్భాల్లో ముందుకొస్తుంటాయి. ఇక్కడ నాయకత్వానికి అభిప్రాయం ఏ పరిస్థితుల్లో ఏర్పడిందనేది ముఖ్యం. తాను మళ్ళీ పొరపాటు చేయకుండా ఉండడం ద్వారా మాత్రమే నాయకత్వం అభిప్రాయాన్ని మార్చగలరు. ఒకవేళ నాయకత్వం పొరపాటుగా అర్థం చేసుకున్నదనుకుంటే, అందుకు అవకాశం ఇచ్చిన పరిస్థితులను విశ్లేషించాలి. అపార్థాలకు అవకాశం లేకుండా వ్యవహరించాలి. ఇవి సరైన పద్ధతులు. నాయకులతో సన్నిహితంగా ఉండి, వ్యక్తిగతంగా మాట్లాడి దగ్గరయ్యేందుకు ప్రయత్నించడం మెప్పు పొందే ప్రయత్నమే అవుతుంది. నాయకత్వంతో వ్యక్తిగతంగా మాట్లాడడమే తప్పుగా పరిగణించగలమా? కాదు. సమస్య జఠిలం కాకముందే తనవైపు నుండి జరిగిన లోపాన్ని నాయకత్వానికి వ్యక్తిగతంగా తెలియజేయవచ్చు. సరిదిద్దుకునేందుకు సలహాలు స్వీకరించవచ్చు. ఇది సరైన పద్ధతి. అలా చేయనప్పుడు, జరిగిన నష్టానికి బాధ్యత వహించి, భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూసుకోవడమే మార్గం. ఇందులో కీలకమైన అంశం ఆత్మవిమర్శ.

**'మార్క్సిస్టు' పై**

**మీ అభిప్రాయాలు తెలపండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

ఆర్థిక రంగం

# నయా-ఉదారవాదం: ప్రజాస్వామ్యం


రచయిత ప్రఖ్యాత మార్క్సిస్టు ఆర్థిక శాస్త్రవేత్త, రచయిత

ప్రభాత్ పట్నాయక్

ప్రజాస్వామ్యం మనగలగాలంటే ప్రజాస్వామిక కార్యకలాపాలలో పాల్గొనటం ద్వారా తమ జీవితాలను మార్చుకోగలమనే విశ్వాసం ప్రజలకుండాలి. ఈ నమ్మకం పొరపాటే కావచ్చు. అది కేవలం భ్రాంతి మాత్రమే కావచ్చు. కానీ ఈ భ్రాంతి లేకపోతే ప్రజాస్వామిక క్రమం పట్ల ప్రజలు విశ్వాసం కోల్పోవటమేకాక తమ స్వంత ప్రయత్నాల ద్వారా తమ జీవితాల్ని మార్చుకోగలమనే అత్మవిశ్వాసాన్ని కోల్పోతారు. ఆవిధంగా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయినవారు తమ రక్షణ కోసం సర్వాధికారాలు కలిగిన “రక్షకుడు,” “అధినాయకుడు” కావాలని కోరుకోవటానికి దారితీస్తుంది. అటువంటి స్థితిలో వారు తర్కబద్ధంగా ఆలోచించలేరు. క్రమంగా అహేతుకమైన భావాలవైపు మరలుతారు. గుత్తపెట్టుబడిదారీ విధానం ఆధిపత్యం వహిస్తున్నప్పుడు ఇటువంటి “రక్షకుడు” “అధినాయకుడు” తయారు చేయబడతారు, లేదా పెంచిపోషింపబడతారు. కొన్ని ఉదాహరణలు చూస్తే, రాజకీయరంగంలో స్వయంగా ఎదగటానికి ప్రయత్నం చేసేవారిని కార్పొరేట్ ద్రవ్యపెట్టుబడిదారీ శక్తులు తమ చేతిలో ఉన్న మీడియాను వినియోగించుకొని, వారికి ప్రచారం చేస్తూ, వారిని తమగుప్పెట్లో పెట్టుకొంటారు. వారు అధికారంలోకి వచ్చిన తర్వాత వారి పాలనకు కార్పొరేట్ పాలనకు వ్యత్యాసం లేకుండా ఉండేలా చేస్తారు. ఫాసిజంలోని కీలకమైన అంశం ఇదే. (ముస్సోలిని ఈ విధంగా రాశాడు “ఫాసిజం అంటే రాజ్యమూ కార్పొరేట్ రంగమూ కలిసిపోయి ఉంటాయి కాబట్టి ఫాసిజాన్ని కార్పొరేటిజంగా పిలవటం సమంజసంగా ఉంటుంది”.) రాజకీయంగా ప్రజాస్వామిక ప్రక్రియ ద్వారా తమ జీవితాల్లో మార్పు తెచ్చుకోగలమనే విశ్వాసాన్ని ప్రజలు కోల్పోవటం ఫాసిజానికి అవసరమైన పరిస్థితులను సృష్టిస్తుంది. వీమర్ రిపబ్లిక్ ఎదుర్కొన్న పరిస్థితి ఈవిషయాన్ని స్పష్టం చేస్తున్నది. వెర్సెయిల్స్ సంధిలో విజయం సాధించిన కూటమి రాజ్యాలు జర్మనీపై రుద్దిన యుద్ధ నష్టాల భారాల వలన ఆ తర్వాత జర్మనీలో ఎన్నికైన ప్రభుత్వాలు ప్రజలెదుర్కొంటున్న దీన స్థితి నుండి వారికేమాత్రం ఉపశమనం కలిగించలేకపోయాయి. దానితో ప్రజల దృష్టిలో వీమర్ రిపబ్లిక్‌కు ఏమాత్రం విలువలేకుండా పోయింది. ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోవటం జర్మన్ ప్రజలు నాజీయిజానికి లొంగిపోవటంలో ప్రధానపాత్ర వహించిది. వీమర్ రిపబ్లిక్ విఫలం కావటానికి శాంతి ఒప్పందంలోని ప్రత్యేక షరతులు ప్రధానకారణంగా ఉన్నాయి. (ఆ సమయంలో ఆఒప్పందాన్ని కీన్స్ కూడా వ్యతిరేకించాడు.) “ప్రపంచీకరణ” యుగంలో ప్రజలు ప్రస్తుతం నామకా అమలులో ఉన్న ప్రజాస్వామిక పద్ధతుల ద్వారా తమ సమస్యలు పరిష్కారమౌతాయనే విశ్వాసాన్ని కోల్పోతారు. ఈ వ్యవస్థలో ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు కూడా ప్రజలు వ్యవస్థ పట్ల విశ్వాసం కోల్పోయేలా చేస్తాయి. నయా-ఉదారవాద విధానాలు ప్రజలు ప్రజాస్వామిక సంస్థల సమర్ధతపై విశ్వాసం కోల్పోయేలా చేస్తాయి. ప్రజలలో అరాచకత్వాన్ని, ఫాసిస్టు ధోరణులను కూడా పెంచుతాయి. ఈవిషయాన్ని మనం మరో కోణం నుండి పరిశీలిస్తే నయా-ఉదారవాద విధానాలు రాజకీయాలను ఒక “ముగింపు”కు (క్లోజర్) దిగజారుస్తున్నాయన్న విషయం స్పష్టమౌతుంది. వివిధ రాజకీయ పార్టీలు ఒకే విధమైన ఆర్థిక విధానాలు అనుసరిస్తుండటంతో ప్రజలు ఏ రాజకీయపార్టీని అనుసరించినా వారి భౌతిక, ఆర్థిక పరిస్థితులలో మాత్రం చెప్పుకోదగిన మార్పు ఉండటం లేదు. ఈ “ముగింపు” అనేది కేవలం అవగాహనా పరమైనది మాత్రమే కాదు. ప్రష్యన్ రాజ్యం ఏర్పడటంతో చారిత్రక అభివృద్ధి క్రమం ముగింపు కొచ్చిందని హెగెల్ చెప్పాడు. తత్వశాస్త్రంలో హెగెల్ సిద్ధాంతాలతో పాటే ఆర్థికరంగంలో అభివృద్ధి అయిన సాంప్రదాయక రాజకీయ అర్ధశాస్త్రం పెట్టుబడిదారీ తరహా ఉత్పత్తి విధానం ప్రారంభం కావటంతో చరిత్ర అంతం అయిందని చెప్పింది. ఇది కేవలం భావాత్మకమైనది మాత్రమే. మరోవైపున నయా-ఉదారవాద విధానాలు నిజమైన రాజకీయ ప్రత్యామ్నాయ అవకాశాలను ప్రజల ముందుంచటానికి బదులుగా అది వాటిని రద్దుచేస్తూ, రాజకీయాలను ముగింపుకు తీసుకొస్తాయి. భౌతిక పరిస్థితుల రీత్యా చూసినపుడు ప్రజలకు ఈ ప్రత్యామ్నాయాలలో ఒకదానికీ మరొకదానికీ మధ్య వ్యత్యాసం కనిపించదు. ఫలితంగా ప్రజలు ఆశాభంగం చెందటం అరాచకత్వానికి, ఫాసిజా నికి దారితీస్తుంది. నయా-సరళీకరణ విధానాలు అటువంటి “ముగింపు”కు ఎందుకు దారితీ స్తాయి? ఈ ప్రశ్నను మనం చర్చిద్దాం.

## 1

ముఖ్యమైన కారణం అందరికీ తెలిసిందే కాబట్టి ఆ అంశాన్ని గురించి ఎక్కువ సమయం వెచ్చించను. ప్రపంచీకరణ సరుకులు, సేవలు మరీ ముఖ్యంగా ద్రవ్యరూపంలోని పెట్టుబడులు ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛగా సంచరించటానికి అవకాశం కల్పిస్తుంది. పెట్టుబడులు ప్రపంచ వ్యాపితంగా సంచరిస్తూండగా ప్రభుత్వాలు జాతీయ ప్రభుత్వాలుగా ఉండటంతో, ప్రభుత్వాలు తమ విధానాలను “పెట్టుబడిదారుల విశ్వాసాన్ని” నిలబెట్టుకొనేలా రూపొందించాల్సి వుంటుంది. అంటే ప్రపంచీకరించబడిన పెట్టుబడి యొక్క దురాశలన్నింటినీ తీర్చే విధానాలను రూపొందించాలి. లేకపోతే పెట్టుబడి కట్టకట్టుకొని ఆదేశం నుండి నిష్క్రమిస్తుంది. దానితో ఆ దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. తమదేశం ప్రపంచీకరణ చట్రంలోనే ఉండాలనుకొనే రాజకీయపార్టీలు అటువంటి సంక్షోభాన్ని నివారించటానికి వాణిజ్యంపైనా, పెట్టుబడులపైనా ఆంక్షలు విధించరు. ప్రపంచీకరించబడిన పెట్టుబడులు అంగీకరించే

విధానాలనే అమలు చేస్తారు. ఇది ప్రజలకు ఏ విధమైన రాజకీయ ప్రత్యామ్నాయానికి అవకాశం లేకుండా చేస్తుంది. వారు ఎవరిని ఎన్నుకున్నా, ప్రత్యామ్నాయం కోసం ప్రజలు చేసిన ప్రయత్నాల వలన వేరే ఏప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చినా, ప్రజలు ఆమోదించక పోయినా అవే "నయా-ఉదారవాద" విధానాలను అమలు చేస్తారు. దీనిని మనదేశంలో చూస్తున్నాం. ఇక్కడ యు.పి.ఎ.అధికారంలో ఉన్నా, యన్.డి.ఎ.అధికారంలో ఉన్నా, కొద్దికాలం "మూడోకూటమి" అధికారంలో ఉన్నా మౌలిక ఆర్థిక విధానాలలో ఏమార్పూ లేదు. ఎన్నికల్లో కూడా రాహుల్ గాంధీకి, నరేంద్రమోడీకి ఆర్థిక విధానాలలో మౌలికమైన విభేదాలేమీ లేవు. వాస్తవంగా తన గొప్పదనం యు.పి.ఎ. కన్నా బాగా "పరిపాలించటం"లో ఉందని మోడి తనకు తానుగా చెప్పుకుంటున్నాడు. ప్రజల జీవిత సమస్యలను పరిష్కరించటానికి మౌలికంగా ప్రత్యామ్నాయ విధానాలు అనుసరిస్తానని చెప్పలేదు. ప్రపంచీకరణ యుగంలో నిజమైన ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలకు అవకాశం లేదని ఇది తెలియజేస్తున్నది.

> "యు.పి.ఎ.అధికారంలో ఉన్నా, యన్.డి.ఎ.అధికారంలో ఉన్నా, కొద్దికాలం 'మూడోకూటమి' అధికారంలో ఉన్నా మౌలిక ఆర్థిక విధానాలలో ఏమార్పూ లేదు. ఎన్నికల్లో కూడా రాహుల్ గాంధీకి, నరేంద్రమోడీకి ఆర్థిక విధానాలలో మౌలిక భేదాలేమీ లేవు. వాస్తవంగా తన గొప్పదనం యు.పి.ఎ. కన్నా బాగా 'పరిపాలించటం'లో ఉందని మోడి తనకు తానుగా చెప్పుకుంటున్నాడు. ప్రజల జీవిత సమస్యలను పరిష్కరించటానికి మౌలికంగా ప్రత్యామ్నాయ విధానాలు అనుసరిస్తానని చెప్పలేదు."

ఈ మౌలిక అంశానికి అదనంగా ఈ దశలో దేశంలోని వర్గ నిర్మాణంలో చోటు చేసుకొంటున్న మార్పులు కూడా ప్రత్యామ్నాయ ఆర్థిక నమూనాను అనుసరించటానికి ఆటంకం కలిగిస్తున్నాయి. కార్మికుల, రైతుల సంఖ్య తగ్గటమే ఈ మార్పుల సారాంశం. ద్రవ్య పెట్టుబడులను సంతృప్తి పర్చటానికి పూనుకున్న ప్రభుత్వాలు బడా పెట్టుబడుల క్రూరమైన దోపిడి నుండి చిన్న ఉత్పత్తిదారులనురక్షించే, వారికి మద్దత్తిచ్చే విధానాలను ఉపసంహరిస్తున్నాయి. ఇది చిన్న ఉత్పత్తిదారులను, (రైతులు, వృత్తిదారులు, మత్స్యకారులు, చేతివృత్తిదారుల లాంటి వారిని) చిన్నవ్యాపారులను బడా పెట్టుబడి దోపిడీ చేసి, వారి ఆస్తులను స్వంతం చేసుకోవటానికి దారితీస్తుంది. ప్రత్యక్షంగా భూముల్ని తక్కువ ధరలకు స్వాధీనం చేసుకోవటంద్వారా, వారిఆదాయ "ప్రవాహాన్ని" తగ్గించటం ద్వారా, వారు "సాధారణ పునరుత్పత్తి"ని చేయలేని, బ్రతకలేని పరిస్థితిని కల్పించటం ద్వారా ఆస్తులను స్వంతంచేసుకొంటారు. సర్వం కోల్పోయిన చిన్న ఉత్పత్తిదారులు పనికోసం వెదుకుతూ పట్టణ కేంద్రాలకు చేరి అక్కడ నిరుద్యోగుల సంఖ్యను పెంచుతారు. మరోవైపున నయా-ఉదారవాద విధానాలతో ఆర్థికాభివృద్ధి ఉన్నతస్థాయిలో ఉన్నపుడు కూడా అవసరమైనన్ని ఉద్యోగాలు కల్పించలేరు. ఉదాహరణకు భారతదేశంలో ఆర్థికాభివృద్ధిలో



నల్లడబ్బుకు
నయా-ఉదారవిధానాలకు లింకు ఉంది

అధికపెరుగుదల ఉన్న 2004-05 నుండి 2009-10 సంవత్సరం వరకు కూడా సంవత్సరానికి 0.8 శాతం మాత్రమే ఉద్యోగావకాశాలు పెరిగినట్లు జాతీయ నమూనా సర్వే స్పష్టం చేసింది. సాధారణమైన జనాభా పెరుగుదల రేటు సంవత్సరానికి 1.5 శాతం ఉన్నస్థితిలో, ఆ అంకెలనే పనిచేసే వారి శాతం పెరుగుదలకు ప్రమాణంగా తీసుకున్నా, ఉపాధి కోల్పోయిన చిన్న ఉత్పత్తిదారులు కూడా ఉద్యోగాల కోసం వెతుకుతున్న వారికి తోడవుతారు. ఫలితంగా ఉద్యోగాల కోసం వెతుకుతున్నవారు 1.5 శాతం కన్నా బాగా ఎక్కువ ఉండగా, ఉద్యోగాల కల్పన కేవలం 0.8 శాతం మాత్రమే ఉండటంతో ఉద్యోగాలు చేసేవారితో పోలిస్తే "నిరుద్యోగ సైన్యం" శాతం పెరుగుతుంది. ఫలితంగా కార్మికుల బేరసారాల శక్తి తగ్గుతుంది. ఉద్యోగులు నిరుద్యోగుల మధ్య వ్యత్యాసం కూడా క్రమంగా తగ్గిపోతుంది. మనం ఉద్యోగులు పూర్తిస్థాయి ఉద్యోగులుగా ఉంటారని, నిరుద్యోగులు పూర్తి నిరుద్యోగులుగా (లేదా తాత్కాలిక ఉద్యోగాలు చేస్తూ) ఉంటారని భావిస్తాం. ఉదాహరణకు 100 మంది శ్రామికులలో 90 మంది పూర్తిగా పనిచేస్తూ 10 మంది నిరుద్యోగులుగా ఉండటానికి మారుగా, వాస్తవంలో ప్రతివారూ 90 శాతం పనిచేస్తూ ఉంటారు. అపుడు "ఉద్యోగకల్పనలో క్రమబద్ధీకరణ నిబంధనలు" ఉన్నప్పటికీ (ఎంప్లాయ్‌మెంట్ రేషనింగ్ రూల్) "ఉద్యోగులు", "నిరుద్యోగుల" మధ్య అంతరం అంతమౌతుంది.

ఉద్యోగులతో పోల్చుకున్నపుడు క్యాజువల్ లేబర్, ఇన్‌ఫార్మల్ లేబర్, ఇంటర్ మిట్టెంట్ లేబర్, "స్వయం ఉపాధి" (సాంప్రదాయకంగా రైతుల లాంటి వారు కాకుండా) పొందేవారి సంఖ్య పెరగటం, ఉద్యోగాలు చేసేవారికి కూడా తగిన ఉద్యోగాలు దొరకకపోవటం, ఉద్యోగ కల్పన క్రమబద్దీకరణలో మార్పులను తెలియజేసే నూతనాంశంగా ఉంటున్నది. పెరుగుతున్న నిరుద్యోగుల సంఖ్య కార్మికుల స్థితిని బలహీనం చేయటం వలన ఉద్యోగకల్పన క్రమబద్ధీకరణ పద్ధతి సమస్యను మరింత జఠిలం చేస్తుంది. "ఉద్యోగకల్పన క్రమబద్ధీకరణ నిబంధన"ల్లో మార్పులు మాత్రమే కాక "ఉద్యోగకల్పన నిబంధన"ల్లోనే మార్పులు వస్తాయి. శాశ్వత ఉద్యోగులకు బదులు తాత్కాలిక ఉద్యోగులను పెట్టుకోవటం, పెద్ద యజమానులు గతంలో శాశ్వత ఉద్యోగుల చేత చేయించిన పనులను, కాంట్రాక్టర్లకు "అవుట్ సోర్సింగ్"కు ఇవ్వటం (రైల్వేలు దీనికి మంచి ఉదాహరణ) చేస్తారు. ఇది కూడా కార్మికుల బేరసారాల శక్తిని, సమ్మె చేయగలశక్తిని తగ్గిస్తుంది. ఇదే విధంగా ప్రభావం చూపే మరో రెండంశాలున్నాయి. మొదటిది ప్రపంచీకరణ యుగంలో వేగం పుంజుకున్న ప్రైవేటీకరణ ప్రక్రియ. పెట్టుబడిదారీ ప్రపంచం అంతటిలోనూ ప్రైవేటు రంగం కన్నా ప్రభుత్వ రంగంలోనే యూనియన్లలో సంఘటితం అయిన కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఉదాహరణకు అమెరికాలో ప్రైవేటు రంగంలో ఎనిమిది శాతం కార్మికులు మాత్రమే యూనియన్లలో సంఘటితమై ఉండగా, ప్రభుత్వరంగంలో మూడోవంతు మంది (ఉపాధ్యాయులను కూడా కలుపుకొని) సంఘటితమై ఉన్నారు. ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించటం కార్మికులు సంఘటితం కావటాన్ని నిరోధించటంతో పాటు కార్మికులు సమ్మె చేయగల శక్తిని కూడా తగ్గిస్తుంది. ఈమధ్యకాలంలో అభివృద్ధి చెందిన ఏదేశంలోకన్నా ఫ్రాన్స్‌లో ఎక్కువగా పెద్ద సమ్మె పోరాటాలు జరిగాయి. ఇతర దేశాలలో కన్నా ఫ్రాన్స్‌లో ప్రభుత్వరంగం బలంగా ఉండటమే ఇందుకు

> **"ద్రవ్య పెట్టుబడుల ప్రపంచీకరణ వలన దారిద్ర్యం, దుర్భర పరిస్థితులలోకి నెట్టబడిన కార్మికులు రైతులు, చిన్న ఉత్పత్తిదారుల రాజకీయ ప్రభావం తగ్గి, కార్పొరేట్, ద్రవ్య పెట్టుబడిదారుల కూటమి రాజకీయ ప్రభావం పెరుగు తుంది. ప్రపంచీకరణ యుగం వర్గశక్తుల బలాబలాలలో నిర్దిష్టమైన మార్పును తీసుకొచ్చింది."**

కారణం.

రెండవది "లేబర్ మార్కెట్ సరళీకరణ" (ఫ్లెక్సిబిలిటి) విధానాలను ప్రవేశపెట్టి, కార్మిక చట్టాల సవరణ ద్వారా, చాలా తక్కువమంది కార్మికులకు (నిర్ధిష్ట సంఖ్యకు మించి కార్మికులు పనిచేస్తున్న ఫ్యాక్టరీలలో) కల్పిస్తున్న అతి పరిమితమైన రక్షణలను (కార్మికులను తొలగిం చటానికి నోటీస్ ఇచ్చే కనీస కాల పరిమితి) కూడా రద్దు చేయటానికి పూనుకున్నారు. ఈ విధానాలను అమలు చేయమని తీవ్రమైన వత్తిడి ఉన్నా, ఇప్పటి వరకు భారతదేశంలో అమలు చేయటం ప్రారంభించలేదు. ఈ చర్యల వలన ప్రభావితం అయ్యేవారి సంఖ్యను దృష్టిలో పెట్టుకొంటే "లేబర్ మార్కెట్ సరళీకరణ" కోసం వస్తున్న వత్తిడి ఆశ్చర్యం కలిగిస్తున్నది. కీలకమైన రంగాలలోని, పెద్ద సంస్థలలోని బలమైన సమ్మె లు చేయగల కార్మికుల శక్తిని నిర్వీర్యం చేయ టానికే ఈ విధంగా ఒత్తిడి చేస్తున్నారు. కార్మికుల బేరసారాల శక్తిని, చట్టబద్ధమైన హక్కుల్ని తగ్గించటం తదితరాలు కార్మికవర్గ రాజకీయాల ప్రభావాన్ని తగ్గిస్తాయి. కార్మికసంఘాల్ని బలహీనం చేయటం కార్మికవర్గ రాజకీయశక్తిని కూడా బలహీనం చేస్తుంది. ప్రత్యామ్నాయ ఆర్థిక, రాజకీయ కార్యక్రమాన్ని ప్రతిపాదించి, ఆ కార్యక్రమం చుట్టూ ప్రజలను సమీకరించేశక్తి కూడా తగ్గుతుంది. ద్రవ్య పెట్టుబడుల ప్రపంచీ కరణ వలన దారిద్ర్యం, దుర్భర పరిస్థితులలోకి నెట్టబడిన కార్మికులు రైతులు, చిన్న ఉ త్పత్తిదారుల రాజకీయ ప్రభావం తగ్గి, కార్పొరే ంట్, ద్రవ్యపెట్టుబడిదారుల కూటమి రాజకీయ ప్రభావం పెరుగుతుంది. ప్రపంచీకరణ యుగం వర్గశక్తుల బలాబలాలలో నిర్దిష్టమైన మార్పును తీసుకొచ్చింది.

## 2

ఈ మార్పు ఫలితంగా వచ్చే రెండు ముఖ్య మైన పరిణామాలను గమనంలోకి తీసుకోవాలి. మొదటిది వర్గ రాజకీయాలు బలహీనపడి, అదేక్రమంలో ''అస్తిత్వ రాజకీయాలు'' బలపడుతున్నాయి. "అస్తిత్వ రాజకీయాలు" అనే పదం కొందరిని తప్పుదారి పట్టించవచ్చు. అస్తిత్వ రాజకీయాలు అనేపదం ఏమాత్రం పోలికలేని, పరస్పరం వ్యతిరేకమైన ఉద్యమా లను ఒకే విధమైన లక్ష్యాలు కలిగిన ఉద్యమా లుగా చూపుతుంది. వీటిని మూడు భిన్నమైన తరగతి ఉద్యమాలుగా విభజించి చూడటం వలన వాటి లక్ష్యాల్ని తేలికగా అర్థం చేసుకో గలం. దళితుల, మహిళల ఉద్యమాలలాంటి "ప్రతిఘటనా అస్తిత్వ రాజకీయాలు" (వీటికి వాటి ప్రత్యేకతలున్నప్పటికి). "బేరసారాల అస్తిత్వ రాజకీయాలు," "రిజర్వేషన్లను" అవకాశంగా తీసుకొని "వెనుకబడిన కులం" స్థాయిని పొంది తమ పరిస్థితిని మెరుగుపరచుకోవటానికి జాట్లు సాగిస్తున్న ఉద్యమాల్లాంటివి. "ఫాసిస్టు అస్తిత్వ రాజకీయాలు" (దీనికి మతోన్మాద ఫాసిజం స్పష్టమైన ఉదాహరణ) అది ఒక "నిర్ధిష్టమైన గ్రూపు"ను పునాదిగా చేసుకొని, "కొన్ని గ్రూపు" లను లక్ష్యంగా పెట్టుకొని, వారికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ కార్పొరేట్, ద్రవ్యపెట్టుబడుల కూటమి మద్దత్తు పొందుతుంది. ఏ గ్రూపు ప్రయోజనాల కోసం అంటూ ప్రచారం చేస్తున్న దో దానికి భిన్నంగా కార్పొరేట్ సంస్థల ప్రయోజ నాల కోసం పని చేస్తుంది.

ఈ మూడు "అస్తిత్వవాద రాజకీయ" తరగతుల మధ్య విస్తృతమైన వైవిధ్యం ఉన్నప్పటికీ వర్గ రాజకీయాల క్షీణత వీటన్నింటినీ తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. కొన్ని ప్రత్యేకమైన గ్రూపులు పాలకులతో "బేరసారాలు చేస్తూ అస్తిత్వ రాజకీయాలను" నడుపుతూ ఉత్తేజం పొందుతుంటాయి. వీటిలో సభ్యులుగా ఉన్న వారు వర్గ రాజకీయాలలో శక్తివంతంగా పాల్గొనలేరు. కార్పొరేట్, ద్రవ్యపెట్టుబడుల కూట మి ఆధిపత్యానికి అటువంటి రాజకీయాలు బలపడటం కావాలి కాబట్టి "అస్తిత్వవాద ఫాసిస్టు రాజకీయాలకు" ప్రోత్సాహం లభిస్తుంది. దేశవ్యాపితంగా వర్గ రాజకీయాలు బలహీనపడటంతో "అస్తిత్వవాద ప్రతిఘటన రాజకీయాలు" కూడా పోరాటతత్వాన్ని కోల్పోయి, "అస్తిత్వవాద బేరసారాల రాజకీయాల" వైపుకు మరలుతాయి. వర్గ రాజకీయాలు బలహీనపడటం వ్యవస్థకు ప్రమాదం కలిగించని "అస్థిత్వ రాజకీయాలు" బలపడటానికి దోహదం చేస్తుంది. అది ప్రజ లలో ఒక తరగతిని మరో తరగతికి వ్యతిరేకంగా నిలబెట్టటం ద్వారా వ్యవస్థకు ఎదురయే సవాళ్ళను నిరోధిస్తుంది. ఇది కుల ప్రాతిపదికపై ఉన్న పాత ఫ్యూడల్ వ్యవస్థను నాశనం చేసి, ప్రజాస్వామ్య స్థాపనకు అవసరమైన "నూతన సమాజాన్ని" ఏర్పరచాలనే ప్రణాళికకు ఎదురు దెబ్బగా పరిణమిస్తుంది. రెండోఅంశం ఈ ఎదురుదెబ్బ సమాజంలో ఏ నిర్దిష్టమైన పని గానీ, వృత్తిగానీ లేని అలగాజనం (లుంపెన్) పెరగటానికి దారితీస్తుంది. పెట్టుబడిదారీ_విధా నం తార్కికమైన సామాజిక ఆవశ్యకత వలననే కాక, ఈ విధమైన మార్పుల వలన కూడా అభివృద్ధి చెందే శక్తిని కలిగి ఉంది. సమాజంలో వివిధ వృత్తులు నాశనం అయిన ఫలితంగా ఒకచోట చేరిన కార్మికులు పెట్టుబడిదారీ విధానం కోరుతున్న విధంగా ఒకరితో మరొకరికి సంబంధం లేకుండా ఉంటూ ఒకరితో ఒకరు పోటీ పడుతుంటారు. కాబట్టి ఇది ఏ మాత్రం అవసరంలేని, కాలంచెల్లిన వ్యవస్థగా ఉంది. (కాబట్టి దీనిలో కలిసి ఉండే సమాజం అనేదిలేదు) పెట్టుబడిదారీ విధానంలో దాని తర్కానికి విరుద్ధంగా ఒకరికొకరు తెలియని కార్మికులు "వివిధ సంస్థలను" ఏర్పాటు చేసు కొని, కార్మిక సంఘాల ద్వారా వర్గ సంఘాలను ఏర్పాటు చేసుకుంటూ కలిసి ఉంటూ, మనం చెబుతున్న "నూతన సమాజం"గా అభివృద్ధి అవుతారు. కాబట్టి దాని సామాజిక ఆవశ్యకత ఇంకా ఉంటున్నది. గతంలో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల నుండి నూతనంగా తెల్లవారు నివసించే సమశీతోష్ణ ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు వలసలు పోవటంతో, దేశీయంగా నిరుద్యోగుల సంఖ్య అదుపులో ఉ ండటం, కార్మికసంఘాలు శక్తివంతంగా ఉండటం సాధ్యమైంది. ఇపుడు మూడో ప్రపంచ దేశాలలోని కార్మికులకు ఆవిధంగా వలసలు పోవటానికి అవకాశం లేదు. మనం చూస్తున్న ట్లుగా నయా-ఉదారవాద విధానాలు నిరుద్యో గుల సంఖ్యను పెంచుతూ కార్మిక సంఘాలను, కార్మికులు ఏర్పాటు చేసుకున్న ఐక్యతా సంస్థలను బలహీనం చేస్తున్నవి. ఫలితంగా కార్మికులు ఎవరికి వారుగా విడిపోవటం, వివిధప్రాంతా లు, వృత్తుల నుండి వచ్చినవారి మధ్య సామాజిక

> ❝ నయా-ఉదారవాద విధానాలను అనుసరించే రాజకీయ పార్టీలు భిన్నమైన ఆర్థిక విధానాలను అనుసరించజాలవు. ఇతర పద్ధతుల ద్వారా తమ విధానాలకు ప్రజల ఆమోదం పొందటానికి ప్రయత్నం చేస్తాయి. తమను తాము "మార్కెటింగ్" చేసుకోవటానికి అనేక ప్రచార పద్ధతులు అనుసరిస్తాయి. ఇందుకు ఎక్కువ నిధులు అవసరం అవుతాయి. కాబట్టి రాజకీయాలలో నిధులను సమీకరించ వలసిన ఆవశ్యకత పెరుగుతుంది. ❞

సంబంధాలు లేకపోవటం, లేదా క్రమంగా బలహీనపడి సమాజంలో అలగాజ నం పెరిగేందుకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయి. అన్ని పెట్టుబడిదారీ సమాజాలలోనూ అటువంటి అలగాజనం ఉంటుంది. కాని అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో దీనిని కొంతమేరకు అదుపు చేసిన కార్మికవర్గ సంస్థలు నయా-ఉదారవాద విధానాలతో బలహీనపడ్డాయి. నయా-ఉదారవాద విధానాలకు ఊడిగం చేస్తున్న మూడవ ప్రపంచ దేశాలలో శక్తిహీనం అయ్యాయి. ఈరోజు భారతదేశంలో మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న నేరాలు దీనికి సంబంధం లేనివి కావనేది నా అభిప్రాయం.

**3**

నయా-సరళీకరణ విధానాలకు సంబంధించిన మరో ముఖ్యాంశం "అవినీతి" గురించి ఇప్పుడు చర్చిద్దాం. మనం చర్చిస్తున్న ఆర్థిక విధానంలో బడా పెట్టుబడి చిన్న ఉత్పత్తిదారుల ఆస్తులను స్వాహా చేయటమే లక్ష్యంగాఉంటుంది. కాని చిన్న ఉత్పత్తిదారుల ఆస్తులే బడా పెట్టుబడి ఏకైకలక్ష్యం కాదు. అది చిన్న ఉత్పత్తిదారుల ఆస్తులనే కాకుండా ఉమ్మడి ఆస్తులను, గిరిజనుల ఆస్తులను, ప్రభుత్వ ఆస్తులను ఉచితంగా, లేదా నామమాత్రపు ధరలకు కాజేయటానికి పూనుకుంటుంది. నయా-సరళీకరణ విధానాల కాలంలో ప్రతీకారాత్మకంగా పెట్టుబడి "పురాతన పెట్టుబడి సంచయానికి" పూనుకుంటుంది. ఇందుకు ప్రభుత్వంలోని ముఖ్యుల సహకారం లేదా భాగస్వామ్యం అవసరం. మనం ఇంతకు ముందే చెప్పుకున్నట్లుగా ప్రపంచీకరణ యుగంలో ప్రతి జాతిరాజ్యం విధానపరమైన విషయాలలో ఎదుర్కొనే ఒత్తిడి వలన అటు వంటి సహకారం లభ్యమౌతుంది. అందుకు ధర చెల్లిస్తారు. దాన్ని మనం "అవినీతి" అంటున్నాం. రాజ్యంలో ముఖ్య స్థానాలలో ఉన్నవారు, ముఖ్యంగా "రాజకీయ తరగతి" (పొలిటికల్ క్లాస్)బడా పెట్టుబడి చేస్తున్న పురాతన పెట్టుబడి సంచయం వలన లాభాలు పొందుతున్న వారిపై మనం "అవినీతి" అనే దానిని పన్నుగా విధిస్తున్నారు. ఈమధ్య కాలం లో భారత దేశంలో వెలుగులోకొచ్చిన "అవినీతి" వ్యవహారాలు, 2జి స్పెక్ట్రం, బొగ్గు గనుల కేటాయింపుల్లాంటివి ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు పెట్టుబడిదారులకు ''అతి తక్కువ ధరలకు'' అప్పగించినవి. ఆవిధంగా అప్పగించటానికి నిర్ణయాలు తీసుకున్నవారికి అందుకు తగిన ప్రతిఫలం అందుతుంది. దానినే మనం "అవి నీతి"



నయా-ఉదారవాదం పేదరికాన్ని పెంచుతోంది

అంటున్నాం. పురాతన పెట్టుబడి సంచయం పై విధించే పన్నే "అవినీతి". నయా-ఉదారవాద ప్రభుత్వాలు పురాతన పెట్టుబడి సంచయాన్ని ఉధృతం చేయటంతో ఈమధ్య కాలంలో ఇటువంటి ఘటనలు ఎక్కువగా వెలుగుచూస్తున్నాయి. "అవినీతి" అనే ఈ పన్నును పరిశీలించేటపుడు రెండు ముఖ్యాంశాలను గమనంలో పెట్టుకోవాలి. మొదటిది రాజకీయాలు వాణిజ్యీకరణ కావటం. నయా-ఉదారవాద విధానాలను అనుసరించే రాజకీయపార్టీలు భిన్నమైన ఆర్థిక విధానాలను అనుసరించజాలవు. ఇతర పద్ధతుల ద్వారా తమ విధానాలకు ప్రజల ఆమోదం పొందటానికి ప్రయత్నం చేస్తాయి. తమను తాము "మార్కెటింగ్" చేసుకోవటానికి ప్రచారంచేసే సంస్థలతో ఒప్పందాలు చేసుకోవటం, వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మాధ్యమంలో "పెయిడ్ న్యూస్" ఇవ్వటం, ఎక్కువమంది ప్రజలకు కనిపించటం కోసం సాధ్యమైనన్ని ఎక్కువ ప్రాంతాలకు వెళ్ళటానికి హెలికాప్టర్‌లను అద్దెకు తీసుకోవటం, తదితర పద్ధతులను అనుసరిస్తారు. ఇందుకు ఎక్కువ నిధులు అవసరం అవుతాయి. కాబట్టి రాజకీయాలలో నిధులను సమీకరించ వలసిన ఆవశ్యకత పెరుగుతుంది. కాబట్టి రాజకీయ పార్టీలు ఏవిధంగానైనా నిధులను సమీకరించాల్సి వస్తుంది. "రాజకీయ తరగతి" తాను కొనసాగ టానికి ఎక్కువ నిధులు అవసరం అయ్యేకొద్దీ నిర్ణయాలు చేయటంలో దాని పాత్ర తగ్గిపో తుంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆర్థిక నిర్ణయాలు చేయటాన్ని సాంప్రదాయక రాజకీయ నాయకులకు వదలటానికి అంగీకరించదు. కాబట్టి ప్రపంచ ద్రవ్య రంగానికి చెందిన ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, బహుళజాతి బ్యాంకులు, ఇతర ద్రవ్య సంస్థలకు చెందినవారు క్రమంగా ప్రభుత్వాలలో నిర్ణ యాలు చేసే స్థానాలను ఆక్రమిస్తారు. సాంప్ర దాయక "రాజకీయ తరగతి" సహజంగానే దీనిని అంగీకరించదు. తమకు కూడా కొంత సంపాదించుకోవటానికి అవకాశం ఉంటేనే వారు ఇందుకు అంగీకరిస్తారు. ఆ "కొంత" పురాతన పెట్టుబడి సంచయంపై "అవినీతి" రూపంలో విధిస్తున్న పన్నుగా ఉంటుంది. రాజకీయాలు వాణిజ్యీకరించబడటం వలన కూడా ఇది అవసరం అవుతున్నది. కాబట్టి ''అవినీతి'' నయా-ఉదారవాద విధానాల అమలులో ముఖ్యపాత్ర నిర్వహిస్తుంది. ఇది "రాజకీయ తరగతి"లో హఠాత్తుగా "నైతిక జీవశక్తి" (మోరల్ ఫైబర్) దిగజారిపోవటం వలన జరుగుతున్నది కాదు. నయా-ఉదారవాద పెట్టుబడిదారీ విధానానికి ఇది సహజమైనది. నయా-ఉదారవాద పెట్టుబడిదారీ విధానం పెంచుతున్న "అవినీతి" మరో కారణం వలన కూడా కార్పొరేట్ ద్రవ్యపెట్టుబడిదారుల కూటమికి ఉపయోగకరంగా ఉంటుంది. అది "రాజకీయ తరగతి" యొక్క విలువలను దిగజారుస్తుంది. పార్లమెంటును, ఇతర ప్రాతినిధ్య ప్రజాస్వామ్య సంస్థలను అపఖ్యాతి పాలు చేస్తుంది. అదే సమయంలో తన ఆధిపత్యంలో ఉన్న మీడియాను నేర్పుగా, మోసపూరితంగా వినియోగిస్తూ, కొందరు వ్యక్తులపై కేంద్రీకరణ చేస్తూ కార్పొరేట్ ద్రవ్యపెట్టుబడిదారుల కూటమి ఈ విధమైన "అవినీతి" నైతిక దిగజారుడు తనకు ఆటంకం కాకుండా జాగ్రత్త పడుతుంది. "అవినీతి" పై చర్చ కార్పొరేట్ పాలనకు ఎదురయ్యే ఆటంకాలను తొలగిస్తూ, వారికి మార్గాన్ని సుగమం చేస్తుంది.

**4**

ఈ అంశాలు ఇంతవరకే పరిమితం కావు.

**"నయా-ఉదారవాద విధానాలు అమలు జరుగుతున్న కాలంలో ఆర్థికవ్యవస్థలో పెరుగుదల భవిష్యత్‌పై ఆశావహ మైన దృక్పథంవలన అంతర్జాతీయంగానూ, జాతీయం గానూ ఏర్పడే "బుడగల"పై ఆధారపడి ఉంటుంది. భారత దేశంలో సాధించిన అధిక పెరుగుదల అంతర్జాతీయంగా, జాతీయంగా ఏర్పడిన "బుడగల" కలయికపై ఆధారపడి ఉంది. ఈ బుడగలు కాస్త ముందు వెనుకగా అంతరించటం ఖాయం."**

నయా-ఉదరవాద విధానాలు నిరుద్యో గాన్ని పెంచడం మనం చూస్తున్నాం. నిరుద్యోగం పెరగటంవలన కొత్తగా కార్మికవర్గంలో చేరుతున్నవారు వారి తాత ముత్తాతల కన్నా మరింత దరిద్రపు జీవితం గడుపుతున్నారు. నిరుద్యోగుల సంఖ్య పెరగటం, ఆ పోటీతో ఎదురౌతున్న ఒత్తిడి వలన తగిన ఉద్యోగాలు పొందినవారు కూడా ఉదారవాద విధానాలకు ముందుకాలం నాటి నిజ వేతనాలను కూడా పొందలేకపోతున్నారు. మొత్తం(శ్రామిక ప్రజలేకాక, వారిలో మెరుగైనస్థాయిలో ఉన్నవారు కూడా దారిద్ర్యంలోకి దిగజారటం ఈ కాలంలో సాధారణంగా జరుగుతున్నది. ఈ అంశాన్ని ఉత్సాపట్నాయక్ చాలాకాలం నుండి ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. నేషనల్ శాంపుల్ సర్వే లెక్కల ప్రకారం పట్టణాలలో రోజుకు మనిషికి 2100 కేలరీల (పట్టణ ప్రాంతాలకు అధికారిక దారిద్ర్యరేఖ) కన్నా తక్కువ ఆహారం తీసుకొనేవారు 1993-94లో 57శాతం ఉండగా, 2004-05నాటికి 64.5 శాతానికి, 2009-10నాటికి 73 శాతానికి పెరిగారని ఆమె చెపుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో 2200 (ఇది గ్రామీణ ప్రాంతాలకు అధికారిక దారిద్ర్యరేఖ) కేలరీల కన్నా తక్కువ ఆహారం తీసుకొనేవారు అదే సంవత్సరాలలో వరుసగా 58.5శాతం, 69.5శాతం, 76 శాతంగా ఉన్నారు. 2004-05 నుండి 2009-10 వరకు జి.డి.పి.పెరుగుదల ఎక్కువగా ఉన్నకాలం. ఈ కాలంలోనే దరిద్రుల సంఖ్య కూడా పెరిగింది. నయా-ఉదారవాద విధానాల వలన దరిద్రం పెరగటం అనేది ఆ విధానాలలో వ్యవస్థీకృతంగా వుంటుంది. అధిక ఆర్థికాభివృద్ధి వలన దారిద్ర్యం పెరుగుదలలో మార్పు ఉండదు. కానీ కార్పొరేట్, ద్రవ్యపెట్టుబడిదారుల కూటమి, వారి అదుపులో ఉన్న మీడియా ప్రజలెదుర్కొంటున్న ఆర్థిక సమస్యలకు, దరిద్రం పెరుగుదలకు "అవినీతి" కారణమని ప్రచారం చేస్తుంది. నయా-ఉదారవాద విధానాలతో క్రమబద్ధంగా జరుగుతున్న దానికి బాధ్యతను ఆ విధానాలపై గానీ, ఈ వ్యవస్థలో నాయకత్వ స్థానంలో ఉన్న కార్పొరేట్, ద్రవ్య పెట్టుబడిదారుల కూటమిపై గానీ పెట్టకుండా, ఆ బాధ్యతను "రాజకీయ తరగతి" పైనా, వారు ప్రతినిధులుగా ఉన్న పార్లమెంటుపైనా, ఇతర ప్రజాప్రాతినిధ్య సంస్థల పైనా పెడుతుంది. ఆవిధంగా ప్రజలను దరిద్రంలో ముంచటానికి కారణమైన, ఈ వ్యవస్థలో వ్యవస్థీకృతంగా ఉన్న అంశాలనే ఈ వ్యవస్థను బలపరచుకోవటానికీ, ఆధిపత్య స్థానంలో ఉండి ఈ కడగండ్లకు కారణమౌతున్న కార్పొరేట్ పెట్టుబడిదారుల కూటమి పాలనకు చట్టబద్ధతను కల్పించటాకీ ఉపయోగించుకొంటారు.

ప్రస్తుతం భారతదేశ ఆర్థికవ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నటువంటి పరిస్థితుల్లో ఇది మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అధిక పెరుగుదల సాధించిన కాలం ముగిసిపోవటం ఏమాత్రం ఆశ్చర్యం కలిగించదు. నయా-ఉదారవాద విధానాలు అమలు జరుగుతున్న కాలంలో ఆర్థికవ్యవస్థలో పెరుగుదల భవిష్యత్‌పై ఆశావహమైన దృక్పథం వలన అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ ఏర్పడే "బుడగల"పై ఆధారపడి ఉంటుంది. భారతదేశంలో సాధించిన అధిక పెరుగుదల అంతర్జాతీయంగా, జాతీయంగా ఏర్పడిన "బుడగల" కలయికపై ఆధారపడి ఉంది. ఈ బుడగలు కాస్త ముందు వెనుకగా అంతరించటం ఖాయం. అంతర్జాతీయ బుడగ 2008లో బద్దలయింది. కొద్ది సంవత్సరాల తర్వాత దేశీయ బుడగ కూడా బద్దలయింది. ఈ సంక్షోభ ఫలితంగా ఉద్యోగ అవకాశాల పెరుగుదల మరింత తగ్గిపోవటంతోపాటు, ఆర్థికవ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందిన కాలంలోనే క్షీణించిన కార్మికుల పరిస్థితి ఇప్పుడు మరింతగా దిగజారుతుంది. ఆ కాలంలో ఎక్కువ ప్రయోజనం పొందిన పట్టణ మధ్యతరగతి పస్థితి కూడా దిగజారుతుంది. కాని కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడిదారుల కూటమి నాయకత్వంలో "రాజకీయ తరగతి"కి వ్యతిరేకంగా జరుపుతున్న చర్చ ప్రజల ఆగ్రహాన్ని ఆర్థిక విధానాల నుండి పార్లమెంటుకు, ఇతర ప్రజాస్వామిక సంస్థలకు వ్యతిరేకంగా మళ్లించి, ఈ సమయంలో మరింత బలమైన, ఉదారవాద విధానాలను మరింత శక్తివంతంగా అమలు చేసే నాయకుడు కావాలని విస్తృతంగా ప్రచారం చేస్తారు. "అవినీతి"తో కుళ్ళిపోయిన "రాజకీయ వర్గం" ఈ పని చేయలేదని, కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడిదారుల కూటమి నాయకత్వం, వారి నమ్మకమైన ఏజంట్లయిన, "ఆర్థికాభివృద్ధి సాధించిన వ్యక్తులు"గా ముద్ర పడ్డ నరేంద్రమోడి లాంటి వారు కావాలనే విధంగా ఈ చర్చ కొనసాగుతుంది. ఆ విధంగా కార్పొరేట్ పరిపాలనకు, అంటే ఫాసిజానికి మార్గం సుగమమౌతుంది.

### 5

ఫాసిజానికి పరివర్తన చెందటం ఒకే అంశంపై ఆధారపడి, ఒక ప్రత్యేకమైన వ్యక్తి అధికారంలోకి రావటం వలన జరిగేది కాదు. ఈనాడు దేశంలోని విస్తార ప్రాంతాలలో, ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌లో కేవలం "తీవ్రవాది" (టెర్రరిస్ట్) అనే అనుమానంతో ఒక ముస్లిం యువకుడ్ని కోర్టు విచారణ, బెయిలు లేకుండా సంవత్సరాల తరబడి పోలీసు నిర్బంధంలో ఉంచారు. "తీవ్రవాది"కి సహకరించటానికి న్యాయవాదులు అంగీకరించరు కాబట్టి వారు న్యాయ సహాయాన్ని పొందలేరు. వారికి న్యాయ సహాయం అందించే ధైర్యమున్న న్యాయవాదులు మతోన్మాద ఫాసిస్టు శక్తుల దాడులకు గురవుతున్నారు. తగిన న్యాయ సహాయం అందనప్పటికీ నేరారోపణ చేయబడ్డ వ్యక్తి అదృష్టవంతుడైతే ఒక దశాబ్దం తర్వాతనైనా విచారణ ముగిసి విడుదలైనా, సమాజదృష్టిలో "తీవ్రవాది"గా ముద్రపడటంతో ఏ ఉద్యోగమూ లేకుండా ఉండిపోవాల్సి వస్తుంది. అతనిని అరెస్ట్ చేసి, అతని జీవితంలోని విలువైన కొన్ని సంవత్సరాలు జైలులో గడపటానికి కారణమైన వారిపై ఎప్పుడూ ఏ చర్యా తీసుకోలేదు. ఇదే విధంగా ఢిల్లీకి సమీపంలోని మారుతీ సంస్థలో ఒక వ్యక్తిని హత్య చేశారనే అనుమానంతో (వారు అతనిని చంపారనటానికి తగిన కారణం లేదు.) సరైన విచారణ కూడా లేకుండా వంద మందికి పైగా కార్మికులను బెయిల్ గాని, పెరోల్ గాని లేకుండా నెలల తరబడి జైలులో ఉంచారు. ఈ విధంగా "భిన్న రూపాలతో రూపొందుతున్న ఫాసిజం" (మొసాయిక్ ఫాసిజం) ఇప్పటికే దేశంలో ఉందని నేను చెబుతున్నాను. కార్పొరేట్ ద్రవ్య

పెట్టుబడిదారుల కూటమి మద్దత్తుతో రానున్న ఎన్నికలలో మతోన్మాద ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రావటం జరిగితే, ప్రస్తుతం బెంగాల్లో మనం చూస్తున్న విధంగా రౌడీలుగా మారుతున్న అలగాజనంపై ఆధారపడిన, స్థానికంగా అధికార కేంద్రాలుగా ఉన్నవారి మద్దత్తుపై ప్రభుత్వం ఆధారపడవలసి వస్తుంది. ఈ స్థానిక అధికార కేంద్రాలు కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడుల కూటమితో ప్రత్యక్షంగా ముడిపడి వుండవు. కాబట్టి వీటిని ప్రత్యక్షంగా ఫాసిస్టు సంస్థలని పిలువలేం. కానీ పై స్థాయిలో ఫాసిస్టు విధానం కొనసాగటానికి అవి సహాయపడతాయి. వేరు మాటల్లో చెప్పుకోవాలంటే ఒకే సారిగా సమగ్రమైన ఫాసిజం రూపొందటం కాకుండా "భిన్న రూపాలతో రూపొందుతున్న ఫాసిజం" నుండి "ఏకీకృత ఫాసిజం"కు పరిణామం జరుగుతున్నది. ఈ వ్యాసంలో చర్చిస్తున్న నయా-ఉదారవాదంతో ప్రభావితమైన "రాజకీయాలకు ముగింపు" ఫాసిజానికి పరివర్తన చెందటానికి మార్గాన్ని సుగమం చేస్తుంది అనే మౌలిక వాదనను ఇవేవి మార్చలేవు. ఈ రోజు మనం చూస్తున్నటువంటి సంక్షోభకాలంలో ఈ పరివర్తన మరింత వేగం పుంజుకుంటుంది.

### 6

ఇటువంటి పరిస్థితుల్లో అభ్యుదయశక్తులు ఏమిచేయాలనే సమస్య సహజంగానే ఎదురవుతుంది. చరిత్ర అంతమౌతుందన్న హెగెలియన్ తత్వశాస్త్రానికి, ఇంగ్లీషు రాజకీయ అర్థశాస్త్రానికి వ్యతిరేకంగా మార్క్స్ శ్రామికవర్గాన్ని మార్పుకు సాధనంగా చూశాడు. చరిత్రను ముందుకు నడిపించే శక్తిగానే కాకుండా, "చరిత్ర బోను" (ట్రాప్ ఆఫ్ హిస్టరి)నుండి మానవజాతిని తప్పించే శక్తిగా కూడా భావించాడు. నయా-ఉదారవాద విధానాల వలన వర్గ రాజకీయాలు బలహీనపడినప్పటికీ ఈ మౌలికమైన విశ్లేషణ ఇప్పటికీ అనుసరణీయంగానే ఉందని అన్ని వర్గాలకు, తరగతులకు తప్పనిసరిగా తెలియజేయాలి. ఈ బలహీనతను అధిగమించాలంటే, ఇప్పటి వరకు అసంఘటితంగా ఉన్న గృహ కార్మికులు తదితర నూతన రంగాలలోకి ప్రవేశించటం, కార్మికులను సమీకరించటానికి వర్గ రాజకీయాలతో నూతన పద్ధతుల్లో జోక్యం చేసుకోవటం అవసరమని స్పష్టమౌతున్నది. వర్గ రాజకీయాలు "అస్తిత్వ ప్రతిఘటన రాజకీయాల"లో మరింత శక్తివంతంగా జోక్యం చేసుకొని, వాటిని కేవలం అస్తిత్వ రాజకీయాల స్థాయిలో వదిలేయటం కాకుండా మరింత ముందుకు తీసుకువెళ్ళాలి. అణచివేతకు వ్యతిరేకంగా దళితులను,

"ఈ బలహీనతను అధిగమించాలంటే, ఇప్పటి వరకు అసంఘటితంగా ఉన్న గృహ కార్మికులు తదితర నూతన రంగాలలోకి ప్రవేశించటం, కార్మికులను సమీకరించటానికి వర్గ రాజకీయాలతో నూతన పద్ధతుల్లో జోక్యం చేసుకోవటం అవసరమని స్పష్టమౌతున్నది. వర్గ రాజకీయాలు "అస్తిత్వ ప్రతిఘటన రాజకీయాల"లో మరింత శక్తివంతంగా జోక్యం చేసుకొని, వాటిని కేవలం అస్తిత్వ రాజకీయాల స్థాయిలో వదిలేయటం కాకుండా మరింత ముందుకు తీసుకువెళ్ళాలి."



ఒకటి వలస కూలీల అడ్డా, రెండోది చదువుకున్న కూలీల అడ్డా (దానిపేరే జాబ్ ఫెయిర్)

ముస్లింలను, గిరిజనులను, మహిళలను మరింత శక్తివంతంగా సమీకరించాలి. ఒక అస్తిత్వ గ్రూపుకు రాయితీలు ఇవ్వటం ద్వారా మరొక అస్తిత్వ గ్రూపుకు నష్టం కలిగిస్తే, నష్టపోయిన గ్రూపును సమీకరించి అందుకు వ్యతిరేకంగా పోరాడాలి. మరోవిధంగా చెప్పుకోవాలంటే వర్గ రాజకీయాలకు, "అస్తిత్వ ప్రతిఘటన రాజకీయాల"కు వ్యత్యాసం అవి ఆయా సమస్యలపై భిన్నమైన పద్ధతుల్లో జోక్యం చేసుకోవటంలో లేదు. వర్గ రాజకీయాలు "అస్తిత్వ గ్రూపులు ప్రతిఘటించే" అంశాలపై కూడా "అస్తిత్వ గ్రూపు" లేవనెత్తుతున్న సమస్యల పరిమితులను దాటి ముందుకు వెళ్ళటంలో ఉంది. కుల అణచివేత లేక లింగపరమైన అణచివేతలకు వ్యతిరేకంగా జోక్యం చేసుకోలేకపోవటం వర్గ రాజకీయాల యొక్క వైఫల్యమే కాని, వర్గ రాజకీయాల యొక్క లక్షణం కాదు. ప్రత్యామ్నాయ విధానాల సమస్యను వర్గ రాజకీయాలు ముందుకు తీసుకురావాలి. వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో "పరివర్తన కాలపు డిమాండ్లు"గా (ట్రాన్సిషనల్ డిమాండ్) ప్రజల కష్టాలను తొలగించేందుకు కొన్ని రక్షణలను వ్యవస్థీకృతం చేయాలని, వాటిని ప్రజల "హక్కు"గా చేయాలని డిమాండ్ చేయాలి. ఉదాహరణకు ఆహారహక్కు, పనిహక్కు, ప్రభుత్వ నిధులతో ఉచిత వైద్యం పొందేహక్కు, నిర్ణీతస్థాయి వరకు నాణ్యమైన ఉచితవిద్య, వృద్ధాప్య పెన్షన్ హక్కు కల్పించి అమలు చేయాలని, శారీరకంగా, మానసికంగా అశక్తులైన వారికి గౌరవప్రదమైన జీవితం గడిపేలా తగిన సహాయం అందించాలని ప్రచారం నిర్వహించాలి. మొదట ఇవన్నీ యన్.జి.వో.లు చేసే డిమాండ్లవలె కనిపిస్తూ వర్గ రాజకీయాలకు ఏమాత్రం సంబంధం లేని అంశాలనిపిస్తాయి. ఈ అంశాలకు సంబంధించి మన అవగాహనలో చెప్పుకున్నట్లుగా వర్గ రాజకీయాలకు, అస్తిత్వ రాజకీయాలకు లేక యన్.జి.వో.రాజకీయాలకు మధ్య వ్యత్యాసం తీసుకొనే సమస్యలలో ఉండదు. సమస్యలను తీసుకొని, ఆ సమస్యలకు పరిష్కారం వ్యవస్థను మార్చటం ద్వారానే సాధ్యమని వర్గ రాజకీయాలు చెబుతాయి. ఇది అటువంటి సమస్యలను తీసుకోవటానికి ఏమాత్రం ఆటంకం కాకపోగా, ఆ సమస్యలను తీసుకోవటానికి మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది. మరో వైపున యన్.జి.వో.రాజకీయాలు ఈ వ్యవస్థలో పరిష్కారం చెయ్యటానికి సాధ్యమైన సమస్యలను మాత్రమే తీసుకొని, అందుకు తగిన కృషి మాత్రమే చేస్తాయి.

ఈ వ్యాసం యొక్క లక్ష్యం వర్గ రాజకీయాలను ఈ దిశలో మార్చటానికి ఉద్దేశించబడింది. ఈ హక్కులను అమలు జరపటానికి ప్రభుత్వం వద్ద తగినన్ని నిధులు లేవని చేసే వాదనకు ఏమాత్రం విలువ లేదు. ఇందుకు జి.డి.పి.లో 10 శాతం నిధులైతే సరిపోతాయి. ధనికులపై బాగా తక్కువ పన్నులు విధిస్తున్న దేశాలలో ఒకటిగా ఉన్న భారత దేశంలో ఈమేరకు నిధుల

(మిగతా 26వ పేజీలో)

హేతువాదం

# మూఢనమ్మకాల నిరోధక చట్టం: తెలుగు ప్రజల ముందున్న సవాళ్లు



రచయిత ఆంధ్ర ప్రదేశ్ హేతువాద సంఘం మాజీ అధ్యక్షులు

**20 ఆగస్టు 2013న జరిగిన డా॥ నరేంద్ర దభోల్కర్ హత్య మూఢనమ్మకాల నిరోధక చట్టం ఆవశ్యకతపై దేశవ్యాప్త చర్చకు తెరలేపింది. దభోల్కర్ మరణం తర్వాత వెల్లువెత్తిన ప్రజాగ్రహానికి తట్టుకోలేక మహారాష్ట్ర ప్రభుత్వం దభోల్కర్ హత్య జరిగిన మర్నాడే మూఢనమ్మకాల నిరోధక బిల్లును ఆర్డినెన్స్ రూపంలో తేవాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూఢనమ్మకాల నిరోధక బిల్లు, తదనంతరం కర్నాటకలో ఆ తరహా బిల్లు తీసుకొచ్చేందుకు బెంగళూరు 'లా యూనివర్సిటీ' వారు తయారు చేసి అక్కడి ప్రభుత్వానికి సమర్పించిన డ్రాఫ్ట్ బిల్లులలోని అంశాలను స్పృశిస్తూ మన తెలుగు రాష్ట్రాలు రెండింటిలోనూ ఆ తరహా చట్టం తీసుకురావాల్సిన అవసరాన్ని, ఆ క్రమంలో ఎదురయ్యే పరిమితులను, సవాళ్లను చర్చిస్తూ సాగుతున్న వ్యాసమిది:**

**పెన్మత్స సుబ్బరాజు**

మూఢనమ్మకాల నిరోధక చట్టం ఆవశ్యకత గురించి చర్చించే ముందు అసలు మూఢనమ్మకమంటే ఏమిటో చూడాల్సి వుంది. నిఘంటువుల ప్రకారం గాని, అనుభవంలో మనం గమనిస్తున్న దాన్ని బట్టిగాని, మూఢనమ్మకాన్ని విస్తృతార్ధంలో "ఏదేని ఒక అంశమై కార్యాకారణ సంబంధంతో నిమిత్తం లేకుండా మత విశ్వాసాల కారణంగా గాని, తాతల కాలం నుంచి ఆచార సంప్రదాయాల రూపంలో వస్తున్నవన్న కారణంగా గాని, భయం కారణంగాగాని, లబ్ధి పొందగలమన్న ఆశతో గాని, తమ ఆచరణలోని అహేతుకతను, ఆచరణ అనంతర ఫలితాలను అంచనా వెయ్యకుండా, కేవలం తమ నమ్మిక లేదా విశ్వాసం కారణంగా అప్రశ్నితంగా ఆచరణకు దిగితే అదే మూఢ నమ్మకం లేదా మూఢ విశ్వాసం" అని చెప్పవచ్చు.

మన దేశంలో ప్రధాన మతం హిందూ మతం. ఇతర మతాల్లాగ దీనికో స్థాపకుడు లేడు, ఒక మతగ్రంథం లేదు, ఒకే దేవుడూ లేడు. మూఢనమ్మకాలను పరిశీలిస్తే అధికశాతం వాటికి మూలాలు మతంలోనో, దైవంలోనో కనిపిస్తాయి. ఏ కాలంలో ఏ అవసరాల కోసం అవి యేర్పడ్డాయో, ఏ అజ్ఞానం కారణంగా పుట్టు కొచ్చాయో నేడు చెప్పలేం కాని, అవి ఆచరిస్తే యేదో లాభం కలుగుతుందన్న ఆశ, ఆచరించకపోతే నష్టపోతామేమోనన్న భయం నేటికీ మనిషిని వెన్నాడుతున్నాయి. నేడు అమలులో వున్న కొన్ని మూఢనమ్మకాలను పరిశీలిస్తే మనం మళ్లీ తాతల కాలం నాటికి ప్రయాణిస్తున్నామన్న భావన కలుగుతోంది. ఇలాంటి స్థితిలో విశ్వాసాల పేరుతో యెవరినైనా భయపెట్టడం, వంచిచడం, లోబర్చుకోవడం తేలిక. ఈ వెసులుబాటే మూఢనమ్మకాల మనుగడకు, కొందరు వాటిని స్వప్రయోజనాలకు వాడుకునేందుకు మార్గం సుగమం చేస్తోంది. ఫలితంగా వీటిని అడ్డుపెట్టుకుని హైస్కూలు స్థాయి దాటని వ్యక్తులు బాగా చదువుకున్న వారిని, ఉద్యోగస్తులను కూడా మోసం చెయ్యగలుగుతున్నారు. ఈ స్థితిని నివారించాలంటే వీటిని నిరోధించే చట్టాల ఆవశ్యకత యెంతైనా వుంది.


ప్రపంచంలోని ఏ దేశమూ మూఢనమ్మకాలకు మినహాయింపు కాకపోయినా భారత దేశానికి యీ విషయమై కొన్ని ప్రత్యేకతలున్నాయి. అనేక మతాలు, జాతులు, సంస్కృతులు, ఆచార సంప్రదాయాల సమాహారం మనదేశం. ఏ దేశంలోను లేని నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ మనకు ప్రత్యేకం. అంటరానితనంతో బాటు సతీ సహగమనం, బాల్యవివాహాలు, నిర్బంధ వైధవ్యం, విధవా పునర్వివాహ నిరోధం, జోగినీ వ్యవస్థ వంటి గుడ్డి ఆచారాలు, నమ్మకాలు యితర దేశాల్లో కానరావు. బాబాలు, అమ్మలు, స్వాములకు మన దేశం పుట్టిల్లు లాంటిది. అసంఖ్యాకంగా వున్న మూఢ నమ్మకాలు మన ప్రజల సాంఘిక జీవనంలో మిళితమైపోయాయి. విద్యకు అనుగుణంగా వివేకం కానరానందున తమ నమ్మకాలు–విశ్వాసాల్లో ఏవి ఆచరించదగ్గవో, ఏవి ఆచరించనవసరం లేనివో గుర్తించే స్థితి కూడా భారతీయుల్లో లోపించింది.

మన దేశంలో లెక్కకు మించిన మూఢ నమ్మకాలున్నా వాటిని మూఢనమ్మకాలుగా అంగీకరించేందుకు నేటి చట్టాలుగాని, శాసన నిర్మాణకర్తలు గాని, మెజారిటీ ప్రజలుగాని అంగీకరించే పరిస్థితి లేదు. మూఢనమ్మకాల్లో కొన్నింటికి మతంతో నేరుగా లింకు కనిపిస్తుంది. మరికొన్నింటిలో మత ప్రమేయం అసలే కనిపించదు. కొన్ని మూఢనమ్మకాలు ఎలా పుట్టాయో తర్కానికి కూడా అందవు. కొన్నింటిని ఎలా పుట్టాయో ఊహించవచ్చు. మరికొన్ని నమ్మకాలను పరిశీలిస్తే అవి పుట్టిన కాలంలో అనవసరంగానే పుట్టాయని భావించవచ్చు. పెరిగిన నాగరికత విజ్ఞానం కారణంగా వాటిని నేడు మూఢనమ్మకాలు అంటున్నాం. చాలా నమ్మకాల ఆచరణ వెనుక తెలియని భయమే కనిపిస్తుంది. హేతువాదులు, నాస్తికులు వందల కొలదీ మూఢనమ్మకాలను ఎత్తిచూపగలిగినా, మూఢనమ్మకాల నిర్మూలన చట్టం ప్రస్తావన వచ్చేసరికి అన్ని మూఢనమ్మకాలను చట్టపరిదిలోకి తీసుకురావడం సాధ్యం కాదు. మత విశ్వాసాలకు, ఆచారాలకు సంబంధించి, దైవ నమ్మిక కలిగి వుండటానికి సంబంధించి రాజ్యాంగం వివిధ మతాలను విశ్వసించే వాళ్లకు కొన్ని హక్కులు కట్టబెట్టడం వల్ల అందుకు విఘాతం కలిగించే అంశాలను చట్టాల్లో పొందుపరచడం కుదరదు. అదీగాక, కొన్ని నమ్మకాలు మత విశ్వాసాల్లో భాగంగా కొనసాగకపోయినా వాటివల్ల ఆచరించే వాళ్లకు ఏ రకమైన కష్టం, నష్టం, ఇబ్బందీ లేకపోతే వాటిని కూడా మూఢనమ్మకాల చట్టపరిధిలోకి తేవడం వీలుపడదు. ఏ నమ్మకాల ఆధారంగా

**❝ మన తెలుగు రాష్ట్రాలలో అలాంటి చట్టం రావాలంటే రెండు రాష్ట్రాల్లోని హేతువాద, నాస్తిక, సైన్సు, వామపక్ష సంఘాలన్నీ ఒక్క తాటిపైకి రావాల్సిన అవసరం వుంది. ఒక ఉమ్మడి సంఘటనగా ఏర్పడటం, మన తెలుగు రాష్ట్రాలకు వర్తించే రీతిన బిల్లు ప్రతిని తయారు చేసుకోవడం, ప్రభుత్వాలకు సమర్పించి వత్తిడి తెచ్చేందుకు స్థానిక శాసనసభ్యుల సహకారం తీసుకోవడం అవసరం.❞**

ఇతరులను వంచించి లబ్ధిపొందే అవకాశం వుంటుందో, ఆచరించే వ్యక్తి ధన, మాన, ప్రాణాలకు ముప్పు వుంటుందో, శారీరక–మానసిక వేదనకు గురయ్యే ప్రమాదముంటుందో అలాంటి నమ్మకాలను మాత్రమే మూఢనమ్మకాల నిరోధక చట్టంలో శిక్షించదగిన, ఆచరించరాని మూఢ నమ్మకాలుగా చేర్చే వీలుంటుంది. ఈ పరిస్థితి హేతువాదులకు, నాస్తికులకు, యితర అభ్యుదయవాదులకు అసంతృప్తి కలిగించినా చెయ్యగలిగిందేమీ లేదు. ఆధునిక విజ్ఞానాన్ని అపహాస్యం చేస్తున్న జ్యోతిషం, వాస్తులను ఈ చట్టంలో చేర్చడానికి వీలురాని పరిస్థితి వుంది. అయినా గుడ్డికంటె మెల్ల మేలన్న రీతిలో ఈ తరహా చట్టాలకు పలు రాష్ట్రాలోని ఉద్యమకారులు నేడు సన్నద్ధమవుతున్నారు. ఒడిశాలోనూ ఒక డ్రాఫ్ట్ బిల్ తయారీ ప్రయత్నాలు సాగుతున్నట్టు తెలియవచ్చింది. ఈ స్థితిలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లోనూ ఆ తరహా బిల్లు సాధన కోసం అభ్యుదయ శక్తులన్నీ ఏకం కావాల్సి వుంటుంది. మహారాష్ట్రలో దీర్ఘకాలంగా బిల్లును అడ్డుకున్న శక్తులు మూఢనమ్మకాల నిరోధక బిల్లును మత వ్యతిరేక బిల్లుగా అభివర్ణించిన విషయాన్ని, ఆ శక్తులే దభోల్కర్‌ను హత్య చేసిన విషయాన్ని మరువరాదు. బిల్లులో చేర్చదగిన మూఢనమ్మకాలెన్నింటినో ఆ బిల్లు నుంచి తొలగించిన అంశాన్ని కూడా గుర్తించాలి. డిసెంబర్ 2013లో డ్రాఫ్ట్‌బిల్లు కర్నాటక ప్రభుత్వానికి సమర్పించినా యింకా బిల్లు ఆమోదం పొందేదెన్నడో తెలియని స్థితి వుంది. ఇలాంటి పరిస్థితుల్లో మన తెలుగు రాష్ట్రాలలో అలాంటి చట్టం రావాలంటే రెండు రాష్ట్రాల్లోని హేతువాద, నాస్తిక, సైన్సు, వామపక్ష సంఘాలన్నీ ఒక్క త్రాటిపైకి రావాల్సిన అవసరం వుంది. ఒక ఉమ్మడి సంఘటనగా ఏర్పడటం, మన తెలుగు రాష్ట్రాలకు వర్తించే రీతిన బిల్లు ప్రతిని తయారు చేసుకోవడం, ప్రభుత్వాలకు సమర్పించి వత్తిడి తెచ్చేందుకు స్థానిక శాసన సభ్యుల సహకారం తీసుకోవడం అవసరం.

నరేంద్ర దభోల్కర్ 2003లో ప్రతిపాదించిన బిల్లులోని సాంకేతిక లోపాలను హేతువాది శ్యామ్ మానవ్ అనే నాయకుడు 2005 మార్చిలో సవరించి "మహారాష్ట్ర ఎరాడికేషన్ ఆఫ్ బ్లాక్ మ్యాజిక్ అండ్ ఈవిల్ ప్రాక్టీసెస్ అండ్ కస్టమ్స్ యాక్ట్–2005" అని పేరు పెట్టారు. ఇందులో వున్న 'కస్టమ్స్' అనే పదానికి వాడుక, అలవాటు, ఆచారము, సంప్రదాయము అన్న పలు అర్థాలుండటంతో హిందూమతంపై దాడికోసమే ఆ బిల్లునుద్దేశించారని వ్యాఖ్యలు వెలువడ్డాయి.


డా॥ నరేంద్ర దభోల్కర్

దాంతో 'కస్టమ్స్' అనే పదాన్ని తొలగదించి 'అఘోరి' అన్న పదం చేర్చారు. దానికి మరల డిసెంబర్‌లో తుదిరూపునిచ్చి "మహారాష్ట్ర ఎరాడికేషన్ ఆఫ్ బ్లాక్ మ్యాజిక్ అండ్ ఈవిల్ అండ్ అఘోరి ప్రాక్టీసెస్ యాక్ట్–2005" అని పేరు మార్చారు. ఈ బిల్లులో పేర్కొన్న కొన్ని పదాలను "ది డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ (అబ్జక్షనబుల్ అడ్వర్‌టైజ్‌మెంట్స్) యాక్ట్–1954లో పేర్కొన్న అర్థాలనే ఖరారు చేశారు. మరికొన్ని పదాలు అఘోరి, బువబాజి, జరన్‌–మరణ్, దేవిమాత వంటి పదాలను అర్థ వివరణ లేకుండానే వదిలేశారు. ఆ బిల్లులో పెట్టిన మూఢ విశ్వాసాలలో అధికభాగం హిందువుల్లోనే గమనిస్తున్నందున క్రైస్తవ, ముస్లిం మతాల జోలికి పోకుండా హిందూమతం మీద జరుగుతున్న దాడిగా హిందూసంస్థల ప్రతినిధులు ఎదురు దాడి ప్రారంభించారు. ఈ చట్టంలో చెప్పుకోదగ్గ మరో అంశమేమంటే 'ది ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్–1956' మరియు 'ది డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్ట్–1954'లలోని అంశాల మేరకు అర్హత లేకుండా మామూలు వైద్యంగాని, తాంత్రిక వైద్యంగాని చేసే వారిని నిరోధించేలా కొన్ని నిబంధనలు చొప్పించటం జరిగింది.

ఈ బిల్లుపై మత వ్యతిరేక బిల్లు అన్న విమర్శలు చెలరేగడంతో బిల్లులో ఎక్కడా మతం, దైవం అన్న పదాలు రాకుండా చర్యలు గైకొన్నారు. అంతకుముందు సెప్టెంబరు 2013లో బిల్లుపై అపోహలు తొలగించేందుకు మహారాష్ట్ర పౌరసంబంధాల శాఖ తన పత్రిక 'లోకరాజ్యం'లో వివరణ ఇస్తూ వారసత్వ సంప్రదాయంగా వస్తున్న జ్యోతిషం, వాస్తు, విగ్రహారాధన, విగ్రహాల నిమజ్జనం, తలనీలాలు సమర్పించడం, పిల్లలకు ముక్కు, చెవులు కుట్టించడం వంటి అంశాలు ఈ చట్టం కింద నేరం కావని, అర్హత సర్టిఫికెట్లు లేకపోయినా

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి.

మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ–2

> **కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మూఢనమ్మకాల నిరోధక బిల్లు ఆమోదానికి సమ్మతించడంతో బెంగుళూరులోని 'లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ'కి చెందిన 'సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఎగ్జిక్లూజన్ అండ్ ఇన్‌క్లూజన్ పాలసీ' అనే విభాగం బిల్లు తయారీకి వేదికగా నిలిచింది. ఒక్క కర్నాటకలోనే గాక పలు రాష్ట్రాల్లోని వివిధ సంస్థల ప్రతినిధులు, అనుభవజ్ఞులు, మేధావుల సలహా సంప్రదింపులతో అనేక రౌండ్ల చర్చల అనంతరం ఈ బిల్లుకు తుదిరూపునివ్వడం జరిగింది.**

వారసత్వంగా వైద్యం అందిస్తున్న వారిని నేరస్తులుగా చూడబోమని తెలియజేసింది. బిల్లును సరిదిద్దిన శ్యామ్ మానవ్ గారడీలు చెయ్యడం ఈ బిల్లు కింద నేరం కాదని, దాన్ని మహత్యాలుగా ప్రకటించి, ఇతరులను మోసం చెయ్యడానికి వినియోగిస్తేనే నేరమని వివరణ ఇచ్చారు.

ఆ బిల్లులోని ముఖ్యాంశాలు:

– ఈ చట్టంలోని ఏ సెక్షను పరిధిలోకొచ్చే నేరాలయినా బెయిల్‌కు అర్హత లేని క్రిమినల్ నేరాలు అవుతాయి

– మెట్రోపాలిటన్ మెజిస్ట్రేటు లేదా జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేటుకు దిగువస్థాయిలో వున్న కోర్టులు యీ చట్టం కింద కేసుల్ని విచారించజాలవు.

– ఈ చట్టం కింద నేర నిర్ధారణ జరిగితే ఆరు నెలల నుంచి ఏడు సంవత్సరాల వరకు జైలుశిక్ష, ఐదువేల రూపాయల నుంచి యాభై వేల రూపాయల వరకు జరిమానా విధించ వచ్చు.

– విజిలెన్సు అధికారి విధులకు భంగకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే మూడు నెలల జైలు లేదా ఐదు వేల రూపాయల జరిమానా లేదా రెండూ విధించవచ్చు.

– ఈ చట్టంకిందికొచ్చే నేరం జరుగుతోందని భావించినప్పుడు సమీప పోలీసు స్టేషను సహకారంతో ఏ ప్రాంతాన్నైనా తనిఖీ చేసే అధికారం, అనుమానిత రికార్డులు, వస్తువులను పరిశీలించే అధికారం లేదా స్వాధీనం చేసుకునే అధికారం విజిలెన్సు అధికారి కలిగి వుంటాడు.

చట్టపరిధిలోకొచ్చే నేరాలు :

– దయ్యం పట్టిందన్న పేరుతో ఎవరినైనా తాడు లేదా గొలుసుతో బంధించడం, కర్ర లేదా కొరడాతో కొట్టి హింసించడం, చెప్పులు కడిగినర నీళ్లు తాగించడం, మిరపకాయల పొగ పెట్టడం, వ్రేలాడదీయడం, తాళ్లతో బంధించడం, జుట్టు కత్తిరించడం, వేడిచేసిన వస్తువుల్ని శరీరానికి తాకించడం, లైంగిక వేధింపులకు గురిచేయడం, బలవంతంగా మలమూత్రాలు నోట్లో పొయ్యడం మరియు ఈ తరహా ఇతర నేరాలు.

– తమకు మహత్యాలున్నాయని మౌఖికంగాను, రాతపూర్వకంగాను ప్రచారం చేసి ప్రజలను మోసం చేసిగాని, భయాందోళనకు గురిచేసి గాని ధనార్జనకు ప్రయత్నించడం.

– అతీంద్రియ శక్తుల అనుగ్రహం పొందేందుకు అవమానీయ, దుష్ట అఘోర చర్యలకు పాల్పడి ఎవరినైనా బాధించడం, ప్రాణాపాయ చర్యలకు పాల్పడటం.

– గుప్త నిధులు, నీటివనరుల అన్వేషణ పేర అమానవీయ, దుష్ట, అఘోర, తాంత్రిక చర్యలకు పాల్పడటం, కర్ణి, బాణామతి పేరుతో గాని, జరస్–మరణ్ (దీనికి సరైన అర్థ వివరణ ఇవ్వలేదు) పేరుతో గాని నరబలులివ్వడం, ప్రాణ త్యాగానికి ప్రోత్సహించడం.

– ఎవరికైనా అతీంద్రియ శక్తులున్నాయని నమ్మించి, ఇతరులను భయభ్రాంతులకు గురి చెయ్యడం, వారి ఆదేశాలను పాటించకపోతే చెడు పరిణామాలు ఏర్పడుతాయని భయపెట్టడం, మోసం చెయ్యడం.

– ఒక వ్యక్తి కర్ణి, ఇతర తంత్రాలతో పాలిచ్చే పశువులలో పాల దిగుబడిని తగ్గిస్తున్నాడని, ఆ వ్యక్తివల్ల కీడు జరుగుతుందని, వ్యాధులస్తాయని, సైతాను అవతారం అని ప్రచారం చెయ్యడం.

– తాంత్రిక విద్యల పేరుతో ఒక వ్యక్తిపై దాడి చెయ్యడం, నగ్నంగా ఊరేగించడం లేదా అతని దైనందిన కార్యకలాపాలను నిరోధించడం.

– క్షుద్ర విద్యలు, మంత్ర తంత్రాలతో దయ్యాలను వదిలిస్తానని, దయ్యాలను వశపర్చుకోగల శక్తి వుందని ప్రజానీకంలో భయం పుట్టించడం, ఆ పేరున ఎవరినైనా గాయపర్చడం, సరైన వైద్య చికిత్స చేయించు కోకుండా అడ్డుకోవడం, ఆరోగ్యం చెడిపోతుం దని, ప్రాణహాని వుందని భయపెట్టడం, ఆర్థికంగా–శారీరకంగా హాని కలిగించేలా తంత్ర విద్యలు ప్రదర్శించడం.

– కుక్క కరిచినా, పాము–తేలు కాటు వేసినా ఆధునిక వైద్యం చేయించుకోకుండా అడ్డుపడి మంత్రతంత్రాలతో నయం చేసేందుకు ప్రయత్నించడం.

– చేతివేళ్లతో శస్త్రచికిత్స చేయగలనని, గర్భంలోని పిండానికి లింగమార్పిడి చేయగలనని నమ్మించడం.

– తనకు అతీంద్రియ శక్తులున్నాయని లేదా అవతార పురుషుడినని ప్రకటించి ఎవరినైనా గత జన్మలో తన భక్తుడు లేదా భక్తురాలనో, భార్య లేదా భర్త అనో, విటగాడు లేదా ఉంపుడుగత్తె అనో ప్రకటించి లైంగిక చర్యలకు పాల్పడటం.

– సంతానం లేని స్త్రీలకు తనకున్న శక్తుల ద్వారా సంతానప్రాప్తి కలిగించగలనని నమ్మించి లైంగిక చర్యలకు పాల్పడటం.


## ఇటీవల వెలువడినవి

**మాకినేని బసవపున్నయ్య రచనలు**

| | |
|---|---|
| (1) సాయుధ తెలంగాణా పోరాటం – వాస్తవాలు | వెల : రూ.150/- |
| (2) స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర | వెల : రూ. 60/- |
| (3) సిద్ధాంత సమస్యలు | వెల : రూ. 60/- |
| (4) వామపక్ష రాజకీయాలు–సిపియం విధానాలు | వెల : రూ. 60/- |
| (5) మార్క్సిస్టు యోధులు – మార్గదర్శకులు | వెల : రూ. 60/- |

**ప్రజాశక్తి బుక్‌హౌస్**
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్ -20,
ఫోన్ : 27608107, 9490099202

బ్రాంచీలు :
హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు, నల్గొండ, ఖమ్మం, ఒంగోలు, కరీంనగర్

– మానసిక వైకల్యం వున్న రోగికి అతీత శక్తుల్ని ఆపాదించి ఆ పేరున ఇతరులను మోసం చేసి దోచుకోవడం.

చట్టంలో మినహాయింపు లభించే అంశాలు

– గుళ్లచుట్టూ చేసే ప్రదక్షిణలు, తీర్థయాత్రలు, దేవాలయాలు–ఇతర పుణ్యక్షేత్రాల్లో జరిగే క్రతువులు.

– కీర్తనలు, భజనలు, ప్రవచనాలు, పౌరాణిక గాథలను బోధించడం, వాటిని ఆచరించడం,చ ప్రచారం చెయ్యడం.

– మరణించిన సాధు, సన్యాసులు – యితర మత గురువుల మహత్యాలను, గొప్పతనాన్ని యితరులను (శారీరక–ఆర్థిక నష్టం కలుగకుండా) పేర్కొనడం, మౌఖికంగానూ, రాతపూర్వకంగానూ ప్రచారానికి పూనుకోవడం.


– ఇతరులకు శారీరక, ఆర్థిక నష్టం కలుగకుండా గుడిలోను, దర్గాలోను, చర్చిలోను, గురుద్వారాలోను ప్రార్థనలు చెయ్యడం, దైవాన్ని సేవించడం.

– మత నమ్మకాల్లో భాగంగా ముక్కు–చెవి కుట్టించుకోవడం , గుండు కొట్టించుకోవడం.

కర్నాటక ముఖ్యమంత్రి శ్రీ సిద్ధరామయ్య మూఢనమ్మకాల నిరోధక బిల్లు ఆమోదానికి సమ్మతించడంతో బెంగళూరులోని 'లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ'కి చెందిన 'సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఎగ్జిక్లూజన్ అండ్ ఇన్‌క్లూజిన్ పాలసీ' అనే విభాగం బిల్లు తయారీకి వేదికగా నిలిచింది. ఒక్క కర్నాటకలోనే గాక పలు రాష్ట్రాల్లోని వివిధ సంస్థల ప్రతినిధులు, అనుభవజ్ఞులు, మేధావుల సలహా సంప్రదింపులతో అనేక రౌండ్ల చర్చల అనంతరం ఈ బిల్లుకు తుదిరూపునివ్వడం జరిగింది. ఈ ప్రక్రియలో సుమారు 105 మంది హేమాహేమీలు పాలుపంచుకున్నారంటే ఏ స్థాయిలో మేధోమథనం జరిగిందో గ్రహించవచ్చు. అంతేగాక, బిల్లు తయారయ్యాక కర్నాటకలోని 250 మంది మేధావులకు దాని ప్రతిని పంపి సలహాలు, సూచనలు కోరడం జరిగింది. సామాన్య ప్రజానీకం నుంచి కూడ సూచనలను ఆహ్వానించారు. అనంతరం మోడల్ బిల్లుకు తుదిరూపం యివ్వడం జరిగింది. దానికి "ది కర్నాటక ప్రివెన్షన్ ఆఫ్ సూపర్‌స్టిషియల్ ప్రాక్టీసెస్ బిల్–2013" అని పేరు పెట్టి డిసెంబరు 2013లో ముఖ్యమంత్రి శ్రీ సిద్ధ రామయ్యకు సమర్పించారు.

ఈ నమూనా బిల్లులోని ముఖ్యాంశాలు :

> **❝ మూఢనమ్మకం అంటే శారీరకంగానూ, మానసికంగానూ హాని కలిగించేవి, ఆర్థిక, లైంగిక దోపిడీకి దారితీసేవి; ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సమూహాన్ని బాధిస్తున్న సమస్యల నివారణకు లేదా అనారోగ్యాన్ని నవారించేందుకు ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సముదాయం తమను అతీంద్రియ శక్తులున్నాయని నమ్మించి, భయపెట్టి స్వార్థానికి వినియోగించుకునే స్థితి వుండటం. ❞**



హేతువాది శ్యామ్ మానవ్

– మూఢ నమ్మకాల నిరోధానికి, నిర్మూలనకు రాష్ట్ర స్థాయిలో మూడు సంవత్సరాల కాలపరిమితిలో రిటైర్డ్ హైకోర్టు జడ్జి ఆధ్వర్యాన యాంటీ సూపర్‌స్టిషన్ అథారిటీని, జిల్లాల స్థాయిలో జిల్లా మెజిస్ట్రేట్ లేదా ఆయన నియమించిన వ్యక్తి ఆధ్వర్యాన విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చెయ్యాలి. ఈ కమిటీలు మూఢ నమ్మకాల వల్ల కలిగే కష్టనష్టాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

– ఈ చట్టం కింద నేరానికి పాల్పడే వ్యక్తికి ఒక ఏడాది నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, పదివేల రూపాయల నుంచి యాభైవేల రూపాయల వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చు.

– ఈ చట్ట పరిధిలోకొచ్చే నేరాలపై పోలీసులకు ఎవరైనా (3వ వ్యక్తి కూడా) ఫిర్యాదు చేయవచ్చు.

– ఈ చట్టం కింద ఏర్పాటయ్యే కమిటీలు మూఢనమ్మకాలపై సర్వే నిర్వహించడం, నిరోధం లేదా నిర్మూలన కోసం విస్తృత ప్రచారం, అవగాహన కార్యకలాపాలను నిర్వహించడమే గాక సివిల్ కోర్టులకు వుండే అధికారాలన్నీ కలిగి వుంటాయి.

– ఆచరణలో వున్న మూఢనమ్మకాల తీరుపై అధ్యయనం చెయ్యడమేగాక వాటి నివారణకు ప్రాథమిక, హైస్కూలు స్థాయిల్లో పాఠ్యాంశాల్లో చెయ్యాల్సిన మార్పుల గురించి పరిశీలించాలి.

ఈ చట్టప్రకారం విచారణార్హమైన క్రిమినల్ నేరాలు :

– దేవీ దేవతల సంతృప్తికొరకు నరబలి యివ్వడం, (ఈ నేరానికి మాత్రం మరణశిక్ష, యావజ్జీవ ఖైదుతోబాటు జరిమానా కూడా విధించవచ్చు) నరబలి యిస్తే మంచిదన్న నమ్మకాన్ని వ్యాప్తిలో పెట్టడం, ఇతరులు అలా చేసేందుకు ప్రోత్సహించడం.

– అనారోగ్యంగా వున్న వ్యక్తుల ఆరోగ్యాన్ని నయం చేస్తానని దయ్యాల పేరునో, తాంత్రిక విద్యలతో భూతవైద్యం పేరునో భయపెట్టేలా ప్రవర్తించడం.

– ఇండియన్ పీనల్‌కోడ్‌లోని సెక్షన్ 297లో పేర్కొన్నట్టు స్మశాన వాటికలలోకి హద్దు మీరి ప్రవేశించడం, గౌరవభంగం కలిగించే చర్యలకు పాల్పడటం, ఇతరులను అందుకు ప్రోత్సహించడం, స్మశాన వాటికల్లో క్షుద్రపూజలు నిర్వహించి ఎవరినైనా లైంగికంగా లేదా ఆర్థి కంగా వేధించడం.

– తనకు అతీంద్రియ మానవాతీత శక్తులున్నాయని ఇతరులను నమ్మించి ఇతరుల సమస్యలను పరిష్కరిస్తానని వంచించడం, వాటి ఆధారంగా లబ్ది పొందడం.

– క్షుద్రపూజలు, ప్రార్థనలు నిర్వహించడం, ఇతరులకు హాని చెయ్యగలనని వారిని భయ పెట్టడం.

– మతాచారాల పేరుతో శరీరంపై గాయాలు చేసుకోవడం, ఒంటికి కొక్కాలు గుచ్చుకుని రథాల వంటివి లాగడం.

– చంటిపిల్లలు అనారోగ్యంతో బాధపడుతుంటే ఆచారాల పేరుతో వారికి హాని

> “రాజ్యాంగ పరంగాను, యితర చట్టాలపరంగాను గందర గోళం తలెత్తకుండా నివారించేందుకు, మత వాదులు అసహనానికి గురి కాకుండా చూసేందుకు ఈ బిల్లులోని నేరాల జాబితాలో సూపర్‌స్టిషన్ (మూఢనమ్మకం), రెలిజయన్ (మతం), ఫేట్ (విధి), గాడ్ (దైవం), ఫెయిత్ (విశ్వాసం) వంటి పదాలు రాకుండా జాగ్రత్తపడటం జరిగింది.”

కలిగించేలా గద్దెమీదికి విసరడం, ఎత్తుగా వున్న ప్రదేశం నుంచి కిందికి విసరడం.

– స్త్రీలను గ్రామాల నుంచి బహిష్కరించడం, బహిష్టుకు గురైన స్త్రీలను, గర్భిణిలను దూరంగా వుంచడం.

– సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన స్త్రీలపై రంగునీళ్లు జిమ్మడం, వారి హుందాతనాన్ని దెబ్బతీసి మానసిక ఆవేదనకు గురి చేయడం.

– పనూజలు, క్రతువుల పేరిట స్త్రీలను మభ్యపెట్టి నగ్నంగా తయారు చేయడం, ఊరేగించడం.

– తనకు అద్భుత శక్తులున్నాయని నమ్మించి, సమాజంలో ప్రత్యేక హోదా కల్పిస్తాననో, సంతాన ప్రాప్తికలుగుతుందనో నమ్మించి శారీరకంగా లంగదీసుకోవడం.

– ప్రజారోగ్యానికి భంగం కలిగేలా జంతువులను బలి యిచ్చేందుకు పీక కొరికి చంపే సంప్రదాయాలను పాటించమని యితరులపై ఒత్తిడి తేవడం.

– మాదేస్నానం పేరుతో బ్రాహ్మణులు భోజనం చేసిన విస్తరాకుల్లో దిగువ కులాల వారు పొర్లడం, తద్వారా మానవ హుందాతనాన్ని కించపరచడం.

– కుల, లింగ వివక్ష పాటించి దిగువ కులాల వారిచేత చెప్పులు మోయించడం, ఆహార వడ్డనలో పంక్తి భేదం పాటించడం.

– పుట్టిన స్థలం, తేదీ సమయం ఆధారంగా ఎవరినైనా కించపరడం, నీచంగా చూడటం, దాన్ని నివారించేందుకు బాధితుడు మానసిక వేదనకు గురయ్యే రీతిన క్రతువులు నిర్వహించడం, ఆ పేరున బాధితుడికి ఆర్థిక నష్టం కలిగించడం.

– తమ నిర్దోషిత్వాన్ని నిరూపించేందుకుగాను వేడిగా వున్న వస్తువుల్ని పట్టుకోమనడం తద్వారా మానసిక, శారీరక హింసకు గురి చెయ్యడం.

చివర్లో పేర్కొన్న రెండింటినీ బెయిలబుల్ నేరాలుగా పేర్కొనడం జరిగింది. మిగతావన్నీ నాన్‌బెయిలబుల్ నేరాలే. ఈ బిల్లులో ‘మూఢనమ్మకం’ ‘బాధితుడు’ అన్న పదాలకు అర్ధవివరణ యివ్వడం జరిగింది. వాటి వివరణ.

మూఢనమ్మకం: శారీరకంగాను, మానసికంగాను హాని కలిగించేవి, ఆర్థిక, లైంగిక దోపిడీడకి దారితీసేవి; ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సమూహాన్ని బాధిస్తున్న సమస్యల నివారణకు లేదా అనారోగ్యాన్ని నవారించేందుకు ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సముదాయం తమను అతీంద్రియ శక్తులున్నాయని నమ్మించి, భయపెట్టి స్వార్ధానికి వినియోగించుకునే స్థితి వుండటం.

బాధితుడు : తన నమ్మిక మీద ఆధారపడి చేసిన ఆచరణ కారణంగా తన హుందాతనాన్ని కోల్పోవడమే గాక శారీరక లేదా మానసిక వేదనకు, ఆర్థిక లేదా లైంగిక దోపిడీకి గురైన వ్యక్తి.

రాజ్యాంగ పరంగాను, యితర చట్టాల పరంగాను గందరగోళం తలెత్తకుండా నివారించేందుకు, మత వాదులు అసహనానికి గురి కాకుండా చూసేందుకు ఈ బిల్లులోని నేరాల జాబితాలో సూపర్‌స్టిషన్ (మూఢనమ్మ కం), రిలిజయన్ (మతం), ఫేట్ (విధి), గాడ్ (దైవం), ఫెయిత్ (విశ్వాసం) వంటి పదాలు రాకుండా జాగ్రత్తపడటం జరిగింది. జ్యోతిషాన్ని ఇప్పటికే యుజిసి ఆమోదంతో విశ్వవిద్యాల యాల్లో బోధిస్తున్నందున సదానరిన చట్టంలో చొప్పించలేకు మరో రూపంలో పాక్షికంగా చేర్చడం జరిగింది. కర్నాటక బిల్లు ప్రాతిపదికన అవసరమైన మార్పులతో స్థానిక నమ్మకాలకు అనుగుణంగా ఇతర రాష్ట్రాలలోని సంఘాలు బిల్లు తయారీకి ప్రయత్నించాలి.

విజ్ఞాన శాస్త్రం కొత్త పుంతలు తొక్కుతోంది. సాంకేతికత ఊహించని స్థాయిలో అభివృద్ధి చెందింది. విద్యావంతుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. కాని సమాజంలో వివేకం ప్రదర్శించే వారి కన్నా విశ్వాసం ప్రదర్శించేవారి సంఖ్య అధికంగా దర్శనమిస్తోంది. చదువు దారి చదువుదే, ఆచార సంప్రదాయాల పేరిట వస్తున్న విశ్వాసాల దారి విశ్వాసాలదే అన్నట్టుగా వుంది నేటి పరిస్థితి. నిజానికి ప్రాచీన మానవుడి విజ్ఞాన స్థాయితో పోల్చిచూస్తే నేటి విజ్ఞాన స్థాయిని బట్టి సమాజం మరోలా వుండాలి. కాని, అలా లేకపోబట్టే హేతువాద, నాస్తిక సంఘాల అవసరం, మూఢనమ్మకాల నిరోధక చట్టం ఆవశ్యకత ఏర్పడుతోంది. తెలుగు రాష్ట్రాలు రెండింటా మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకురావాలంటే ప్రస్తుతమున్న రాజకీయ వాతావరణంలో ఎంత కష్టసాధ్యమో మనకు తెలుసు. వెయ్యి మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతో ప్రారంభించక తప్పదు. ఆ దిశగా కృషి చేద్దాం.

# నయా-ఉదారవాదం: ప్రజాస్వామ్యం

(21వ పేజీ తరువాయి)

సమీకరణ సమస్య అధిగమించరానిదేమీ కాదు. నయా- ఉదారవాద ప్రభుత్వమే ఈ నిధుల సమీకర ణకు నిజమైన ఆటంకం. అందువలనే వామ పక్షాలు తప్పనిసరిగా ఈ సమస్యను తీసుకో వాలి. అవి ఎక్కడ అధికారం లోకి వచ్చినా వీటిని అమలు జరపటానికి “అవకాశమున్న” (పర్మిసిబుల్) మేరకు కృషి చేయాలి. నయా-ఉదారవాద తర్కం యొక్క ఆధిపత్యానికి లొంగిపోకుండా ఉండాలి. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా నయా-ఉదారవాదం యొక్క దాడిని ఎదుర్కొంటూ, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకొంటూ సోషలిజం కోసం పోరాటం చేయాలి. నయా-ఉదారవాద ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ, దాన్ని వ్యతిరేకించే భావాల ఆధిపత్యం కోసం పోరాడాలి. భావాధిక్యం కోసం జరిగే పోరాటం లో రచయితలు ముఖ్య మైన పాత్ర నిర్వహించాలి. ఢిల్లీ పరిసరాలలో ఉన్న మారుతి ఫ్యాక్టరీలో ఒక కార్మికుడు కార్మిక సంఘ నాయకునితో మాట్లాడుతూనో, చేతిలో కరపత్రంతోనో కనబడితే ఉద్యోగం నుండి తొలగించబడే పరిస్థితిని ఎదుర్కొంటున్నాడంటే నయా-ఉదార వాద యుగంలో కార్మికులను సమీకరించటానికి ఉన్న ఆటంకాలను అర్థం చేసుకోవచ్చు.

**(అనువాదం: ఎ.కోటిరెడ్డి)**

**గ్రంథ పరిచయం**

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో దళితులు



రచయిత అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు

**కొండూరి వీరయ్య**

రెండు దశాబ్దాల ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణ విధానాల అమలు ప్రభావం భారతీయ సమాజంపై ఎలా ఉన్నదన్నది కేవలం పరిశోధకులకే కాదు. సామాజిక రంగంలో పని చేసేవారికీ ఆసక్తికరమై అంశమే. ఈ విధానాల ప్రభావం, దానివలన ప్రజా జీవితంలో వస్తున్న మార్పుల ఆధారంగానే సమస్యలను గుర్తించటం, వాటి పరిష్కారానికి పోరాడటం జరుగుతుంది. ఆర్థిక సంస్కరణలు గ్రామీణ జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయని సాధారణ పరిశీలనలో స్పష్టమౌతున్నది. ఈ విధానాల వలన తీవ్రంగా ప్రభావితమౌతున్న దళితుల పరిస్థితి గురించి అరుదుగా మాత్రమే చర్చ జరుగుతున్నది. దళితుల జీవితాలను, వారి సమస్యలను అధ్యయనం చేయటానికి జాతీయ నమూనా సర్వే సంస్థ నిర్వహించే సర్వేల్లో చాలా సమాచారం వస్తున్నప్పటికీ ఈ సమాచారం ఆధారంగానే దళితుల జీవన పరిస్థితులలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయటం సాధ్యం కాదు. ప్రత్యేకించి సామాజిక కోణం ఇమిడి ఉన్న పరిశీలనలు చేపట్టాలంటే స్వతంత్ర అధ్యయనాలు, ప్రత్యేక పరిశోధనలు అనివార్యం. వికె రామచంద్రన్ సంపాదకత్వంలో వెలువడిన " గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో దళితులు" అన్న గ్రంథం ఈ ప్రత్యేక పరిశోధన దిశగా జరిగిన ప్రయత్నంగా చెప్పుకోవచ్చు. భారతదేశంలో కుల వ్యవస్థ దోపిడీకి, ఆర్థిక,సామాజిక వివక్షకు మూలస్థంభంగా ఉంది. ఈ దోపిడీని కొనసాగించటానికి ఆధిపత్య వర్గాలు తెరమీదకు తెచ్చినదే అంటరానితనం. అంబేద్కర్ తన ప్రసిద్ధ రచన " కులనిర్మూలన"లో 'ప్రజాస్వామ్యం ప్రధానంగా తోటి మానవుల పట్ల గుర్తింపు, గౌరవం తెచ్చిపెట్టే ధోరణి' అని హిందూమతోన్మాదులు బయటికి ఏమి చెప్పినా ' హిందూయిజం వ్యక్తిగత స్వేచ్ఛకు, సమానత్వానికి, సహోదరత్వానికి పెనుప్రమాదం. ఆ విధంగా చూసినపుడు ప్రజాస్వామ్యానికి హిందూయిజానికి మధ్య పొంతన కుదరదు' అని నిర్ధారిస్తారు. ఈ అవగాహన తమ విశ్లేషణకు పునాదిగా ఉంటుందని వి.కె.రామచంద్రన్ ఉపోద్ఘాతంలో ప్రస్తావిస్తారు. ఈ పుస్తకం పలువురు రచయితలు, పరిశోధకులు వేర్వేరు సందర్భాల్లో, వేర్వేరు ప్రాంతాల్లో సాగించిన పరిశోధనల ఆధారంగా రాసిన వ్యాసాల సంకలనం. ఈ సంకలనంలో కులాన్ని ఒక సామాజిక,ఆర్థిక అంశంగా పరిగణించారు.

కుల వ్యవస్థ ఉత్పాదకశక్తుల అభివృద్ధికి ఆటంకంగా ఉన్నది. పాలకవర్గాలను ప్రతిఘటించి గద్దె దించే ప్రయత్నాలకు కూడా ఈ కుల వ్యవస్థ ప్రధాన అవరోధంగా మారింది. 21వ శతాబ్దంలో చంద్రమండల ప్రయోగంలో విజయం సాధించిన తర్వాత కూడా గ్రామీణ జీవితం, ప్రత్యేకించి దళితుల జీవితం కుల వ్యవస్థ కబంధ హస్తాల నుండి బయటపడలేనంత కట్టుదిట్టంగా నిర్మితమైంది ఈ పరిస్థితుల్లో ఈ గ్రంథంలోని విశ్లేషణ సామాజిక ఆర్థిక దోపిడీ రూపాలను, పర్యవసానాలను వెలుగులోకి తెచ్చేదిగా ఉంది. ఈ గ్రంథంలో రచయితలు గ్రామీణ ప్రజలను ప్రధానంగా భూమి, స్వయం ఉపాధి, వ్యవసాయేతర స్వయం ఉపాధి, వ్యవసాయ కార్మికులు అన్న నాలుగు తరగతులుగా విభజించి విశ్లేషణ చేశారు. రచయితలు ఈ విశ్లేషణకు 2004-05 ఎన్ఎస్ఎస్ఓ గణాంకాలను ప్రాతిపదికగా ఉపయోగించారు. సుఖేందు థోరట్, నిధి సాదనా సభర్వాల్, అమిత్ థోరట్‌లు ప్రధానంగా తక్కువ ఆదాయం ఉన్న రాష్ట్రాల్లో సామాజిక వెలి తీరు తెన్నులు గురించి పరిశీలిస్తారు. "పోరాటాలు, భూమి, కూలి, హక్కులు" శీర్షికన ఉన్న మొదటి భాగంలో రాంకుమార్ మలబార్ (కేరళ) ప్రాంతానికి చెందిన ఒక గ్రామంలో గడచిన శతాబ్దంలో దళితుల స్థితిగతుల్లో వచ్చిన మార్పులను పరిశీలించే ప్రయత్నం చేస్తారు. జి. రామకృష్ణ ప్రధానంగా దళితుల ఆర్థిక స్థితిగతులు, గుర్తింపు, గౌరవం సాధించటంలో ఉద్యమకోణాన్ని వివరించారు. అపరాజిత భక్షి వ్యాసంలో పశ్చిబెంగాల్‌లో అమలు జరిగిన భూసంస్కరణల పర్యవసానంగా దళితులకు కలిగిన భూమి, ఇతర ప్రయోజనాలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. "సమకాలీన గ్రామీణ భారతం" అన్న రెండో భాగం తమిళనాడులోని కోయంబత్తూర్, తిరుపూర్ పరిసర గ్రామాల్లో పారిశ్రామికీకరణ ప్రభావం, మూడు దశాబ్దాల్లో చోటు చేసుకున్న మార్పుల గురించి వివరిస్తుంది. జుడిత్ హేయర్ వ్యాసం. వి.సుర్జిత్ రాసిన వ్యాసంలో తమిళనాడులోని తంజావూరు ప్రాంతంలో కౌల్దారీ వ్యవస్థలో వచ్చిన మార్పులను పరిశీలించారు. మహారాష్ట్రలో దళితులపై పెరుగుతున్న దాడులకు, భూ వివాదాలకు మధ్య ఉన్న సంబంధాన్ని శోధిస్తుంది రాంకుమార్, తుషార్ కాంబ్లే రాసిన వ్యాసం. ఈ సెక్షన్‌లో చివరిగా దళితుల రుణభారం గురించి పల్లవి చవాన్ కొన్ని వాస్తవాలు వెలుగులోకి తెస్తారు. "భారత దేశంలో వ్యవసాయ సంబంధాలు" అన్న చివరి భాగంలో ఈ పరిశోధనల్లో వచ్చిన కొన్ని నిర్ధారణలను మనముందుంచారు. భూమి, ఆస్థి విషయంలో దళితులు, దళితేతరుల మధ్య ఉన్న అసమానతలను వికాస్ రావల్ పరిశీలిస్తే, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రెండు గ్రామాల్లో దళితుల పేదరికం గురించి ప్రశాంత్ షా, గ్రామాల్లో ఆర్థిక అసమానలలు పెంచి పోషించటంలో కుల వ్యవస్థ పాత్ర గురించి మధురా స్వామినాధన్, వికాస్ రావల్‌లు, వేతన కార్మికులపై ఒక నోట్‌ను వి. కె. రామచంద్రన్ రాశారు. ప్రాథమిక వసతులకు దూరంగా ఉన్న దళిత కుటుంబాల గురించి మధురా స్వామినాధన్ సంషేర్ సింగ్‌తో కలిసి పరిశోధించిన వివరాలు చివరి వ్యాసంలో మనకు అందిస్తారు.

మలబార్ గ్రామాల్లో శతాబ్దకాలపు దళిత చైతన్యాన్ని, ఈ దళిత చైతన్య సామాజిక ఆర్థిక నేపథ్యాన్ని వివరిస్తారు రాంకుమార్. ఆ నాటికే

> **❝ ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా, గోదావరి డెల్టాలాగా తమిళనాడులో తంజావూరు డెల్టా వ్యవసాయాభివృద్ధిలో ముందంజ వేసిన ప్రాంతం. చారిత్రకంగా చూసినపుడు ఈ ప్రాంతాల్లో కులవివక్ష, అంటరానితనం బలంగా వేళ్లూనుకుని ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ సంకలనంలో జి. రామకృష్ణ రాసిన "తూర్పు తంజావూరులో రైతాంగ ఉద్యమం, దళితుల హక్కులు" అన్న వ్యాసం ఆపోరాటాల విలువైన అనుభవాలను గ్రంథస్థం చేసింది. ❞**

ప్రతి కుటుంబంలోనూ వేతన కార్మికులు ఉండటంతో, మలబార్ ప్రాంతంలో వ్యవసాయ కార్మికులు విలక్షణ సామాజిక తరగతిగా ఏర్పడ్డారు. 2001 నాటికి ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు వ్యవసాయ కార్మికులుగా, వేతన కార్మికులుగా ఉన్న కుటుంబాలను ఎంచుకున్నారు. ఈ కుటుంబాల్లో వేతన శ్రమ ద్వారా వస్తున్న ఆదాయం, మలబార్‌లో నాటి కరుడు కట్టిన కులవ్యవస్థ, బ్రాహ్మణాధిపత్యం, సాంఘిక జీవనంపై వారి పెత్తనం నేపథ్యంలో నిర్దిష్ట రూపం తీసుకున్న దళిత చైతన్యం గురించి రాంకుమార్ వివరిస్తారు. మలబార్ ప్రాంతంలో దళితుల సామాజికార్థిక స్థితిని మార్చుకోవటానికి జరిగిన పోరాటాలను కాలానుగుణంగా మూడు భాగాలుగా విభజిస్తారు. 1917–1934 మధ్య కాలాన్ని మొదటిదశగాను, 1934–57 మధ్య కాలాన్ని రెండో దశగాను, 1957 తర్వాతి కాలాన్ని మూడో దశగాను రచయిత పరిగణిస్తారు మొదటి దశలో దళిత చైతన్యం ప్రధానంగా స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా అంటరానితనం నిర్మూలన కోసం జరిగిన పోరాటాల గురించి వివరిస్తారు. రెండో దశలో ఈ దళిత చైతన్యం వర్గ చైతన్యంగా రూపొందటం, అంటరానితనంతో పాటు ఆర్థిక, రాజకీయ అంశాలపై నిర్దిష్ట వైఖరి తీసుకోవటం కనిపిస్తుంది. ఈ రెండు దశల్లోనూ కమ్యూనిస్టు పార్టీ సాగించిన కృషిని కూడా రేఖా మాత్రంగా రచయిత పాఠకుల దృష్టికి తెస్తారు. 1957లో కేరళలో మొదటి కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడటానికి ఈ రెండు దశల్లో జరిగిన పోరాటాలు దోహదం చేస్తాయి. భూస్వామ్య విధానాన్ని అంతమొందించకుండా అంటరానితనాన్ని నిర్మూలించలేమన్న నిర్ధారణకు రావటంతో రెండో దశలో నినాదాలు, పోరాటం సరికొత్త రూపం తీసుకుంటాయి. భూస్వాములు, అగ్రవర్ణాల సామాజిక ఆధిపత్యానికి భూస్వామ్య విధానంలోనే పునాదులు ఉన్నాయని, ఈ బలంతోనే భూస్వామ్య వ్యవస్థ అంటరానితనాన్ని కొనసాగిస్తోందని అర్థం చేసుకుంటారు. ఈ అవగాహనతోనే భూస్వామ్య వ్యవస్థను బద్దలు కొట్టే లక్ష్యంతో 1937లో అఖిల మలబార్ కర్షక సంఘం ప్రారంభమైంది. మలబార్ కిసాన్ సభ నాయకులుగా ఉన్న తొలితరం కమ్యూనిస్టు నేత కృష్ణపిళ్లై అంటరానితనాన్ని నిర్మూలిస్తూ చట్టం చేయాలనే నినాదం ఇస్తారు. ఈ కాలంలో అంటరానితనానికి వ్యతిరేకంగా నినాదాలకు పరిమితం కావటమే కాదు. ఆచరణలో విభిన్న కులాల మధ్య ఐక్యత సాధించే దిశగా జరిగిన ప్రయత్నాలను రాంకుమార్ వివిధ పరిశోధకుల రచనల నుండి క్రోడీకరించి మనముందు ఉంచారు. చివరిగా ఈ వ్యాసంలో మూడో దశకు సంబంధించి అంటే 1957లో ఇఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో తొలిసారి కమ్యూనిస్టు ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత,ఈ ఉద్యమాల్లో లేవనెత్తిన డిమాండ్లకు ఆచరణ రూపం ఇచ్చిన క్రమాన్ని వివరిస్తారు. ఈ తరం పాఠకులకు వర్గదృష్టితో చారిత్రక సమాచారాన్ని అందచేసిన ప్రయత్నంగా ఈ వ్యాసాన్ని చెప్పుకోవచ్చు. కేరళలో అమలు జరిగిన భూసంస్కరణలు మూడు మౌలిక లక్ష్యాలు నెరవేర్చటానికి ఉద్దేశించినవి. మొదటిది, కౌలుదార్ల హక్కుల పరిరక్షణ,రెండోది భూకమతాల గరిష్ట పరిమితి నిర్ధారణ, చివరిది భూమి లేని వ్యవసాయ కార్మికులకు ఇళ్ల స్థలాలు చట్టబద్ధమైన హక్కుగా మార్చటం. తద్వారా భూసంస్కరణలు కేవలం భూమి పంపకంతో సరిపెట్టకుండా కేరళ అంతర్జాతీయ స్థాయిలో మానవాభివృద్ధి సాధించటానికి పునాదులు వేసింది. నేడున్న ఇందిరా ఆవాస్ యోజన, రాజీవ్ ఆవాస్ యోజన వంటి గృహనిర్మాణ పథకాలు తెరమీదకు రావటానికి ఐదు దశాబ్దాలకు ముందే కమ్యూనిస్టు ప్రభుత్వం ప్రజలందరికీ నివాస స్థలాలను చట్టబద్ధమైన హక్కుగా గుర్తించి, అమలు చేసిందంటే ఆ ప్రభుత్వం ఎంత ముందు చూపు కలిగిందో అర్థం చేసుకోవచ్చు.


ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా, గోదావరి డెల్టాలాగా తమిళనాడులో తంజావూరు డెల్టా వ్యవసాయాభివృద్ధిలో ముందంజ వేసిన ప్రాంతం. చారిత్రకంగా చూసినపుడు ఈ ప్రాంతాల్లో కులవివక్ష, అంటరానితనం బలంగా వేళ్లూనుకుని ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ సంకలనంలో జి. రామకృష్ణ రాసిన "తూర్పు తంజావూరులో రైతాంగ ఉద్యమం, దళితుల హక్కులు" అన్న వ్యాసం ఆపోరాటాల విలువైన అనుభవాలను గ్రంథస్థం చేసింది. స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న భూ సంబంధాలను, కౌలుదార్లపై జరిగిన దోపిడీని కళ్లకు కట్టినట్లు వివరించింది. ఎంపిక చేసిన కుటుంబాలను కేస్ స్టడీస్ పద్ధతి ద్వారా అధ్యయనం చేసి, ఆయా ప్రాంతాల్లో అమల్లో ఉన్న దోపిడీ రూపాలు, పద్ధతులు, దోపిడీ సంబంధాలు, అణచివేత, కులవివక్ష వంటి అనేక కోణాలను గురించి విలువైన సమాచారాన్ని రామకృష్ణ క్రోడీకరించారు. ఈ దోపిడీ విధానాలకు, వలసవాద పీడనకు మధ్య ఉన్న సంబంధాన్ని ఈ వ్యాసంలో రచయిత వక్కాణిస్తారు. తంజావూరులో దళితులను సంఘటితం చేయటానికి వారి హక్కుల పరిరక్షణకు ఒక బ్రాహ్మణ విధవరాలు నడుంకట్టిన చారిత్రక సన్నివేశాన్ని ఈ వ్యాసంలో మనం చూడవచ్చు. దళితుల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం మొదలైన ఈ పోరాటం క్రమంగా దళితుల ఆర్థిక హక్కుల సాధనతో మాత్రమే ఆత్మగౌరవం సంపాదించగలమన్న నిర్ధారణకు వచ్చాక ఈ పోరాటాలు అఖిల భారత కిసాన్ సభ నిర్వహించే పోరాటాల్లో అంతర్భాగమయ్యాయి. ఈ ప్రాంతంలో దళితులకే కాక కౌలుదార్లకు కూడా హక్కులు గ్యారంటీ చేసిన పలు పోరాటాలకు అఖిల భారత కిసాన్ సభ నాయకత్వం వహించింది. ఈ క్రమంలోనే తెన్పారైలో కట్టుబానిసల తిరుగుబాటు గురించిన వివరమైన అనుభవాలు ఈ వ్యాసంలో మనకు కనిపిస్తాయి. బలవంతంగా ఆవు పంచకం తాపించటం వంటి అమానుష చర్యలకు వ్యతిరేకంగా ఆనాడు ఈ ప్రాంతంలో దళితులు, పాలికాపులు ( పాలికి పొలం చేయటమే నాటి కౌలు పద్ధతి. పండిన పంటలో ఎన్ని వంతులు భూయజమానిది, ఎన్ని వంతులు సాగు చేసిన రైతుది అని నిర్ణయించుకునే పద్ధతిని పాలి అంటారు)చేసిన పోరాటాలు, జాతీయ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులతో పాటు కట్టుబానిసలు వ్యవసాయ కార్మికులుగా మారిన పరిస్థితిని కూడా ఈ వ్యాసంలో వివరిస్తారు.

వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు ప్రారంభ దశలో ఎలా ఉన్నాయనేది ఈ వ్యాసంలో మనకు అర్థమవుతుంది. ఈ సెక్షన్‌లో

**"2002-03 సంవత్సరానికి జరిగిన జాతీయ సమూనా సర్వే సంస్థ అధ్యయనంలో పశ్చిమబెంగాల్‌లో రైతాంగంలో 98 శాతం చిన్న, సన్నకారు రైతాంగం అని నిర్ధారించారు. మొత్తం సాగు భూమిలో 84 శాతం భూమి వీరి చేతుల్లో ఉందని అంచనా వేశారు. భూ సంస్కరణల ద్వారా భూమి కలిగిన వారి సంఖ్య ఈ రాష్ట్రంలో పెరిగినంత విస్తృతంగా మరే రాష్ట్రంలోనూ పెరగలేదని ఈ అంచనాలు రుజువు చేస్తున్నాయి."**

చివరి వ్యాసంలో పశ్చిమబెంగాల్‌లో భూ సంస్కరణల ద్వారా దళితులకు కలిగిన ప్రయోజనాలను వివరించటానికి ప్రయత్నించారు. వ్యవసాయ భూములే కాక ఇళ్ల స్థలాలు కలిగిన కుటుంబాలను కూడా భూమి కలిగిన కుటుంబాలుగా రచయిత పరిగణించారు. 2002-03 సంవత్సరానికి జరిగిన జాతీయ సమూనా సర్వే సంస్థ అధ్యయనంలో పశ్చిమబెంగాల్‌లో రైతాంగంలో 98 శాతం చిన్న, సన్నకారు రైతాంగం అని నిర్ధారించారు. మొత్తం సాగు భూమిలో 84 శాతం భూమి వీరి చేతుల్లో ఉందని అంచనా వేశారు. భూ సంస్కరణల ద్వారా భూమి కలిగిన వారి సంఖ్య ఈ రాష్ట్రంలో పెరిగినంత విస్తృతంగా మరే రాష్ట్రంలోనూ పెరగలేదని ఈ అంచనాలు రుజువు చేస్తున్నాయి. 2004 నాటి పశ్చిమ బెంగాల్ మానవాభివృద్ధి నివేదికను ఉటంకిస్తూ రచయిత 98శాతం చిన్న, సన్నకారు రైతుల్లో దళితులు, ఆదివాసీ ప్రజలే అత్యధికంగా ఉన్నారని చెప్తారు. అంటే భూ పంపకం సమయంలోనే ప్రభుత్వం లబ్దిదారుల్లో అట్టడుగు వర్గానికి చెందిన వారికి సాధ్యమైనంత ఎక్కువ ప్రయోజనం కలిగించే విధంగా చర్యలు చేపట్టిందని అర్థం చేసుకోవచ్చు. ఏడు గ్రామాల్లో భూ పంపిణీ ఫలితాలు, పర్యవసానాల గురించి సాగించిన పరిశోధనలో వెల్లడైన వివరాలను ఈ వ్యాసం తెలియచేస్తుంది.

ఈ సంకలనంలో రెండో భాగం జూడిత్ హేయర్ వ్యాసంతో మొదలవుతుంది. కోయంబత్తూరు, తిరుపూర్ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు వ్యవసాయేతర, పారిశ్రామిక కార్మికులుగా మారుతున్న తీరును మూడు దశాబ్దాల పరిశీలనతో కూడిన అధ్యయ నం ద్వారా జూడిత్ హేయర్ మన ముందుకు తెస్తారు. మూడు దశాబ్దాల అధ్యయనంలో 5 సార్లు శాంపిల్ సర్వే నిర్వహించటం గురించి జూడిత్ వివరిస్తారు. మొదటి రెండు రౌండ్ల సర్వేలో ఒకే కుటుంబాన్ని శాంపిల్ కోసం ఎంపిక చేయగా మూడో దఫా సర్వేలో కొన్ని కొత్త కుటుంబాలను కూడా సర్వే కోసం ఎంపిక చేశారు. మొదటి రెండు దఫాల సర్వేలో స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాల ప్రభావాన్ని అంచనా వేయగా, తదుపరి దఫా సర్వేల్లో ఈ విధానాల వైఫల్యాలను అంచనా వేసేదిగా ఈ పరిశోధనా పత్రం ఉంది. స్థూలంగా చూసినపుడు పారిశ్రామికీకరణ నేపథ్యంలో, ఐదు దశాబ్దాల కాలంలో మారుతున్న గ్రామీణ ప్రాంతాలు, భూమి విలువ, ఉత్పాదకత వంటి అంశాలను జుడిత్ తన పరిశోధన లక్ష్యాలుగా ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఈ సర్వే వివరాలను సామాజిక తరగతుల వారీగా విశ్లేషించటం ఈ వ్యాసం లోని ప్రత్యేకత. గ్రామీణ ప్రాంతాల్లో సేద్యపు పనులకు వ్యవసాయ కార్మికుల కొరత అన్న ప్రశ్నను పరిశీలిస్తూ రచయిత రైతాంగం న్యాయమైన కూలి ఇవ్వటానికి సిద్ధం కాకపోవటం వల్ల వ్యవసాయ కార్మికుల కృత్రిమ కొరత తలెత్తుతోందని, చట్టం నిర్ణయించిన మేరకన్నా వ్యవసాయ కూలి వేతనాలు ఇవ్వటానికి రైతులు సిద్ధమైతే ఈ కొరత తలెత్తదని రచయిత నిర్ధారిస్తారు. రచయిత వ్యవసాయ కార్మికులను నాలుగు ప్రధాన తరగతులుగా విభజిస్తారు. పాలేర్లు, దినసరి వేతన కార్మికులు, చక్కెర కోత తప్ప మిగిలిన పంటల్లో కాంట్రాక్టు పని చేసే వ్యవసాయ కార్మికులు, వలస కార్మికులు అన్న నాలుగు తరగతులు అవి. 1981-82 నాటికి వ్యవసాయ కార్మికుల్లో 39 శాతంగా ఉన్న దళితులు 1996 నాటికి 43 శాతానికి పెరిగారని ఈ పరిశోధన నిర్ధారిస్తుంది. అదేవిధంగా పాలేర్ల వ్యవస్థ - తీవ్రత, విస్తృతిలో వచ్చిన మార్పులను కూడా ఈ వ్యాసంలో పరిశీలిస్తారు. స్థూలంగా సాంప్రదాయ భూస్వామ్య వ్యవస్థ కట్టుబాట్లు, ఆధిపత్యం కోరలనుండి బయటపడి, స్వేచ్ఛగా తమ శ్రమను అమ్ముకోవటానికి అవకాశం ఉన్న వ్యవసాయ కార్మికులు ఆవిర్భవించే ప్రక్రియను జూడిత్ ఈ అధ్యయనంలో మన ముందుంచారు.



గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో దళితు కుటుంబాలు గ్రంథం

సూర్జిత్ రాసిన వ్యాసంలో తమిళనాడులో ఒక గ్రామాన్ని కేంద్రంగా తీసుకుని సాగించిన పరిశోధన వివరాలు వెల్లడవుతాయి. ప్రధానంగా కౌలు పద్ధతుల్లో వస్తున్న మార్పులపై రచయిత దృష్టి కేంద్రీకరిస్తారు. కుల దోపిడీ, వర్గ దోపిడీ జమిలిగా కొనసాగిన తీరును రచయిత ఈ అధ్యయనంలో వెలికి తీస్తారు. దళిత రైతాంగానికి సేద్యం ద్వారా వస్తున్న ఆదాయం, గ్రామంలో వచ్చే వ్యవసాయక ఆదాయాలపై ఈ పరిశోధన చేశారు. 1984తో పోల్చిచూసినపుడు 2003-04 నాటికి సాగుచేయబడుతున్న కమతాల యాజమాన్యం వికేంద్రీకరించబడిందని, అసమానతలు కొద్దిమేరకు తగ్గాయని రచయిత స్పష్టం చేశారు. ఈ వ్యాసంలో భూస్వామ్య కౌలు పద్ధతుల నుండి పెట్టుబడిదారీ కౌలు పద్ధతులకు మారిన తీరును కూడా చారిత్రకంగా పరిశీలిస్తారు. రచయిత కౌలు దోపిడీ తీవ్రతను కౌలు రేట్ల పరిమాణం ఆధారంగా విశ్లేషించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే 1983 నాటికి కౌలు కింద మొత్తం పంటలో 79 శాతం చెల్లించాల్సి ఉండేదని, 2004 నాటికి ఈ భారం తగ్గినా, ఈ తగ్గుదల నామమాత్రమే అని సూర్జిత్ విశ్లేషిస్తారు. దళితుల్లో భూమి సాధించుకోవాలనే చైతన్యం పెరుగుతున్నదని, వారిపై జరిగే సామాజిక దాడికి ఆర్థిక అంశాలు కారణంగా ఉంటున్నాయని రాంకుమార్ అతని సహచరులు మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లాలో జరిగిన ఘటనలను కేస్ స్టడీస్‌గా అధ్యయనం చేసి వివరించారు. స్థూలంగా చూసినపుడు స్వాతంత్ర్యా నంతరం భారత ప్రభుత్వాలు అనుసరించిన వ్యవసాయ సంస్కరణలు, వ్యవసాయ విధానాలు గ్రామసీమలను ఎలా మార్చాయో, గ్రామీణ ప్రాంతంలో వర్గ పొందికలో వచ్చిన మార్పులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవటానికి ఈ సంకలనం ఉపయోగపడుతుంది అనటంలో సందేహం లేదు.

సిద్ధాంతం

# చారిత్రక భౌతికవాదం: పరాయీకరణ సమస్య

టి. ఆర్. క్విగ్‌లీ

19వ శతాబ్దపు జర్మన్ తత్వశాస్త్రం మీద బలమైన ముద్రవేసిన భావవాదాన్ని కారల్ మార్క్స్ సవాలు చేశాడు. మానవ సమాజ పరిణామ క్రమాన్ని ప్రయోగాత్మకంగా అధ్యయనం చేయడం ద్వారా దాన్ని ఒక శాస్త్రంగా మలిచేందుకు కృషి చేశాడు.

మానవజాతి చరిత్రలో భౌతిక పరిణామాలను నిర్ణయించే, నియంత్రించే మానవాతీతశక్తి ఒకటి ఉందని హెగెల్, ప్లేటో వంటి భావవాదులు అభిప్రాయపడ్డారు. ఉదాహరణకు చెప్పుకోవాలంటే పరిశుద్ధాత్మకు మించి పదార్థాన్ని చలనంలో పెట్టే పరిపూర్ణమైన పరమశక్తి ఏదో ఒకటి వుందని అంటాడు హెగెల్. అందుకే మానవ చరిత్రను పరమమైన దానినుండి పదార్థంలోకి మార్పుగా, ఎల్లలు లేని పరిశుద్ధాత్మ సకలజాతి జనుల జీవితాల్లోకి మార్పుగా అంచనా వేసే ప్రయత్నం చేశాడు. హెగెల్ సూత్రీకరణల ప్రకారం ఆ పరమశక్తి మానవుడి అవతారంతో పరిపూర్ణం అవుతుంది.

హెగెల్ ప్రాపంచిక దృక్పథం అంతా సిద్ధాంతంతో మొదలౌతుంది. భగవంతుడికి (లేదూ పరమశక్తి అనండి) సంబంధించిన సైద్ధాంతిక అంచనాలు, ఆ దివ్య ప్రణాళికలో భాగంగా ప్రకృతిని విశ్లేషించడమే హెగెల్ సిద్ధాంతంలో ఉన్న పొరబాట్లు అంటాడు కారల్ మార్క్స్. అందుకే ఈ సిద్ధాంతం అధిగమించలేని మానవ సమాజాల వాస్తవ చరిత్రను పరిశీలిస్తే ఎవరి ప్రాపంచిక దృక్పథమైనా భిన్నంగా వుంటుందని మార్క్స్ అంటాడు. పురాతన సమాజంనుండి ఫ్యూడల్ సమాజం, ఆ తర్వాతి పెట్టుబడిదారీ సమాజ అభివృద్ధి వరకూ వివిధ సమాజాల్లోని ఆర్థిక-సామాజిక-రాజకీయ-చారిత్రక పరిణామాలను మనం నిశితంగా పరిశీలిస్తే సమాజ పరిణామ క్రమం ఒక క్రమపద్ధతిలో జరుగుతున్న వాస్తవం గోచరిస్తుంది అంటాడు మార్క్స్. దీని ఆధారంగానే రాబోయే సమాజం ఎలా వుంటుందో అంచనా వేశాడు.

హెగెల్ విస్తృతమైన, అద్భుతమైన మేధోశక్తితో ఒక ఊహాత్మక తాత్విక వ్యవస్థను ఉనికిలోకి తెచ్చినప్పటికీ అది తన స్వీయ ఆలోచనా పక్షపాతంతో కూడినదైన మూలాన దాన్ని పరిశీలించడానికి గానీ, విమర్శించడానికి గానీ వీలులేకుండా పోయింది. అనుభవవాద సిద్ధాంతం ప్రకారంగానీ, శాస్త్రీయ సూత్ర వివరణల రీత్యాగానీ హెగెల్ సిద్ధాంతం రుజువుకు నిలబడేది కాదు. సత్యశోధనకు ఎవరు పూనుకున్నా ముందు 'ప్రశ్నించడం'తో మొదలవ్వాలి. వాస్తవాల ఆధారంగా సిద్ధాంత రూపకల్పన జరగాలి. అంతే తప్ప అంచనాలు ఊహల ఆధారంగా రూపొందించిన సిద్ధాంతానికి తగినట్లుగా వాస్తవాలను అటూ ఇటూ పొందుపరచలేం. హెగెల్-మార్క్స్‌ల మధ్య జరిగిన సంవాదం హేతుబద్ధతకూ, అనుభవవాదానికీ మధ్యన జరిగిన ఘర్షణే.

### పెట్టుబడిదారీ విధానంతో తంటా

హెగెల్ తత్వాన్ని విమర్శిస్తూనే మార్క్స్, చరిత్రను గతితార్కిక పద్ధతులలో అధ్యయనం చేశాడు. పశ్చిమ దేశాలు ఆర్థిక సంబంధాల ఆధునిక నూతన ఒరవడిగా భావించే పెట్టుబడిదారీ విధానం మానవ స్వభావ సారాన్ని అతిక్రమించేదిగా ఉందని నిర్ధారించాడు. మానవుడు శ్రమజీవి. తన శ్రమద్వారా ప్రకృతినుండి తన అవసరాలకు సరిపడినవి సృజనాత్మకంగా సృష్టించుకుంటాడు. అయితే ఆధునికమైనదిగా చెప్పుకునే పెట్టుబడిదారీ విధానం మానవులను పరిపూర్ణ జీవితం నుండి పరాయీకరిస్తుంది. 'మానవులు తమ అవసరాల కోసం, జీవనానందం కోసం సృష్టించుకునే వస్తువుల ఉత్పత్తి విధానం మీద ఆధిపత్యం చెలాయించడం ద్వారా పెట్టుబడిదారీ విధానం మానవజాతిని పరాయీకరిస్తుంది' అని మార్క్స్ వివరించాడు.

### అసలిలా ఎలా జరిగింది?

పురాతన సమాజాల్లో ప్రజలు తమ తమ ఉత్పత్తి సాధనాలతో ఒక వస్తూత్పత్తి సంవిధానం మొత్తాన్ని పరిపూర్తి చేసేవారు. ఉదాహరణకు చెప్పుకోవాలంటే చేనేత పని చేసేవారు గొర్రెల్ని పెంచడం, వాటి బొచ్చు కత్తిరించడం దానినుండి ఊలు వొలకడం, సొంత మగ్గంమీద బట్ట నెయ్యడం వంటి పనులన్నీ తామే చేసుకొనేవారు. ఆ రకంగా ఉత్పత్తి-పంపిణీల మీద సొంతంగా అజమాయిషీ కలిగి వుండడం ద్వారా తమ శ్రమకు తగ్గ ఫలితాన్ని తామే పొంది అనుభవించేవారు.

అదే ఫ్యూడల్ సమాజాల్లోకి వచ్చేసరికి ఉత్పత్తి సాధనాలు, సరుకుల ఉత్పత్తి ద్వారా ఏర్పడిన మిగులు విలువలను రాజరిక స్వామ్యం సొంతం చేసుకునేది. అయితే వాణిజ్యం పెరగడం, నూతన మార్కెట్ ఆధారిత ఆర్థికవ్యవస్థ ఏర్పడడంతో వాటి అవసరాలకు అనుగుణంగా ఉత్పాదకత, నైపుణ్యాలు కూడా అభివృద్ధి కాజొచ్చాయి. రాన్రాను సంపద, ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యమూ వ్యాపారవేత్తలు, వాణిక్ ప్రముఖులు, చిన్న పారిశ్రామికవేత్తల చేతుల్లో పోగుడపడడంతో ఉత్పత్తి సాధనాల మీద ఆధిపత్యం చలాయించే యాజమాన్యవర్గం ఏర్పడింది. ఈ వర్గం ప్రజలను కేవలం తమ శ్రమను అమ్ముకునే కార్మికవర్గంగా మిగిల్చింది. ఈ క్రమంలోనే 'శ్రమ' కూడా ఒక సరుకుగా మారి ఉత్పత్తి సాధనాల మీద మాదిరే శ్రమ మీద కూడా యాజమాన్యవర్గం తమ ఆధిపత్యం సాధించింది. (ఈ ఆధిపత్యం ఉత్పత్తి సంబంధాల్లో భాగమే అని మార్క్స్ అభివర్ణించాడు)

కొత్తగా వచ్చిపడిన ఈ పరిస్థితులలో

కార్మికుడికి మగ్గం మీద పనిచెయ్యడం తప్ప ఆ ఉత్పత్తి మీద కాని దాని పంపిణీమీద కాని ఎలాంటి జమాయిషీ లేకుండా పోయింది. ఆ రకంగా కార్మికుడి శ్రమను, శ్రమ ఫలితం నుండి వేరుచేసి శ్రమను సరుకుగా కొనుక్కున్నందుకు గాను కొంత రొక్కం ముట్టచెప్ప సాగింది యాజమాన్యవర్గం. కార్మికుల శ్రమద్వారా ఒనగూడిన అదనపు విలువను (లాభాలు) ఉత్పత్తి సాధనాల మీద ఆధిపత్యం చెలాయిస్తున్న యాజమాన్యవర్గం దిగమింగసాగింది. ఆ రకంగా సకల చేతివృత్తుల వారూ సృష్టించిన వస్తువులు, సరుకులూ వారికి పరాయివిగా మారిపోయాయి. మార్క్స్ ఉదహ రించిన శ్రమ పరాయికరణను ఇలా సంక్షిప్తీ కరించుకోవచ్చు మనం:

1. పెట్టుబడిదారీ వ్యవస్థలో మానవ శ్రమ స్వీయ ప్రయోజనాలు, స్వీయ ఆసక్తులమీద నడవదు.

2. కాబట్టి అట్లాంటి శ్రమ మానవుడికి ప్రేరణగాని సంతృప్తినిగాని ఇచ్చేది కాదు. ఈ పని నా 'సొంతం' అన్న భావన కలగదు. మానవ ప్రకృతికి విరుద్ధంగా చేసే శ్రమయే అతడిని/ఆమెను పరాయీకరిస్తుంది.

3. విశ్రాంతి సమయంలో మాత్రమే మానవుడు తన జీవితాన్ని తనదిగా ఆస్వాదిస్తాడు.

4. ఈ పని చట్రంలో శ్రమ స్వాంతన కలిగించదు. ఎవరి కోసమో పని చేస్తున్నాననే భావన, ఒక్కోసారి తాను ఎవరికోసం పనిచేస్తున్నానో కూడా తెలియని పరిస్థితి.

5. మానవుడు జంతువుల మాదిరి తినడానికి, తాగడానికి పునరుత్పత్తి చెయ్యడానికి మాత్రమే విశ్రాంతి సమయం దొరికి, అదే జీవితంగా మారిపోవడం.

6. స్వంతంగా తనకు ఇష్టంవచ్చిన పని చేసుకునే దానికి లేకుండా, జీవన నైపుణ్యం దిగజారిపోవడం


7. పరాయీకరించబడిన శ్రమద్వారా కొందరు మాత్రం వ్యక్తిగత ఆస్తులు పోగేసుకోవడం.

ఇవన్నీ పరాయీకరణకు దారితీసే అంశాలు. పరాయీకరణ మనిషి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, స్వయం నిర్ణాయక శక్తిని హరించివేస్తుంది. మనిషి స్వీయ ఆస్తులను, ఆనందాలను చంపేస్తుంది.

**చారిత్రక భౌతికవాదం మౌలిక లక్షణం**

జీవితంలో ఎదురయ్యే పదార్థ – ఆర్థిక సంబంధాలు మనిషి చైతన్యాన్ని నిర్దేశిస్తాయి. అంటే ఆ రాజ్యం యొక్క స్వభావం, అందలి సామాజిక పరిస్థితులు, రాజకీయ, న్యాయ, చట్టపరమైన నిర్మాణాలు–సామాజిక, ఆర్థిక, నైతిక ప్రాపంచిక దృక్పథాలు, ఇవన్నీ పాలకశక్తుల ఆధిపత్య భావజాలానికి లోబడి అందలి ప్రజలమీద ప్రభావం చూపిస్తుంటాయి.

> **" శ్రమను సరుకుగా మార్చడం మూలంగానే మానవుడి సృజనాత్మక శక్తి హరించుకుపోతుందని మార్క్స్ వివరించాడు. అంటే ఒక మనిషి చేసే శ్రమకు కూలీగా ఇంత సొమ్ము అని ముట్ట చెప్పడం ద్వారా ఆ కార్మికుడు తన శ్రమ ఫలితాన్ని తాను అనుభవించే దానికి లేకుండా ఎవరికో లాభాలు సంపాదించిపెట్టే దానికి సాధనంగా మారిపోతాడు మనిషి. "**


కారల్ మార్క్స్

**నైతిక పునాది**

ఆధునిక సమాజాల్లో వున్న ప్రధాన సమస్య వనరుల అసమాన పంపిణీ, ఉత్పత్తి సాధనాల మీద అసమాన అజమాయిషీ అని కార్ల్ మార్క్స్ వివరించాడు. ఇందుకు పరిష్కారం ఉత్పత్తి సాధనాలను సామాజీకరించడం, ఉత్పత్తి సాధనాలమీద కార్మికవర్గం ఆధిపత్యం సాధించడం అని స్పష్టం చేశాడు. మార్క్స్ ప్రపంచీకరించిన ఆదర్శ రాజ్యానికి సమానత్వ సూత్రమే ప్రాతిపదిక. ప్రతి మనిషీ తన జీవితాన్ని ఆనందమయంగా గడిపే సమానత్వం ఆశించాడు మార్క్స్. అంటే దానర్థం మానవుల జీవితాలన్నీ మూసబోయినట్లు ఒకే తీరుగా వుంటాయనిగానీ, అందరికీ తలకొట్టినట్లు, సమాన వనరులు – సమాన ఆధాయాలు ఉంటాయనిగానీ కాదు. ప్రతి మనిషికీ తనదైన నైపుణ్యం, ఆసక్తులు, సామర్థ్యాలు వుంటాయి. వాటిని వినియోగించుకొని ఎవరిదైన జీవితం వారు ఆనందదాయంగా, పరిపూర్ణంగా జీవించగలుగుతారు. ప్రకృతి సూత్రం చెప్పేది అదే. మార్క్స్ చెప్పే సమానత్వ సూత్రానికి ఆలంబన ఏమిటంటే అందరికీ సమాన అవకాశాలు కల్పించడం ఎవరికీ దేనిమీదా ఆధిపత్యానికి అవకాశం లేకుండా చూడడం, సహకార జీవితం సంఘనీతిగా మలచడం, సృజనాత్మకంగా జీవితాన్ని ఆస్వాదించడం.

**అదనపు విలువ–సరుకీరణ**

శ్రమను సరుకుగా మార్చడం మూలంగానే మానవుడి సృజనాత్మక శక్తి హరించుకుపోతుందని మార్క్స్ వివరించాడు. అంటే ఒక మనిషి చేసే శ్రమకు కూలీగా ఇంత సొమ్ము అని ముట్ట చెప్పడం ద్వారా ఆ కార్మికుడు తన శ్రమ ఫలితాన్ని తాను అనుభవించే దానికి లేకుండా ఎవరికో లాభాలు సంపాదించిపెట్టే దానికి సాధనంగా మారిపోతాడు మనిషి.

ఉదాహరణకి కుర్చీలు తయారుచేసే ఒక మనిషినే తీసుకోండి... అతను తన కుటుంబ అవసరాలకు సరిపడా కుర్చీలు తయారు చేస్తాడు. తన కుటుంబం గడవడానికి అవసరమైన ఖర్చులూ గడిస్తాడు. అదనంగా ఇంకొన్ని కుర్చీలు తయారు చేస్తాడు. ఇలా అదనంగా తయారు చేసిన కుర్చీల అదనపు విలువను సృష్టిస్తాయి. అతని అవసరాలకు మించినదంతా అదనపు విలువయే. కుర్చీలు తయారీమీద ఎవరికి ఆధిపత్యం వుంటే ఈ అదనపు విలువ పంపిణీ మీద కూడా వాళ్ళకే అధికారం వుంటుంది.

1) రాజ్యం ఆధిపత్యం లేకుండా వున్న సమాజాల్లో ఉత్పత్తి మీద ఏ మనిషికి ఆ మనిషి నియంత్రణ వున్నప్పటి పరిస్థితుల్లో అదనపు విలువను తనకి ఇష్టమైన రీతిలో మారకం వేసుకోవచ్చు. అమ్ముకోవచ్చు. నచ్చిన వారికి బహుమతిగా ఇచ్చుకోవచ్చు.

2) అదే ఫ్యూడల్ వ్యవస్థలో అయితే

> **❝ పెట్టుబడిదారీ విధానంలోని ప్రధాన వైరుధ్యం ఉత్పత్తి సాధనాల మీద ఆధిపత్యం వున్నవారికీ (బూర్జువా/పెట్టుబడిదారు), శ్రమశక్తి మినహా అమ్ముకోవడానికి వేరే ఆగత్యం లేని శ్రమజీవులకూ (కార్మికవర్గానికి) మధ్యన ఉంటుంది. ఈ వైరుధ్యాల మధ్య ఘర్షణ సామాజిక సంఘర్షణకు దారి తీస్తుంది. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అయ్యే కొలదీ ఈ వైరుధ్యాలు మరింత పదునెక్కుతాయి. ❞**

కార్మికులు జీవితావసరాలు గడుపుకోవడం కోసం ఏ భూస్వాముల మీదనో, ఆసాముల మీదనో ఆధారపడి బతకాలి. దానికోసం వాళ్ళు చెప్పిన పనల్లా చెయ్యాలి. ఈ వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలు, పంపిణీ, మిగులు విలువ అన్నీ భూస్వాముల ఆధీనంలో వుంటాయి.

3) ఇక పెట్టుబడిదారీ వ్యవస్థలోనయితే కార్మికులను యజమాని పనికి కుదుర్చుకుంటాడు. అతను చేసే పనికి రోజువారీ కూలీ అనో, నెల జీతమనో కుదుర్చుకుంటాడు. స్వతంత్రంగా పనిచేస్తే ఆ కార్మికుడు రోజుకి ఎన్ని కుర్చీలు తయారు చేస్తాడో పన్లో కుదురుకుని కూడా అన్నే కుర్చీలు తయారు చేస్తాడనుకుంటే 'మిగులు విలువ'కు సరిపడా కుర్చీలు యజమాని సొంతం అవుతాయే తప్ప కార్మికుడికి అదనంగా ఒనగూడేది ఏమీ వుండదు. యజమానికి దక్కిన ఈ 'మిగులు విలువ'యే అతనికి లాభాలు తెచ్చిపెడుతుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో యజమాని స్వలాభం ఈడేర్చేదిగా ఉత్పత్తి విధానం వుంటుంది.

యజమానికి ఇబ్బడిముబ్బడిగా లాభాలు తెచ్చిపెట్టేదానికి రకరకాల పద్ధతులను వాడకంలోకి తీసుకొస్తారు.

– ఖర్చుల తగ్గించుకోవడం, ఇందులో ప్రధానంగా కార్మికులకు చెల్లించే కూలో/వేతనాలు తక్కువగా వుండేలా చూసుకోవడం

– ఉత్పాదకత పెంచడం – అంటే కార్మికుడి మీద పనిభారం పెంచడం

– సరుకులకు డిమాండు పెంచడం

పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికుడి శ్రమను కూడా ఒకే 'సరుకు'గా మార్చేస్తారు. ఇలా కార్మికుడి శ్రమని సరుకుగా మార్చడమంటే భౌతికంగా, నైతికంగా ఆ కార్మికుడిని దోచుకోవడమే.

– ఏ వ్యక్తయినా తన శ్రమద్వారా సృష్టించే సరుకులను, ఉత్పత్తులను స్వీయ ఆర్థిక ప్రయోజనాలకోసం వినియోగించుకోలేకపోవడమే అందులో ఇమిడి వున్న భౌతిక దోపిడీ

– కార్మికుడి ఉత్పాదక సామర్థ్యాన్ని పనిలో సృజనాత్మకతను, రసాస్వాదాన్ని దోచుకోవడం అనైతిక దోపిడి. కార్మికుడిని కూడా ఉత్పత్తి సాధనంగా మలిచి వెయ్యడమే పెట్టుబడిదారీ వ్యవస్థ అసలు సిసలు దుర్మార్గం. ఇంతా చేసి మానవుడి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల గురించి అదే దుర్మార్గపు వ్యవస్థ చిలుక పలుకలు వల్లించడం అంతకన్నా పరమ దుర్మార్గం.

### పునాది–ఉపరితలం

పనికి సంబంధించి పెట్టుబడిదారీ వ్యవస్థ కొన్ని సూత్రీకరణలు చేస్తుంది.

– బలమైన పని సంస్కృతి

– క్రమశిక్షణ, రుజువర్తన

– ఆర్థికాభివృద్ధి, సంపద పోగువేత

– వ్యక్తిగత స్వేచ్ఛ

పైకి (ఉపరితలంలో) కనిపించే ఈ విలువలన్నీ పునాదిలో వున్న యజమాని–కార్మికుల మధ్య వుండే ఆర్థిక సంబంధాల ప్రతిఫలనమే. ఇవన్నీ దోపిడీ వ్యవస్థ మనుగడను కొనసాగించడానికి ఉపకరించేవే అంటాడు మార్క్స్.

ఉపరితలంలో ప్రతిఫలించే పునాది, సంబంధాల్లో వైరుధ్యాలను పరిష్కరించడం ద్వారా 'సామాజిక మార్పు' సాధ్యమని మార్క్సిజం వివరిస్తుంది.

### పెట్టుబడిదారీ విధానం

"వ్యక్తిగత ఆస్తిమీద ఆధారపడిన ఉత్పత్తి విధానం, ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తుల పంపిణీ మరియు డబ్బు చలామణి ఇవన్నీ బూర్జువా పరిపాలనలో వుండే ఆర్థిక వ్యవస్థ లక్షణాలు. బడా బూర్జువాలు, పెటీ బూర్జువాల మధ్య వుండే తారతమ్యాలను మార్క్స్ స్పష్టంగా నిర్వచించాడు. బడా బూర్జువాలు అంతర్జాతీయ స్వభావం కలిగి వుండి, భారీ ఉత్పత్తి సాధనాల నియంత్రణ, అభివృద్ధి కలిగి వుండి ప్రపంచ మార్కెట్‌లో ఒక బ్రాండ్ ఇమేజ్‌తో వ్యాపారం చేస్తుంటారు. పెటీ బూర్జువాలు, చిరు వ్యాపారులు. వృత్తి నైపుణ్యం గలవాళ్ళు పెట్టుబడిదారీ విధానంలోని అంతర్గత ధోరణులు, వైరుధ్యాల పర్యవసానంగా అనివార్యంగా ఏదో ఒక నాటికి కార్మికవర్గంలోకి దిగజారిపోతారు.

పెట్టుబడిదారీ విధానంలోని ప్రధాన వైరుధ్యం ఉత్పత్తి సాధనాల మీద ఆధిపత్యం వున్నవారికీ (బూర్జువా/పెట్టుబడిదారు), శ్రమశక్తి మినహా అమ్ముకోవడానికి వేరే ఆగత్యం లేని శ్రమజీవులకూ (కార్మికవర్గానికి) మధ్యన ఉంటుంది. ఈ వైరుధ్యాల మధ్య ఘర్షణ సామాజిక సంఘర్షణకు దారితీస్తుంది. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అయ్యే కొలదీ ఈ వైరుధ్యాలు మరింత పదునెక్కుతాయి. అతికొద్దిమందిగా వున్న యాజమన్య శక్తులకు – అపారమైన శ్రామికశక్తికి మధ్యగల వైరుధ్యం తీవ్రమై పెట్టుబడిదారీ విధానాన్ని కుప్పకూల్చేస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం కూడా స్వయంగా సంక్షోభాలమయమైందని మార్క్స్ సోదాహరణంగా వివరించాడు. యంత్రాలమీద పెట్టాల్సిన పెట్టుబడులు పెరిగినకొలదికీ యజమానుల లాభాలరేటు తగ్గుముఖం పడుతుంది. దానితో వాళ్ళు అనివార్యంగా ఈ నష్టాన్ని కార్మికుల పనిగంటలు పెంచో, కొంతమందిని ఉద్యోగాల నుండి తొలగించే పనిభారం పెంచో, జీతాలు స్తంభింపజేసో లేక తగ్గించో పూడ్చుకునే దానికి చూస్తారు. ఇదొక విషవలయంలా కొనసాగుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రణాళికా బద్ధమైనది కాకపోవడం, ప్రజలకు కొనుగోలుశక్తి తగ్గిపోవడంతో ఉత్పత్తి పెరిగిపోయి, వినియోగం తగ్గిపోయి ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుంది.

ఈ సంక్షోభాలు తీవ్రతరమై పెట్టుబడిదారీ వ్యవస్థ కూలిపోతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభాలకు దారితీసే పరిస్థితుల వరకూ మార్క్స్ దార్శనికతతో ఏకీభవించేవారు కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ కూలిపోతుందనే అంశంతో మాత్రం విబేదిస్తుంటారు.

అలా కూలిపోవాలనేం లేదు, పెట్టుబడదారీ వ్యవస్థ చట్రంలోనే క్రమానుగతంగా సామాజికీకరణకు పెద్దపీట వెయ్యడం, ఆర్థిక శక్తులు ప్రజాతంత్రయుతంగా అభివృద్ధి అయ్యేలా చూడడం వంటి మానవీయ పెట్టుబడిదారీ ప్రత్యామ్నాయాలను ఎన్నో చూపుతుంటారు. పైకి ఎంత ఆదర్శప్రాయంగా వున్నా వీరంతా పెట్టుబడిదారీ వ్యవస్థ చేసే దోపిడీ యథాతథంగా కొనసాగాలని కోరుకునేవాళ్లే.

**('ది పోర్టబుల్ కార్ల్ మార్క్స్' నుండి
అనువాదం: సత్యరంజన్)**

## సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

# నిరాశాజనక వాతావరణం తొలగిపోయే పరిస్థితులు వస్తున్నాయి

**ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారు మాత్రమే పని చేయాలా? మాజీ ప్రజా ప్రతినిధులు ప్రజల కోసం పనిచేయవద్దా? కొత్తవారికి అవకాశమిచ్చి చేతు లు ముదుచుకొని కూర్చోవాలా? దయచేసి దీనికి సరైన సమాధానం తెలియజేయగలరని మనవి.**

**- పి. పద్మావతి,**
భ్రమరాంబిక కాలనీ, మెదక్

ప్రజాసేవకు పదవులే ఉండాల్సిన అవసరంలేదు. ఏ పదవీ లేకుండా ప్రజాసేవ చేయటం పదవిలో ఉండి చేయటం కన్నా గొప్ప విషయం. అందువల్ల మాజీ ప్రజా ప్రతినిధులు పదవి లేనందువల్ల ప్రజాసేవ చెయ్యలేరనుకోవటం సరి కాదు. లేకపోయినా చేయగలగాలి. ప్రజా ప్రతినిధిగా ఎన్నికైన వారు ఆ పదవిని ఉపయోగించుకుని అదనంగా ప్రజలకు సేవ చేసే అవకాశం ఉంటుంది. అలా వినియోగించుకుంటేనే నిజమైన ప్రజా ప్రతినిధి అవుతారు. వ్యక్తిగత ప్రయోజనాలకో, స్వార్థానికో పదవిని ఉపయోగించుకుంటే ఏ ప్రజా ప్రతినిధికీ గౌరవం ఉండదు. అందులో కమ్యూనిస్టు పార్టీ తరఫున ఎన్నికైన ప్రజా ప్రతినిధులు పదవిని ప్రజల కోసమే సంపూర్ణంగా వినియోగించటానికి సిద్ధమైన వారు. అటువంటి వారిపై మరింత ఎక్కువ బాధ్యత ఉంటుంది. పార్టీ తరఫున ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారు రెండు దఫాలు ఎన్నికైన తరువాత పోటీ చేయకుండా విరమించుకుని కొత్త వారికి అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. ఇది మంచి విషయమే తప్ప బాధపడాల్సిందేమీ కాదు. సుదీర్ఘకాలం ప్రజా పతినిధులుగా, ప్రభుత్వ హోదాలలో కొనసాగినప్పుడు పొరపాటు ధోరణులు పెరిగే అవకాశం ఉంటుంది. ప్రజలకు అందుబాటులో లేకుండా దూరమయ్యే అవకాశం కూడా ఉండవచ్చు. ఇందుకు కొద్దిమంది మినహా యింపుగా ఉన్నా, మన అనుభవం కూడా దీర్ఘ కాలం ప్రజా ప్రతినిధులుగా ఉన్నవారిలో అన్యవర్గ ధోరణులు పెరుగుతున్నాయని స్పష్టం చేస్తున్నది. అందుకే పార్టీ ప్రజా ప్రతినిధుల కాలానికి పరిమితి విధించింది. అందువల్ల ప్రజాప్రతినిధులుగా లేకపోవటం అంటే చేతులు ముడుచుకుని కూర్చోవటం అని ఎవరూ భావించాల్సిన పని లేదు. పదవి ఉంటే ప్రజాసేవ, లేకపోతే చేతులు ముడుచుకుని కూర్చోవటం అనుకోవటం చాలా తప్పు.

**సిపిఎం-సిపిఐ కలిసిగానీ, విడివిడిగా గానీ సమాజానికి మంచి చెయ్యాలని ఎంతగానో ప్రయత్నిస్తున్నాయి. కానీ ప్రజలు ఎక్కువశాతం మంది మనల్ని ఆదరించడం లేదు. ఎందుకనీ? మనం సమాజానికి మంచి విధానపరమైన ఆలోచనల్ని అందించలేకపోతున్నామా? లేక ప్రజలకు అర్థంగాకనా? లేక పెట్టుబడిదారీ విధాన రాజకీయాల ముందు వామ పక్ష విధానాలు ప్రజలకు నచ్చకనా?**

**'కార్పొరేట్‌ల శక్తులు, మీడియా' కలిసి దేశాన్ని పాలించే నాయకులను తయారు చేశాయి. భవిష్యత్తులో మనం ప్రజల ఆదరణ పెంచుకోవాలంటే ఏ విధానపరమైన ఆలోచనలను ప్రజలలోకి పంపించాలి? తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.**

**- కంచుమర్తి కాటమరాజు,**
చిన్న బ్రహ్మదేవం,
పెద్దాపురం మండలం, తూ.గో.జిల్లా.

నేడు ప్రపంచ వ్యాప్తంగా వామపక్ష అభ్యుదయ రాజకీయాలకు ఆకర్షణ తగ్గిందనేది వాస్తవం. ఇందుకు అనేక పరిస్థితులు దోహదం చేశాయి. 1990 తరువాత కొన్ని సోషలిస్టు దేశాలలో సోషలిజం దెబ్బతిని పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణ కావటానికీ, మార్క్సిజం, సోషలిజం పట్ల మేధావి వర్గాలలో, యువతరంలో కొంత అపనమ్మకం పెరగటానికి దారితీసింది. పెట్టుబడిదారీ విధానం శాశ్వతమేమో, దానికి ప్రత్యామ్నాయం లేదేమో అన్న అభిప్రాయాలు బలపడ్డాయి. దీనికి తోడు 1990వ దశకంలో ప్రపంచ వ్యాప్తంగా ఉదారవాద ఆర్థిక విధానాల పేరుతో కొత్త పెట్టుబడిదారీ దశ ప్రారంభమైంది. మార్కెట్ శక్తులే సర్వస్వం అన్న అభిప్రాయాలు విస్తరించాయి. ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం, ప్రచార, ప్రసార సాధనాలు ఇంటర్నెట్ వ్యాప్తి ప్రజల మనోభావాలపై పట్టును బిగించాయి. పెట్టుబడిదారీ సిద్ధాంతం అన్ని రంగాలలో విస్తృతంగా స్థిరపడేటట్లు ఈ మార్పు దోహదం చేసింది. దీనికి తగ్గట్టుగా మార్క్సిస్టు, అభ్యుదయ భావజాలం పోటీగా ముందుకు రాలేకపోయింది. వినిమయవాదం యువతరంలో విస్తారంగా వ్యాపించటంతో భవిష్యత్ కన్నా తక్షణం అనుభవించటం మీద ఆసక్తి పెరిగింది. ఈ పరిస్థితులు సహజంగా భవిష్యత్ సమాజంపై దృష్టి పెట్టే మార్క్సిజం పట్ల అనాసక్తి కలిగించటంలో ఆశ్చర్యం లేదు.

అయితే శాశ్వతం అనుకున్న ఈ పరిస్థితులు 2008 ప్రపంచవ్యాప్త ఆర్థికసంక్షోభం తరువాత మారాయి. పెట్టుబడిదారీ విధానం ప్రజల సమస్యలను పరిష్కరించలేదని, కొంతకాలం మిరుమిట్లు గొలిపే అభివృద్ధిని చూపించినా ఆ తరువాత తీవ్రమైన సంక్షోభంలో పడుతుందని మార్క్స్ ఏనాడో చెప్పిన అంచనా అక్షరాలా నిజమని మళ్లీ ఆలోచించే పరిస్థితి వచ్చింది. ఈ మధ్య కాలంలో లాటిన్ అమెరికా మొదలు ప్రపంచ దేశాలన్నింటా మళ్లీ అభ్యుదయ, సోషలిస్టు భావాల వ్యాప్తి పెరిగింది. ఈ భావాలకు ప్రాతి నిధ్యం వహించే శక్తులు అభివృద్ధి చెందుతు న్నాయి. ఈ పరిణామం రాబోయే కాలంలో ఇంకా వేగం పుంజుకుంటుంది.

పైన వివరించిన పరిణామాలకు మన దేశం కూడా మినహాయింపు కాదు. 1991 నుండి ఇక్కడ సరళీకరణ విధానాలు అమలు జరుగుతున్నాయి. ఆర్థికాభివృద్ధి చాలా వేగంగా జరుగుతున్నట్టుగా ఈ కాలంలో అందరికీ భ్రమలు కలిగాయి. వామపక్షాలు, ప్రజా ఉద్యమాలు, అవసరం లేదన్న భావం మధ్య తరగతి మేధావుల్లో వ్యాపించింది. దీని ప్రభావం వామపక్షాలకు ఎన్నికల్లో ఎదురుదెబ్బల రూపంలో వ్యక్తమైంది. కానీ 2012 తరువాత మన దేశం కూడా ఆర్థిక మాంద్యంలో పడింది. ఇప్పటికీ దాని నుండి కోలుకోలేదు. కాంగ్రెస్ నాయకత్వంలో యుపిఎ ప్రభుత్వం సంస్కరణలను సమర్థవంతంగా, వేగంగా, లోతుగా అమలు చేయలేదనీ, ప్రజలను కఠినంగా అదుపులో పెట్టలేదనీ, తామైతే సంస్కరణలు మెరుగ్గా అమలు చేస్తామనీ బి.జె.పి. నమ్మకం కలిగించింది. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల అండదండలు సంపాదించి, మతతత్వ భావాలను వినియోగించుకుని బిజెపి, దాని మిత్రులు అధికారంలోకి వచ్చారు. ఎనిమిది నెలలు కావస్తున్నా బి.జె.పి పాలనలో కూడా ఆర్థిక పరిస్థితిలో మార్పు కన్పించటం లేదు. అందువల్ల దేశంలో కూడా సంస్కరణల పట్ల మార్కెట్ ఆర్థిక వ్యవస్థ పట్ల ఇప్పుడిప్పుడే అనుమానాలు ప్రబలుతున్నాయి. ప్రజలు మళ్లీ ఉద్యమాల పట్ల, అభ్యుదయ భావాల పట్ల ఆసక్తి చూపే పరిస్థితి ఏర్పడుతోంది. అయితే బి.జె.పి, సంఘపరివార్ శక్తులు ఇప్పటి నుండే సమాజంలోని అన్ని పార్శ్వాలను కాషాయీకరణ చేయటం ద్వారా ఇటువంటి పాలకవర్గాలకు ప్రమాదం రాకుండా నిరోధించే ప్రయత్నం చేస్తున్నాయి. అయినా రాబోయే కాలంలో ప్రజలు అభ్యుదయకరమైన మార్పు వైపు మరలటాన్ని నిరోధించటం సాధ్యం కాదు. అయితే ఇది వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఐక్యమై చురుగ్గా ఉద్యమాలను, పోరాటాలను, సైద్ధాంతిక ప్రచారాన్ని ఉధృతంగా నిర్వహించినపుడే సాధ్యమవుతుంది. అటువంటి ప్రయత్నం

లో భాగంగానే వామపక్షాలు అఖిల భారత స్థాయిలో ఒకే వేదికపైకి వస్తున్నాయి. ఇంకా అభ్యుదయ శక్తులను కూడా కూడగడుతున్నాయి. ఇప్పటి వరకూ ఉన్న నిరాశాజనక వాతావరణం తొలగిపోయే పరిస్థితులు వస్తున్న తరుణంలో అభ్యుదయ శక్తులు ద్విగుణీకృత ఉత్సాహంతో కృషిచేయాల్సి ఉంది.

**విజయవాడ సెంటర్ స్టడీసర్కిల్‌లో వచ్చిన ప్రశ్నలు....**

**పెట్టుబడిదారీ విధానం బాగా అభివృద్ధి చెందిన తర్వాత, పెట్టుబడిదారులకు, కార్మికులకు పోరాటం తీవ్రమైనపుడు ఫాసిజం వస్తుంది. మనదేశంలో ఫ్యూడలిజం పూర్తిగా నాశనం కాకుండా, పెట్టుబడిదారీ విధానం పూర్తిగా అభివృద్ధి కాకుండానే ఫాసిజం రావటానికి అవకాశం ఉందా?**

పెట్టుబడిదారీ విధానంలో రాజ్యం బూర్జువా వర్గ నియంతృత్వం అని మార్క్సిజం చెబుతుంది. ఈ బూర్జువా వర్గ నియంతృత్వం పరిస్థితులను బట్టి అనేక రూపాలలో ఉండవచ్చు. పెట్టుబడిదారీ వర్గానికి ఎటువంటి ఇబ్బందులూ లేనపుడు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రూపంలో వుంటుంది. కొన్ని సందర్భాలలో నిరంకుశ వ్యక్తులు నియంతృత్వం ద్వారా పరిపాలన చేసే రూపంలో ఉండవచ్చు. కొన్ని తీవ్రమైన పరిస్థితుల్లో అత్యంత క్రూరమైన హింసాయుతమైన నిరంకుశమైన ఫాసిజం రూపంలో ఉండవచ్చు. ముఖ్యంగా కార్మికోద్యమం బలంగా ఉండి విప్లవం వచ్చే ప్రమాదం ఉందని పెట్టుబడిదారీ వర్గం భయపడినపుడు ఫాసిస్టు రూపంలో తమ పెట్టుబడిదారీ వ్యవస్థను రక్షించుకునే ప్రయత్నం చేస్తుంది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఇటలీ, జర్మనీలలో ఇటువంటి ఫాసిస్టు రాజ్యాలు ముసోలిని, హిట్లర్ నాయకత్వాన ఆవిర్భవించాయి. రెండో ప్రపంచ యుద్ధంలో సోవియట్ ఎర్ర సైన్యం అశేష త్యాగాల ఫలితంగా, ఫాసిస్టు సేనలు ఓడిపోయిన తరువాత ఫాసిస్టు రాజ్యాలు అంతరించాయి. మళ్లీ పరిస్థితులు మారి పెట్టుబడిదారీ వర్గానికి ప్రమాదం ఏర్పడినపుడు ఫాసిస్టు రాజ్యం రూపాలలో రావని ఏమీ లేదు. అయితే ప్రతి నిరంకుశ ప్రభుత్వాన్నీ ఫాసిస్టు ప్రభుత్వం అని అనకూడదు.

మన దేశంలో ఇప్పుడు బిజెపి, సంఘ పరివార్ ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ఫాసిజం వచ్చిందని అనేక మంది అభిప్రాయపడుతున్నారు. ఫాసిజానికి వుండే కొన్ని లక్షణాలు ప్రస్తుత బిజెపి పరిపాలనకు వున్నాయనే దాంట్లో సందేహం లేదు. మతోన్మాదాన్ని ప్రోత్సహించటం, మైనార్టీలకు మానవ హక్కులు కూడా నిరాకరించాలనటం, మత కలహాలను రెచ్చగొట్టటం, పితృస్వామిక వ్యవస్థను బలపర్చటం, ఉద్యమాలను, పోరాటాలను నిరంకుశంగా అణచివేయటం, సాంస్కృతిక రంగంలో భిన్నాభిప్రాయాలను హింసాత్మకంగా అణచివేయటానికి ప్రయత్నించటం, ఇటువంటి లక్షణాలు ఫాసిజంలో మనకు కనిపిస్తాయి. అయినా కార్మికవర్గ విప్లవం నుండి ప్రమాదం ఏర్పడినందున ఈ లక్షణాలు ముందుకు వచ్చాయని చెప్పలేం. సంస్కరణలను వేగంగా అమలు జరపటం కోసం రాజ్యాన్ని కఠినంగా వినియోగించటంలో భాగంగా ఇది జరుగుతున్నది. సరళీకరణ సంస్కరణలకు ప్రజాస్వామ్యం అనేది ఆటంకం అని భావించటం వల్ల ఈ నిరంకుశ ధోరణులు ప్రబలుతున్నాయి. మన దేశంలో ఫ్యూడల్ అవశేషాలు కూడా బలంగా ఉన్న నేపథ్యంలో నిరంకుశ పోకడలకు మరింత ఊతం దొరుకుతోంది.

ఐరోపాలో ఆవిర్భవించిన ఫాసిజం వంటి రూపంలో ప్రస్తుత బిజెపి, సంఘ పరివార్ పరిపాలన ఉన్నదా లేదా అనేది అంత పెద్ద విషయం కాదు. మన దేశంలో ప్రస్తుతం ప్రజాస్వామ్యానికి, ప్రజలకు ప్రమాదకరమైన ఫాసిస్టు ధోరణులు ఉన్నాయనేది ముఖ్యం. అందువల్లే ఈ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడటం అందరి అత్యవసర కర్తవ్యం.

**పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందితే కార్మికవర్గం పెరిగి పోరాటాలు శక్తివంతంగా జరుగుతాయను కుంటున్నాం. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నందున కార్మికుల సంఖ్య తగ్గుతున్నది. ఇటువంటి స్థితిలో కార్మికవర్గం బలమైన పోరాటాలు చేయటం సాధ్యమవుతుందా?**

పెట్టుబడిదారీ విధానం విస్తరించేకొద్దీ ఒక వైపున పెట్టుబడిదారులు, మరోవైపున కార్మికులు ప్రధానమైన వర్గాలుగా ఆవిర్భవిస్తారు. వారి సంఖ్యాబలం కన్నా ఆర్థికవ్యవస్థలో వారి పాత్ర కీలకమైన అంశం. ప్రపంచంలో అభివృద్ధిచెందిన దేశాల్లో నూటికి 90 మంది ప్రజలు వ్యవసాయేతర రంగాల్లో ఉంటున్నారు. ఉదాహరణకు అమెరికాలో వ్యవసాయంమీద ఆధారపడి ఉన్న ప్రజలు రెండు, మూడు శాతం కూడా లేరు. వ్యవసాయం కూడా ఆధునిక పెట్టుబడిదారీ పద్ధతిలోనే జరుగుతున్నందున వ్యవసాయ శ్రామికులను కూడా కార్మికులుగానే పరిగణించవచ్చు. అయితే పెట్టుబడిదారీ విధానం సంపూర్ణంగా అభివృద్ధి అయినచోట మనదేశంలోలాగా వ్యవసాయదారులు తగ్గిపోయినా, మధ్యతరగతి బాగా పెరిగారు. కార్మికవర్గానికి, మధ్యతరగతికి ఉన్న వ్యత్యాసం అభివృద్ధి చెందిన దేశాల్లో వర్గపోరాటాలు అభివృద్ధి చేయడానికి కొంత ఆటంకం కలిగిస్తున్నది.

మనలాంటి వ్యవసాయ దేశాల్లో కార్మికవర్గం సంఖ్య పరిమితంగా ఉండి, కార్మికేతర వ్యవసాయ వర్గాలు బలంగా వుండడం విప్లవానికి అవసరమైన ఐక్య సంఘటన నిర్మాణానికి కొంత అదనపు శ్రమ కలిగిస్తున్నది.

అందువలన కార్మికవర్గం సంఖ్య మాత్రమే కాక, ఇతర వర్గాల ప్రత్యేకతలు కూడా విప్లవ గమనాన్ని ప్రభావితం చేస్తాయి. సాంకేతిక పరిజ్ఞానం, ఇతర అంశాలు మారినప్పటికీ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉండే వైరుధ్యాలు, దానిలో వచ్చే సంక్షోభాలు విప్లవోద్యమాల పరిస్థితుల్ని ప్రధానంగా నిర్ణయిస్తాయి తప్ప వివిధ తరగతుల సంఖ్యా బలాలు కాదు.

**బూర్జువా పార్టీలు విధానపరంగా ఒకదానికొకటి ప్రత్యామ్నాయం కాదని చెబుతున్నాం. ఎన్నికలు వచ్చినపుడు ఆ పార్టీలతోనే మనం సర్దుబాట్లు చేసుకుంటున్నాం. ఇది సరైనదేనా?**

బూర్జువా పార్టీలంటేనే ఒక వర్గానికే సేవచేస్తాయనేది అర్థం. కాంగ్రెస్, బి.జె.పి., తెలుగుదేశం, టిఆర్ఎస్, వైఎస్ఆర్‌సిపి అని ఏ పేర్లు పెట్టుకున్నా అవన్నీ బూర్జువా పార్టీలే అయినందున స్వల్ప మార్పులతో ఒకే విధానాలను అనుసరించడం సహజం. కమ్యూనిస్టు పార్టీలు కార్మికవర్గానికి ప్రతినిధులుగా ఉన్నప్పుడు బూర్జువా వర్గానికి పూర్తి భిన్నమైన ప్రత్యామ్నాయ విధానాలను అనుసరిస్తేనే వాటి స్వభావం నిలబడుతుంది. అందుకే కమ్యూనిస్టు పార్టీలు బూర్జువా పార్టీలకు భిన్నమైన ప్రత్యామ్నాయ విధానాలను అనుసరిస్తాయి. మార్క్సిస్టుపార్టీ వామపక్ష ప్రజాతంత్ర కార్యక్రమాన్ని రూపొందించి, దాని సాధనకోసం కృషి చేయడం ఇందులో భాగమే.

అయితే ఎన్నికల్లో తక్షణ లక్ష్యాల సాధన కోసం కొన్ని సందర్భాల్లో బూర్జువా పార్టీలతో సర్దుబాట్లు చేసుకోవడం జరిగింది. దీనర్థం బూర్జువా పార్టీల కార్యక్రమాన్ని అంగీకరించడం కాదు. ప్రత్యామ్నాయ విధానాన్ని వదులుకోవడం కాదు. అయితే సుదీర్ఘకాలం బూర్జువాపార్టీలతో సర్దుబాట్లు చేసుకున్నప్పుడు ప్రత్యామ్నాయ కార్యక్రమానికి ప్రాధాన్యత తగ్గి, బూర్జువా పార్టీల కార్యక్రమాల పట్ల నిశితంగా వ్యవహరించటంలో లోపాలు జరిగాయని అనుభవం చెప్తున్నది. ఈ అనుభవం నుండి బూర్జువా, భూస్వామ్య పార్టీలతో అఖిలభారతస్థాయిలో ఒడంబడికలు, సంఘటనలు ఉండకూడదన్న అభిప్రాయానికి ఇప్పుడు వస్తున్నాం. అలాగే బూర్జువా వర్గంలో తీవ్రమైన సంక్షోభం ఏర్పడి, ప్రత్యామ్నాయ కార్యక్రమానికి కలిసి వచ్చే సందర్భాలు వచ్చినప్పుడు, వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయ అభివృద్ధికి తోడ్పడే అవకాశముున్నప్పుడు, బూర్జువాపార్టీల్లోని చీలికలు ఎన్నికల్లో ఉపయోగపడే అవకాశమున్నప్పుడు వాటిని వినియోగించుకోవడానికి వెనుకాడాల్సిన పని లేదు. ఈ విషయం నిర్దిష్టమైన సందర్భాలను బట్టి నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.

# పుచ్చలపల్లి రామచంద్రా రెడ్డి

**(2వ పేజీతరువాయి)**

సోమయ్యా డాక్టర్లుగానూ, రహీం కాంపౌండరు గానూ చేరారు. ఆసుపత్రిలో పనిచేసేవారు కనీస జీవితావసరాలకు సరిపోయే డబ్బే తీసుకుంటూ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తూ పేద ప్రజలకు సేవ చేయాలన్నది వారి లక్ష్యం. ఈ ముగ్గురు డాక్టర్లూ ఎంతో సేవాభావంతో, ప్రేమతో వైద్యం చేయ డం వల్ల డాక్టరు రామ్ ప్రాక్టీసు పెరిగింది. తన వద్దకు వచ్చే పేదలకు ఉచితంగా వైద్యం చేసేవాడు. తాను వెళ్తుండగా ఎవరైనా ఆరోగ్యం బాగాలేక రోడ్డు పక్కన పడిపోయి ఉంటే చేతుల్తో ఎత్తుకుపోయి రిక్షాలో పెట్టి ఆసుపత్రికి తీసుకువెళ్లి వ్యాధి నయం చేసి పంపేవాడు. బీదపిల్లలు జాలిగా కనిపిస్తే వాళ్లను దగ్గరకు పిలిచేవాడు. వాళ్లకు కావలసినవి కొనిపెట్టే వాడు. వాళ్లు తింటుంటే సంతోషపడేవాడు. వాళ్లతోపాటు తానూ కూర్చొని తినేవాడు. తన చిన్నప్పట్నించీ ఎప్పుడు రిక్షా ఎక్కినా దిగి వెళ్లేటప్పుడు రిక్షా వ్యక్తికి డబ్బులిచ్చి నమస్కారం పెట్టేవాడు. ఇవన్నీ చూసిన ప్రజలు.. డాక్టరు రామ్‌ను 'పిచ్చి డాక్టరు' అని చెప్పుకునేవాళ్లు.

రెండో ప్రపంచ యుద్ధంలో సైన్యానికి సాయం చేయడం కోసం డాక్టరు రామ్, ఆయన భార్య సుగుణ, మిత్రుడు డాక్టరు సోమయ్య మిలటరీలో చేరాలనుకున్నారు. 1942లో సోమ య్య, సుగుణలను మిలటరీలోకి తీసుకున్నారు. కమ్యూనిస్టనే ముద్ర పడటంతో రామ్‌ను తీసుకోలేదు. ఆ దశలో రామ్ నెల్లూరు ఆసుపత్రి మూసేసి, ఉన్నత విద్య అభ్యసించడానికి మద్రాసు వెళ్లాడు. స్టాన్లీ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తూ ఎంఎస్ పరీక్షకు హాజరుకావాలన్నది ఆయన కోరిక. 1943లో బెంగాల్లో కరువొచ్చింది. కొన్ని లక్షల మందిని బలి తీసుకున్న ఆ కరువు సహాయక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రామ్ మద్రాసు, నెల్లూరుల నుంచి కొంతమంది యువకులను తీసుకొని బెంగాల్ వెళ్లాడు. నిద్రాహారాలు మాని కరువు పీడితులకు సేవ చేశాడు. అదే సమయంలో కరువు ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన గాంధీజీ.. రామ్ సేవల్ని చూసి ప్రశంసించారు. కరువు ప్రాం తాల్లో గుట్టలుగా పడివున్న శవాలను చూసి రామ్ చలించిపోయాడు. చాలా రోజుల పాటు తిండి లేదు. మామూలు మనిషి కాలేకపో యాడు. రెండో ప్రపంచయుద్ధం ముగియడంతో డాక్టరు సోమయ్య, సుగుణ మిలటరీ నుంచి తిరిగి వచ్చేశారు.

సోమయ్య మద్రాసులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా, సుగుణ మద్రాసు ఆసుపత్రిలో చేరింది. ఉదయాన్నే అల్పాహారం తీసుకుని ఆసుపత్రికి వచ్చేవాడు రామ్. రోజుకు 16 గంటలపాటు ఆసుపత్రిలో గడిపేవాడు. వైద్యం తప్ప వేరే ప్రపంచం ఉండేదికాదు. 1946-47 కాలంలో రామ్‌కూ, సుగుణకూ అభిప్రాయబేధాలొచ్చాయి. సుగుణ కోయం బత్తూరు వెళ్లిపోయి అక్కడే ప్రాక్టీసు పెట్టుకుంది. దీంతో రామ్ మానసికంగా దెబ్బతిన్నాడు. డయాబెటిస్ వచ్చింది. తర్వాత రామ్.. రాజ్యలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. రామ్ దంపతులకు నలుగురు పిల్లలు. పెద్దబ్బాయి మిత్ర. రెండో సంతానం సత్య. మూడు, నాలుగో సంతానం విద్య, జ్యోతి. రామ్ మళ్లీ నెల్లూరు వచ్చాడు. శంకర అగ్రహారంలో ప్రాక్టీసు పెట్టాడు. మళ్లీ ఆసుపత్రి ప్రారంభించాడని తెలియగానే పూర్వం ఆయన దగ్గరకు వచ్చిన రోగులంతా రావడం మొదలుపెట్టారు. వారికి ఆయన తక్కువ మందులు రాసేవాడు. ఏ షాపువారయినా నాసిరకం మందులిచ్చినా, తాను రాసిందిగాకుండా వేరేది ఇచ్చినా వారిని కొట్టినంత పనిచేసేవాడు. మిగతా డాక్టర్లతో మాట్లాడి వారి భాగస్వామ్యంతో 'డాక్టర్స్ కో ఆపరేటివ్ స్టోర్సు' ప్రారంభించాడు. దీనివల్ల లాభ నష్టంలేని రీతిలో రోగులకు మందులు లభించేవి.

1948-52 మధ్యకాలంలో తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నవారికి అన్నివిధాలా సాయపడ్డాడు. 1953లో రాయల సీమలో భయంకరమైన కరువురాగా, విరాళాలు వసూలు చేసి సహాయ కార్యక్రమాలకు తోడ్పడ్డారు. రామ్ ఇంట్లో మార్క్సిస్టు అధ్యయన తరగతులు జరుగుతుండేవి. సమ సమాజ స్థాపనకోసం మార్క్సిజాన్ని నమ్మి ఆచరించాడు. నెల్లూరు జిల్లాలో మోటారు కార్మికులు, బీడీ కార్మికుల పక్షాన అనేక ఉద్యమాలకు నేతృత్వం వహించాడు. రిక్షా కార్మిక సంఘాన్ని కూడా నడిపాడు. 1956, 57 సంవత్సరాల్లో నెల్లూరు మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో రామ్, రాజ్యలక్ష్మి కౌన్సిలరు పదవులకు పోటీచేసి గెలి చారు. వారు తమ వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు. నెల్లూరులో హిందూ-ముస్లిముల మధ్య తగాదాలను పరిష్కరించి సామరస్యం కుదర్చటానికి నిద్రాహారాలు మాని తీవ్రంగా కృషి చేశాడు. నష్టపోయిన ముస్లిము కుటుంబా లను ఓదార్చి వారికి అండగా నిల బడ్డాడు. నెల్లూరులో కలరా విజృంభించినప్పుడు తన ఆసుపత్రిలోనే సెలైన్ తయారు చేసే ప్లాంటునొక దాన్ని ఏర్పాటుచేశాడు. ఆ జిల్లాలో కలరా నిర్మూ లనకు 500 చోట్ల వైద్య సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశాడు. అప్పట్లో ఎక్స్-రే తీయాలంటే పది రూపాయలు తీసుకునేవారు. రామ్ రూపాయికే ఆ సదుపాయం కల్పించడం గురించి ప్రజలు వింతగా చెప్పుకునేవారు. డాక్టరు రామ్ బ్లేడుతో శస్త్రచికిత్స చేస్తాడని ఆ రోజుల్లో ప్రజలు ఆశ్చర్యంగా చెప్పుకునేవారు. ఇది తోటి డాక్టర్లకూ ఆశ్చర్యంగొలిపేది. అలా ఎన్నో వందల ఆపరే షన్లు చేశారు. ఏ ఒక్కటీ తప్పు డయాగ్నొసిస్ కాలేదు. ఆయన చేసే పనులు చూసి 'పిచ్చి డాక్టరు' అనేవారు. అయినా ఆయనను అమితంగా గౌరవించేవారు. ఆయన రోగాలను నయం చేసే తీరును ఇప్పటికీ ప్రజలు కథలుకథలుగా చెప్పుకుంటారు. ఉన్నత చదువులు చదువుకోవా లంటే మద్రాసు వెళ్లాల్సిరావడంతో ఆలోటు తీర్చేందుకు జిల్లాలో ఓ ఉన్నత విద్యాసంస్థను నెలకొల్పాల్సిన అవసరాన్ని గుర్తించాడు. ఆయన కృషితో దొడ్ల రామచంద్రా రెడ్డి కావలిలో నెలకొల్పినదే 'జవహర్ భారతి'. ఈ సంస్థ విభిన్న రంగాల్లో ఎందరో ఉత్తమోత్తములను సమాజానికి అందించింది. డాక్టర్ రామ్, డాక్టర్ శేషారెడ్డి (రామ్ మేన ల్లుడు. వైద్యుడు) ఇద్దరూ కమ్యూ నిస్టులుగా పేరొందారు. రామ్ స్థాపించిన ప్రజా వైద్యశాల పేదలకు ఎనలేని సేవ చేసింది. రామ్‌నూ, శేషారెడ్డినీ జైల్లో పెడితే ఆసుపత్రి దానంతటదే మూతపడు తుందని ప్రభుత్వం నమ్మకం. అందుకే 1965లో రామ్‌పైనా, శేషారెడ్డిపైనా అరెస్టు వారెంట్లు జారీ చేశారు. ఆ సందర్భంగా శేషారెడ్డిని అరెస్టు చేశారు. రామ్ పోలీసులకు దొరక లేదు. రహస్య జీవితం గడపటానికి వెళ్లాడు. వీరిద్దరూ లేక పోయినా ఆసుపత్రి మూతపడలేదు. రామ్ ఆరునెలలు రహస్య జీవితం గడిపేసరికి ఆరోగ్యం పాడయి ంది. అన్న సుందరయ్య ఆరోగ్యం బాగా లేదని తెలిసి వెంటనే రహస్య జీవితం నుంచి బయటకు రావడంతో ఆయనను పోలీ సులు అరెస్టు చేశారు. తరువాత ఆయనను పెరోల్‌పైన విడుదల చేశారు. సోవియట్ రాజధాని మాస్కోలో సుంద రయ్యకు ఆపరేషను జరిగి ఆయన కోలుకున్న తరువాత రామ్ స్వదేశానికి తిరిగివచ్చాడు. వచ్చీ రాగానే పోలీసుల ముందు హాజరయ్యాడు. కొంతకాలం జైలులో ఉంచారు. అక్కడ ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. 1967 ఏప్రిల్ 17 రాత్రి రామ్ కన్నుమూశాడు. రామ్ నెలకొల్పిన ప్రజావైద్య శాల నెల్లూరులోనేగాక రాష్ట్రమంతటా చాలా ప్రఖ్యాతి గాంచింది. ఎందరో వైద్యులు వృత్తిలో నైపుణ్యం సాధించడానికి అందులో పనిచేసి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రజావైద్య శాలలు ప్రారంభించి విశిష్ట సేవలంది స్తున్నారు.

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-02-2015 Postal Regd. No L1/SD/407/13-15

# ఉన్నత విద్య వ్యాపార సరుకు కాకూడదు



**- ఫిలిప్ జి. అల్త్ బాచ్**

ఉన్నత విద్యా విధానాలకు దేశంలో చాలా ప్రాధాన్యత ఉన్నది. అందులోనూ, ఈ దేశంలో తమ దుకాణాలు తెరవాలని చాలా విదేశీ విశ్వవిద్యాలయాలు పొంచి కూర్చున్న తరుణంలో ఈ విధానాలకు మరింత ప్రాధాన్యత వుంది. ముంబాయి-పూణే-నాసిక్ ఏరియాలో 40 అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లను నెలకొల్పేందుకు తమకు స్థలం కావాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని విదేశీ సంస్థలు కోరినట్లు పత్రికల్లో వార్తలొచ్చాయి. మన ఉన్నత విద్యా మార్కెట్‌లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే ఈ విశ్వవిద్యాలయాల వెనుక విదేశీ ప్రయోజనాలు ఎంతగా వున్నాయో తెలుసుకునేందుకు ఇదొక సంకేతం మాత్రమే. కొన్ని విదేశీ విశ్వవిద్యాలయాలు ఇప్పటికే భారత్‌లోని భాగస్వాములతో కలిసి పనిచేయటం మొదలు పెట్టాయి. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే త్వరలో భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద విదేశీ విద్యాలయాల మార్కెట్‌గా మారనున్నది. ఇంకోవైపు దేశంలో వున్నత విద్య చాలామందికి అందుబాటులో లేకుండాపోతున్నది. యూనివర్శిటీ విద్యనభ్యసించే వయో గ్రూపులో పదిశాతం మంది మాత్రమే ఉన్నత విద్యను పొందగలుగుతున్నారు.

విదేశీ విశ్వవిద్యాలయాల్లో వాటాదారులు కొందరు ఉన్నత విద్యను పక్కా వ్యాపార సరుకుగా భావిస్తున్నారు. అంతర్జాతీయస్థాయిలో విద్య అమ్మకాలు, కొనుగోళ్ళను జోరుగా సాగించాలని చూస్తున్నారు. అందుకే విద్యా ఉత్పత్తుల్లో వేటిపైనా ఎలాంటి ఆంక్షలూ వుండకూడదని, వీటి మార్కెట్‌కు దేశాలు తమ సరిహద్దులను బార్లా తెరచి వుంచాలని వీరు కోరుతున్నారు. లాభార్జనే ధ్యేయంగా కలిగిన ఉన్నత విద్యా కంపెనీలు, ప్రైవేటు యూనివర్శిటీలు, ఇంటర్నేషనల్ టెస్టింగ్ కంపెనీలు, కొన్ని యూనివర్శిటీలు, అమెరికా, ఇంగ్లండ్ వంటి దేశాల ప్రభుత్వ ఏజెన్సీలు ఈ ఉద్దేశ్యంతోనే విద్యా ఎగుమతుల్లో జోరుగా పాల్గొంటున్నాయి. ఉన్నత విద్య వ్యాపార సరుకే తప్ప మరొకటి కాదనే భావనను ప్రజలకు ఇవి మెల్లగా ఎక్కిస్తున్నాయి. విద్యా వ్యాపారులు ఏయే ఉత్పత్తులకు తక్షణ డిమాండ్ వుందో వాటినే అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని చూస్తారు. అంతేకానీ పరిశోధనా యూనివర్శిటీలపైన, అణగారిన వర్గాలకు విద్యలో సమానావకాశాలు కల్పించడం వంటివి వీరికి ఏమాత్రమూ పట్టవు.

ఈ ఉన్నత విద్యా వ్యాపారంలో దండిగా లాభాలను దండుకోవడమే వీరి లక్ష్యం. ఇందుకోసం బాగా డిమాండ్ వున్న విద్యా కోర్సులను ఆఫర్ చేస్తారు. సైన్స్ లేబరేటరీలు, పరిశోధనా సదుపాయాలు వంటి భారీ ఖర్చుతో కూడిన మౌలిక వసతుల కల్పనలో పెట్టుబడులు పెట్టటానికి ఈ విదేశీ విద్యావ్యాపారులు ఆసక్తి చూపిన దాఖలాలు చాలా తక్కువ. వ్యాపార కంపెనీల మాదిరిగానే వీరు కూడా ఉన్నత విద్యారంగంలో తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ లాభాలు పిండుకోవడమెలా అన్నదానిపైనే దృష్టి పెడతారు. బ్రిటన్, ఆస్ట్రేలియావంటి దేశాలు ఉన్నత విద్యా ఎగుమతుల నుంచి లాభాలు ఆర్జించటానికి ప్రత్యేకంగా ఒక జాతీయ విధానాన్నే రూపొందించాయి. బ్రిటీష్ కౌన్సిల్ వంటి బ్రిటన్ విద్యాసంస్థలు తమ విద్యా ఎగుమతులకు వీలున్నంత ఎక్కువ అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నాయి.

భారత్ మిగతా ప్రపంచంతో మరింత సన్నిహితంగా మెలగాలనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఇందుకోసం విద్యాపరమైన దేశ సార్వభౌమత్వాన్ని మాత్రం ఫణంగా పెట్టరాదు. ఉన్నతవిద్యను అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్మకాలు, కొనుగోళ్ళు చేసే అచ్చమైన వ్యాపార సరుకుగా పరిగణించడం ఏవిధంగానూ సమర్ధనీయం కాదు. ఉన్నత విద్య జాతి నిర్మాణంలోను, దేశ సౌభాగ్యంలోను కీలకపాత్ర పోషిస్తుందనే విషయం మరువరాదు.

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.9, No.10. Published on February 1, 2015